వాసుకి
(వివిధ అంశాలపై విశ్లేషణ)
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
9-9-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 221 పేజీలు: 10+4 వెల: 6.50

శాసనసభలో విషాదం.. నవీన్ మిట్టల్ పిఎస్ గుండెపోటుతో మృతి 3

కొత్తూరులో రూ. 1.42 కోట్ల హాష్ ఆయిల్ స్వాధీనం 7

## కౌన్సిల్‌లో హైటెన్షన్

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ శాసనమండలి ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును మార్షల్స్ బలవంతంగా ప్రాంగణం వెలుపలికి తరలించారు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి నెలకొంది. మండలి ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకు ఎమ్మెల్సీ తాతా మధు ప్రయత్నించారు. అయితే, ఆయనపై ఇప్పటికే >>2

### స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండించిన అసెంబ్లీ 6

### ప్యానల్ స్పీకర్లుగా కడియం, కూనంనేని, బాలూ నాయక్, కౌసర్ నియామకం

ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్‌రెడ్డిపై
# సస్పెన్షన్ వేటు


అసెంబ్లీ ప్రాంగణం నుంచి తాతా మధు, నవీన్‌ను వ్యాన్‌లో తరలిస్తున్న పోలీసులు

అసెంబ్లీ సిఫారసు మేరకు ప్రస్తుత సమావేశాలు ముగిసే దాకా వారిపై చర్య
మండలిలో తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు
మూజువాణి ఓటుతో ఆమోదించిన చైర్మన్ సుఖేందర్‌రెడ్డి
మధు, నవీన్‌ను అడ్డుకొని పంపిన మార్షల్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు8:** శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమం డలిలో మంత్రి శ్రీధర్ బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన చైర్మన్ సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీ లను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. స్పీకర్ గౌరవానికి భంగం కలిగే వ్యాఖ్యలు చేసన >>2


కౌన్సిల్ చైర్మన్ ఛాంబర్ వద్ద హరీష్ ప్రభృతుల ధర్నా

### ఆ ఇద్దరు ఎమ్మెల్సీలపై కేసు నమోదు
అరెస్టు, బెయిలు మంజూరు 2
హైకోర్టుకు అప్పీలు చేయాలని సర్కారు నిర్ణయం


మంగళవారం హకీంపేట వద్ద కెటిఆర్, ఇతర బిఆర్ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు

# ఎర్రవెల్లి ఉద్రిక్తం

కెటిఆర్, హరీష్, ఇతర బిఆర్ఎస్ నేతలను దారిలోనే అడ్డుకొన్న పోలీసులు
వారిని బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ పిఎస్‌లకు తరలింపు
కాంగ్రెస్, బిఆర్ఎస్ వర్గాల ఘర్షణ, చెదరగొట్టిన పోలీసులు

**హైదరాబాద్, (కంటోన్మెంట్) సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు రెండవ రోజున మధ్యలోనే వెళ్లిపోయిన బిఆర్ఎస్ ఎం ఎల్ఎలు హరీష్ రావు, కెటిఆర్ తదితరులు హుటాహుటిన ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో కేసీఆర్‌ను కలిసేందుకు వెళుతుండగా శివార్లలోని హకీంపేట్ వద్ద పోలీసులు వారిని నిలువరించారు. ఈ సందర్భంగా పోలీసులతో హరీష్ రావు, కెటిఆర్ సహా ఇతర ఎంఎల్ఎలు వాగ్వివాదానికి దిగారు. అయితే ఎరవెల్లిలో 144 సెక్షన్ అమల్లో >>2

### ఉద్యమాలతో తెలంగాణ రణరంగం 3

### రాహుల్‌గాంధీ ఉన్న విమానానికి ల్యాండింగ్ ట్రబుల్ 3



### వచ్చే యేడాది మే, జూన్‌లలో బుల్లెట్ రైలు 5
కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



### ఇరాన్‌తోయుద్ధం ముగిస్తే భారీగా తగ్గనున్న గ్యాసోలిన్ ధరలు 5
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్




మంగళవారం అసెంబ్లీలో ప్రసంగిస్తున్న డి.సిఎం భట్టి

## ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చ

స్పీకర్‌పై దూషణ మొత్తం చట్టసభకే అవమానం: డి.సిఎం భట్టి

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** శాసనసభాపతి స్థానంలో ఉన్న సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పై ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యులు చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తించిన తీరు యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని, ఇది కేవలం ఒక వ్యక్తికి జరిగిన అవమానం కాదని, మొత్తం చట్టసభకు జరిగిన ఘోర అవమానమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రతిపాదించిన తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తూ డిప్యూటీ సీఎం మాట్లాడారు. సభాపతి స్థానంలో కూర్చున్న వ్యక్తి కేవలం ఒక వ్యక్తి కాదని, ఆయన సభ గౌరవానికి, స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. సభాపతిని అవమానించడం అంటే మొత్తం సభను అవమానించడమేనని స్పష్టం చేశారు. ఇది సభా ధిక్కారానికి సమానమైన వ్యవహారమని అన్నారు. సభాపతిగా గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అన్ని పార్టీల సభ్యులు ఎన్నుకున్నారని, ఆయనను ఆ స్థానంలో కూర్చోబెట్టి సభను నడిపించే బాధ్యత అప్పగించారని గుర్తుచేశారు. ఆయన దళిత వర్గం నుంచి ఎదిగి వచ్చిన వ్యక్తి కావడం అదనపు గౌరవానికి కారణమని, అయితే ఆయనను "దళిత స్పీకర్‌గా మాత్రమే చూడటం సరికాదని.. ఆయన మొత్తం శాసనసభకు స్పీకర్ అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఇంకా తమ పాత భూస్వామ్య, ఫ్యూడల్ మనస్తత్వాన్ని మర్చిపోలేదనడానికి ఈ సంఘటనే సజీవ నిదర్శనమని అన్నారు. దళిత వర్గం నుంచి వచ్చి సభాపతి స్థానంలో కూర్చున్న ప్రసాద్ కుమార్‌ను గౌరవించకపోవడం బిఆర్ఎస్ పార్టీ నైజానికి అద్దం పడుతోందన్నారు. "అధికారం కోల్పోయామనే ఉక్రోషంతో, తిరిగి రాష్ట్రాన్ని తమ గుప్పెట్లోకి తీసుకోవాలనే దుర్బుద్ధితో బిఆర్ఎస్ నాయకత్వం ఈ కుట్రలకు పాల్పడుతోంది" అని మండిపడ్డారు. సభలో జరిగిన రచ్చ ఆషామాషీగా జరిగింది కాదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు రోజు ఫామ్ హౌస్‌లో బిఆర్ఎస్ ఎల్పీ మీటింగ్ జరిగిందని, ఆ ఫామ్ హౌస్ కాన్స్పిరసీలోనే ప్రజాస్వామ్యంపై దాడి చేసేందుకు పథకం రచన చేశారని ఆరోపించారు. కాన్స్పిరేటర్లు నడిపించిన రోల్ ప్లేయర్లుగా కొందరు >>2



ప్రధాని పర్యటన వేళ
## భద్రతా లోపం!
ముంబయిలో నకిలీ ఐడి, తుపాకులతో ఇద్దరు అదుపులోకి

**ముంబై, సెప్టెంబరు 8:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరు కానున్న ముంబైలోని బాంద్రాకుర్లా కాంప్లెక్స్‌లో ఉన్న నీతా ముఖేశ్ అంబానీ కల్చరల్ సెంటర్ నుంచి ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ముందు రోజు అర్ధరాత్రి భద్రతా ప్రోటోకాల్ డ్రిల్ సందర్భంగా చోటుచేసుకున్నట్లు ముంబై పోలీసులు మంగళవారం >>2

## మంత్రుల శాఖలు మారొచ్చు



పిసిసి చీఫ్‌గా చెప్పా, హైకమాండ్, సిఎం చూసుకొంటారు: మహేష్ గౌడ్
రాహుల్‌ని ప్రధాని చేయాలన్నదే మా ఆకాంక్ష

**హైదరాబాద్, సెప్టెంబరు 8,ప్రభాతవార్త:** కేబినెట్ విస్తరణ శాఖల మార్పు పూర్తిగా అదిష్టానం పరిధిలోఉంటుందని టిపిసిసి అధ్యక్షుడిగా ప్రస్తుతం ఉన్న మంత్రుల శాఖలన్నింటిని మార్పుచేయాలని సూచించానని టిపిసిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మంగళవారం విలేఖరులతో చిట్‌చాట్ చేస్తూ కేబినెట్ విస్తరణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైకమాండ్ చూసుకొంటుందని తాను టిపిసిసిచీఫ్‌గా చెప్పాల్సింది చెప్పానని అన్నారు. నేను మంత్రి కావాలని కోరుకోలేదనీ, నన్ను ఇంత వరకు ఎవరు అడగలేద అని విలేఖరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. తనను మంత్రి వర్గంలోకి తీసుకోవాలా లేదా అనే విషయం అదిష్టానంకు వదిలివేశానని ప్రస్తుతం రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడానికి పార్టీని నడిపించే అత్యంత బాధ్యతాయుతమైన పనిని నిర్వహిస్తున్నానని శక్తివంచనలేకుండా సంస్థాగతంగా కాంగ్రెస్ బలోపేతం కోసం కృషిచేస్తున్నానని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి ని చేయాలని మా అందరి ఆకాంక్ష అని చెప్పారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల టీషర్ట్ పై అభ్యంకతకర వ్యాఖ్యలు ఉన్నాయనే అడ్డుకున్నారనీ ఆయన వివరించారు ఎమ్మెల్సీ తాత మధు వ్యాఖ్యలను ప్రతిపక్ష నేత కెసిఆర్ ఇప్పటివరకు ఖండించలేదని వాపోయారు. ఎమ్మెల్యే శంకర్ వ్యాఖ్యలు వినలేదనీదళితులకు కాంగ్రెస్ లో అత్యున్నత పదవులు ఇచ్చామనీ చెప్పారు. ప్రతిపక్ష నేత హోదా పదవినుంచి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి భట్టి విక్రమార్కను తొలగించారని చరిత్రను వివరించారు. అర్ధరాత్రి రాజయ్యను బర్తరఫ్ చేశారనీ కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఫెయిల్ అయ్యాడని అభిప్రాయపడ్డారు. తాతా మధు మాట్లాడింది బిఆర్ఎస్ స్క్రిప్ట్ స్టాటజీ ఫ్రేమ్ చేసి తాతా మధును పంపారనీ తెలిపారు. కెసిఆర్ పది ఏండ్లు ముఖ్యమంత్రిగా ఉండి దళిత స్పీకర్‌ను అవమానిస్తే ఖండించలేదని ఆవేదన చెందారు. కెసిఆర్ మహిళ లెకుండా క్యాబినెట్ నడిపిండనీ పదేళ్లలో కెసిఆర్ ఎప్పుడు అంబేద్కర్ కు దండ వేయలేదని నిందించారు కెసిఆర్ కంటే రేవంత్ రెడ్డికి సామాజిక స్పృహ ఎక్కువ అని శ్లాఘించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అధ్యక్షా అని పిలవాల్సి వస్తుంది అని కెసిఆర్ అసెంబ్లీ రాలేదని అన్నారు. ఏ రాష్ట్రంలో అపొజిషన్ లీడర్ పామ్ హౌస్ లో ఉండలేదనీ 22ఎ ను సమూలంగా సమీక్షించి,సవరించాలని సిఎంఅనుకుంటుండని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి అభ్యర్థుల వడ పోత జరిగిందనీ తెలిపారు. >>2



ఇందిరమ్మ టవర్స్
## ధరావతు వాపస్
ఏ అక్కౌంట్ నుంచి చెల్లిస్తే దాని ద్వారానే తిరిగి చెల్లింపు
హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ పథకంలో దరఖాస్తుదారులు చెల్లించిన ధరావతు తిరిగి చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌లో ఇండ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దరఖాస్తు సమయంలో ధరావతు (ఇఎండి)గా పదివేల రూపాయలను స్వీకరించారు. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇఎండి >>2

# ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

ఎగుమతులు పెంచేందుకు వ్యూహం
మరింత భారీగా బియ్యం కొంటాం: మంత్రి ఉత్తమ్

**హైదారబాద్,సెప్టెంబరు 8,ప్రభాతవార్త:** తెలంగాణ భారీ పరిమాణంలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ ఉన్నాయని ఫిలిప్పీన్స్‌కు ఆహారభద్రత కలిగించే రీతిలో బియ్యం ఎగుమతి చేయస్తామని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హామి ఇచ్చారు. మంగళవారం న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఆ దేశ క్యాబినెట్ సభ్యుడు ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్‌తో మంత్రి ఉత్తమ్ సమావేశమయ్యారు. తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులను పెంచడంతోపాటు తెలంగాణ-ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్యాన్ని మరింత విస్తరించే అవకాశాలపై ఇరువురు నేతలు వివరణాత్మకంగా చర్చించారు.భారతదేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా అవతరించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు..తెలంగాణ నుంచి బియ్యం దిగుమతి చేసుకోవాలనే ప్రతిపాదనపై కార్యదర్శి లారెల్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ నుంచి మరింత పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన తెలిపారు. సంబంధిత ప్రభుత్వ సంస్థలు, గుర్తింపు పొందిన దిగుమతిదారులు, ఎగుమతిదారులు, రైస్ మిల్లర్ల భాగస్వామ్యంతో ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే విధానంపై చర్చించారు. >>2


మంగళవారం న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి లారెల్‌తో భేటీ అయిన మంత్రి ఉత్తమ్

### వారంటు ఉండగా విదేశాలకు ఎలా?



ఐఎఎస్ అధికారులపై హైకోర్టు ఆగ్రహం 7


లోక్ భవన్‌లో గవర్నర్ శుక్లాకు వినతి పత్రం అందజేస్తున్న రాంచందర్‌రావు తదితరులు

రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలు
## ఇప్పించండి
గవర్నర్‌ను కోరిన బిజెపి నేతలు
కాంగ్రెస్, బిఆర్ఎస్ డైవర్షన్ పాలిటిక్స్: పార్టీ చీఫ్ రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ ప్రతినిధి బృందం >>2

# ఆ ఇద్దరు ఎమ్మెల్సీలపై కేసు నమోదు


## అరెస్టు, బెయిలు మంజూరు

## హైకోర్టుకు అప్పీలు చేయాలని సర్కారు నిర్ణయం

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దూషించిన అభియోగాలపై బిఆర్ఎస్ ఎంఎల్‌సిలను పోలీసులు మంగళవారం ఉదయం అరెస్టు చేశారు. సోమవారం ఇదే అంశం శాసనసభను కుదిపేయగా రాత్రి బాగా పొద్దు పోయిన తరువాత స్పీకర్ ప్రసాద్ కుమార్ ఓఎస్‌డి వెంకటేశం దీనిపై సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు బి ఆర్ఎస్ ఎంఎల్‌సిలు తాత మధు, నవీన్ రెడ్డిలపై ఎస్‌సి ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు బిఎన్ఎ స్‌లోని 352 రెడ్‌విత్ 3 (5), 3 (1) ఆర్, 3 (2) (విఎ), 3 (2) (విఐఎ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీని తరువాత వెంటవెంటనే జరిగిన పరిణామాల తరువాత మంగళవారం ఉదయం ఏడు గంటల సమయంలో హిమాయత్‌నగర్‌లోని ఎంఎల్‌ఎ క్వార్టర్స్‌లో వుంటున్న మధును టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ క్వార్టర్స్ వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బిఆర్ఎప్ శ్రేణులు భారీగా తరలిరాగా వారిని పోలీ సులు చెదరగొట్టి మధును తమ వెంట తీసుకువెళ్లి నారాయణగూడ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇదే సమయంలో మరో పోలీసు బృందం కోకాపేట్‌లో వుంటున్న ఇంకో ఎంఎల్‌సి నవీన్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను కూడా అదుపులోకి తీసుకుని నేరుగా నారాయణగూడ పోలీసు స్టేషన్‌కు తరలించింది. దీని తరువాత నారాయణగూడ పోలీసు స్టేషన్‌లో ఉదయం 10 గంటల వరకు హైడ్రామా చోటుచేసుకుంది. బిఆర్ఎస్ శ్రేణులు భారీగా పోలీసే స్టేషన్‌కు తరలిరాగా వారిని పోలీసులు చెదరగొట్టారు. అనంతరం ఎంఎల్‌సిలు మధు, నవీన్ రెడ్డిలను గాంధీ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించి అక్కడి నుంచి నేరుగా నాంపల్లి కోర్టుకు తరలించారు. నాంపల్లి కోర్టులో అటు పోలీసు శాఖ తరపు న్యాయ వాది, బిఆర్ఎస్ తరపు న్యాయవాదుల మధ్య మూడు గంటల పాటు వాద ప్రతివాదనలు జరిగాయి. పోలీసు శాఖ తరపున వాదించిన న్యాయ వాది ఎంఎల్‌సిలుగా వున్న వారు స్పీకర్‌ను కులం పేరుతో దూషిం చారని, ఇది సరైన చర్య కాదని, ఇందుకగానూ వీరిపై కఠిన చర్యలు తీసు కోవాల్సి న అవసరం వుందని, ఇద్దరిని వెంటనే రిమాండుకు తరలించాలని ఆయన కోర్టును కోరారు. చట్ట సభల్లో వున్న వారు ఇలాంటి చర్యల కు పాల్పడడం వల్ల సమాజంలో రాజ్యాంగ వ్యవస్థల పట్ల అవహేళన ఏర్పడుతుందని ఆయన వాదించారు. దీనికి సంబంధించి తమ వద్ద వు న్న వీడియోలతో పాటు ఇతర ఆధారాలను, రికార్డులను న్యాయవాది కోర్టుకు సమర్పించారు. కాగా ఈ వాదనలతో బిఆర్ఎస్ తరపు న్యాయవా ది ఏకీభవించలేదు. ఇది సర్కారు కావాలని చేసిన కుట్రగా ఆయన అభివర్ణించారు. తమ పార్టీ ఎంఎల్‌ఎలు స్పీకర్‌ను దూషించలేదని, ఇదంతా కల్పితమని ఆయన వాదించారు. పోలీసులే శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ వారిపై దాడికి దిగారని ఆయన వాదించారు. ఈ కే సులో ఇద్దరు ఎంఎల్‌సిలకు వెంటనే బెయిల్ ఇవ్వాలని న్యాయవాది కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న తరువాత ఇద్దరు ఎంఎల్‌సిల రిమాం డును న్యాయమూర్తి తిరస్కరించారు. ఇద్దరికి వ్యక్తిగత పూచీకత్తుపై న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. పది వేల పూచీకత్తుతో పాటు ఇ ద్దరు ష్యూరిటీలను వెంటనే సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు. దీనిపై తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు. కాగా కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు ఎంఎల్‌సిలు కోర్టులోనే పూచీకత్తులు స మర్పించి బెయిల్‌పై విడుదలయ్యారు.

**నాంపల్లి కోర్టు ఆదేశాలపై హైకోర్టులో సర్కారు అప్పీల్**

ఇదిలావుండగా స్పీకర్‌ను దూషించిన కేసులో అరెస్టయిన ఇద్దరు బిఆర్ఎస్ ఎంఎల్‌సిలు తాత మధు, నవీన్ రెడ్డిలను రిమాండుకు పంపేం దుకు నాంపల్లి కోర్టు తిరస్కరించడంతో పాటు వారికి వ్యక్తిగత పూచీకత్తుతో బెయిల్ ఇవ్వడాన్ని హైకోర్టులో అప్పీల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. శాసనసభ స్పీకర్‌ను కులం పేరుతో దూషించిన ఎంఎల్‌సిలకు నాంపల్లి కోర్టు బెయిల్ ఇవ్వడం పట్ల న్యాయ నిపు ణులతో ఇప్పటికే సర్కారు చర్చించినట్లు తెలిసింది. నాంపల్లి కోర్టు నిర్ణయంపై బుధవారం హైకోర్టులో అప్పీల్ చేయనున్నట్లు సమాచారం.



మంగళవారం పున్‌పున్ నదికి భారీ వరదలు రావడంతో పాట్నాలో జలమయమైన పలు కాలనీలు

## మంత్రుల శాఖలు మారొచ్చు

>> ఖమ్మం, నల్గొండ, వరంగల్ కు నాలుగు పేర్ల పరిశీలన చేశామని తెలిపారు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ కు నలుగురు పేర్లు పరిశీలనలో ఉన్నాయని వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ నియోజక వర్గాన్ని దామోదర్ రాజనర్సింహ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రెండు మూడు రోజుల్లో గ్రాడ్యుయేట్ అభ్యర్థుల పేర్లు ఫైనల్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. రెండో సారి ఇస్యును క్లోజ్ చేసుకోమని కొండా సురేఖ కు చెప్పాను అనిగుర్తు చేశారు.

## ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చ

>>బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభలో ప్రవర్తించారని, ప్రధాన సూత్రధారులు బిఆర్ఎస్ అత్యున్నత నాయకత్వమేనని స్పష్టం చేశారు. సభలో టీషర్టులు, నల్లచొక్కాలు ధరించి వాటిపై నినాదాలు రాసుకుని రావడాన్ని కూడా భట్టి తప్పుబట్టారు. సభలో బ్యాడ్జీలు, ప్రదర్శనాత్మక గుర్తులు ధరించరాదనే నిబంధనలు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపొందించిన రూల్‌బుక్‌లోనే ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. తమ ప్రభుత్వమే రూపొందించిన నిబంధనలను అమలు చేస్తున్న సభాపతిపై బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేయడం విడ్డూరమని అన్నారు. నిబంధనలు అమలు చేసినందుకే సభాపతిని పరుష పదజాలంతో దూషించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

సభాపతి తల్లిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై భట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం దళిత వర్గాలకు సంబంధించిన అంశం కాదని, తెలంగాణ సమాజం సంస్కారం, సంస్కృతి, మహిళల పట్ల గౌరవానికి సంబంధించిన సమస్య అని అన్నారు. మహిళల ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, అలాంటి సమయంలో ఒక మహిళను, ముఖ్యంగా సభాపతి తల్లిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. తాను గతంలో పదేళ్లపాటు ప్రతిపక్షంలో కూర్చున్న విషయాన్ని గుర్తు చేశారు. మైక్ ఇవ్వకపోయినా, సభలోకి రావడాన్ని అడ్డుకున్నా ప్రజాస్వామ్యాన్ని, సభాపతి స్థానాన్ని గౌరవించామని అన్నారు. బీఆర్ఎస్ అనుసరిస్తున్న విధానం స్పిరిట్ ఆఫ్ డెమోక్రసీని పూర్తిగా దెబ్బతీసేలా ఉందని ఆరోపించారు. ఇలాంటి కుట్రదారులు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని అన్నారు. ఫామ్‌హౌస్ కుట్రను శాసనసభ పూర్తిగా ఖండించాలని కోరారు. సభాపతిపై జరిగిన ఘటన తర్వాత కూడా బీఆర్ఎస్ నేతలు పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోవడం మరింత బాధాకరమని అన్నారు. సభలో మళ్లీ సభాపతి స్థానాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యవహరించడం, ఆగ్రహంతో ముందుకు దూసుకెళ్లే పరిస్థితి రావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవ పోరాటం నుంచి పుట్టిందని గుర్తుచేశారు.

## ఇందిరమ్మ టవర్స్ ధరావతు వాపస్

>> మొత్తాన్ని కూడా పూర్తిగా ఆన్ లైన్‌లోనే తీసుకున్నారు. ఈ ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తి అయినందున, లాటరీలో ఎంపిక కాని దరఖాస్తు దారులకు ఇఎండి మొత్తాన్ని తిరిగి చెల్లిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ విపి గౌతం తెలిపారు. దరఖాస్తు దారులు తాము ఏ అక్కౌంట్ నుంచి ఈ మొత్తాన్ని చెల్లించారో అదే అక్కౌంట్‌కు జమ చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఎటువంటి దరఖాస్తులను సమర్పించాల్సిన అవసరం లేదని, వారం రోజుల్లో గా ఈ చెల్లింపుల ప్రక్రియ పూర్తి అవుతుందని వెల్లడించారు.

అయితే కొంత మంది దరఖాస్తు దారులు, తాము ఆయా మీసేవా కేంద్రాల్లో నగదు ద్వారా చెల్లించామని, లేదా ఇతరుల అక్కౌంట్ నుంచి చెల్లించామని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చారు. ఇలా చెల్లించిన వారికి ఈ ధరావతు మొత్తం వారికే జమ అయ్యేలా చూడటానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్ సైట్ ద్వారా ఈ నెల 10 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. లేని పక్షంలో ఏ అకౌంట్ ద్వారా చెల్లింపు జరిగిందో, అదే అకౌంట్‌కు తిరిగి జమ అవుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌లో లాటరీ ద్వారా ఎంపికైన వారి వివరాల పరిశీలన కొనసాగుతున్నదనీ, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరికొన్ని రోజుల సమయం పడుతుందని వైస్ ఛైర్మన్ విపి గౌతం తెలిపారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి అయిన తరువాత అర్హులైన వారికి ఇండ్ల కేటాయింపు పత్రాలను (అలాట్మెంట్ లెటర్) అందచేస్తామన్నారు. ప్రతిపాదించిన 7340 ఇండ్లకు వెయిటింగ్ లిస్ట్‌తో కలిపి సుమారు 10 వేల మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. వారు సమర్పించిన వివరాల్లోని వాస్తవికతను క్షేత్రస్థాయిలో నిర్ధారించుకోడానికే వెరిఫికేషన్ ప్రక్రియ చేపడుతున్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ తరువాత ఈ పథకం కింద లబ్ధిదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని ఏ విధంగా, ఏ ఖాతాలో చెల్లించాలన్న దానిని అలాట్మెంట్ లెటర్‌లో పొందు పరుస్తామన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియకు లాటరీలో ఎంపికైన వారు సహకరించాలని వైస్ ఛైర్మన్ కోరారు. ఈ ఇండ్లకు సంబంధించిన సమాచారం కోసం ప్రత్యేకంగా హౌసింగ్ బోర్డు కార్యాలయాలచుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, వాట్సాప్/ఎస్ఎంఎస్ వంటి వాటి ద్వారా అవసరమైన సమాచారం అందిస్తున్నామని, ఇతరత్రా ఏమైనా సందేహాలుంటే కాల్ సెంటర్ కు ఫోన్ (నెం. 040 24603572) చేయవచ్చని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో భాగంగా తొలుత 16 నియోజకవర్గాల నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ ద్వారా ఇండ్లకేటాయింపు ప్రక్రియను కూడా పూర్తి చేయగా, మరో 4 నియోజకవర్గాల్లో ప్రస్తుతం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. చాంద్రాయణగుట్ట, ఎల్.బి.నగర్, ముషీరాబాద్, గోషామహల్ నియోజకవర్గాల పరిధిలో నిర్మించనున్న టవర్స్ లోని ఇండ్ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ దరఖాస్తులను గురువారం (10 వ తేదీ) వరకు సమర్పించవచ్చునీ, ఈ నియోజకవర్గాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎర్రవెల్లి ఉద్రిక్తం

>> వుందని, అక్కడ బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య గొడవ నడుస్తున్న తరుణంలో ఆ ప్రాంతానికి వెంటనే వెళ్లడం క్షేమం కాదని బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలను పోలీసులు వారించారు. అయితే పోలీసుల మాటలను బిఆర్ఎస్ ఎంఎల్ ఎలు ఖాతరు చేయకుండా వారితో గొడవకు దిగారు. ఒక దశలో హరీష్ రావు, కెటిఆర్ సహా ఇతర ఎంఎల్‌ఎలు తమ వాహనాలను అక్కడే వ దిలేసి ఎరవెల్లికి నడుచుకుంటూ వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలను పోలీసులు మరోసారి నిలువ రించగా వారు వినిపించుకోలేదు. దీంతో మల్కాజిగిరి పోలీసులు బిఆర్ఎస్ ఎంఎల్ ఎలను రెండు బృందాలుగా వేరుచేసి కొందరిని బోయిన్‌పల్లి పోలీసు స్టే షన్‌కు మరికొందరిని జవహర్‌నగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. హరీష్ రావుతో పాటు బండారు లక్ష్మారెడ్డి, వివేకానంద, వేముల ప్రశాంత్ రెడ్డి, సంజయ్ కృష్ణ తదితరులను జవహర్‌నగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కెటిఆర్, తలసాని శ్రీనివాస యాదవ్, పద్మారావు గౌడ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, పాడి కౌశిక్ రెడ్డి, విజెయుడు, మహిపాల్ రెడ్డి తదితరులను బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అ యితే జవహర్‌నగర్ పోలీసు స్టేషన్‌లో హరీష్‌రావు తదితరులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. తమ అరెస్టు అక్రమ మని హరీష్‌రావు సహా ఇతర ఎంఎల్‌ఎలు మీడియాతో తెలిపారు. సాయంత్రం నాలుగు న్నర గంటల సమయంలో వారిని వదిలివే శారు. కాగా బోయిప్‌పల్లి పోలీసు స్టేషన్ వద్ద కెటిఆర్, తలసాని సహా ఇతర ఎంఎల్‌ఎలు పోలీసు కస్టడీలో వున్న సమయంలో వారికి సంఘీభావం తెలిపేందుకు బిఆర్ఎస్ నా యకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఇదే సమయంలో కంటోన్మెంట్ ప్రాంతం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలిరా వడంతో ఉ ద్రిక్తతలు నెలకొన్నాయి. ఒక దశలో ఇరువర్గాలు తలపడ్డారు. ఒకరిపై మరొకరు రాళ్లు విసురుకున్నారు. తోపులాట జరిగింది. ఇరువర్గాలను నిలు వరించేందుకు పోలీసు లు స్వల్పంగా లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు. ఈ సందర్భంగా బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ వద్ద సుమారు రెండు గంటల పాటు హైడ్రామా నెలకొంది. కాగా బిఆర్ఎస్ అధికార ప్రతినిధి సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిషాంక్, కంటోన్మెంట్ బోర్డు మాజీ మెంబర్ ప్యారసాని శ్యామ్ కుమార్‌లతో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ నాయకు లు పి.కిరణ్, భాస్కర్, రావుల సతీష్, బత్తుల నారాయణ మాధురి, ఆన ంద్, యాసీన్, రఘు, మోనీ, జాన్సీలను అరెస్ట్ చేసి సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లో బందించి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

## వారం - వర్జ్యం

09-09-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి. త్రయోదశి మ.12.33. న. ఆశ్లేష మ.3.16
వ.రా.2.42 – తె.4.13
దు.ఉ.11.39 – మ.12.28
రాహు. మ.12.00–మ.1.30
శుభ స. ఉ.5.00–6.00

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామి సహాయంతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. వస్తు లాభాలు పొందుతారు.

**వృషభం :** కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా వుంటుంది. వ్యాపారాలలో స్వల్పలాభాలు.

**మిథునం :** నూతన పెట్టుబడులకు తగిన సమయం. సంతాన సమస్యల నుండి బయటపడతారు.

**కర్కాటకం :** ఉద్యోగ, వివాహ యత్నాలకు అనుకూలమైన సమయం, కాంట్రాక్టులు దక్కుతాయి. వస్తు సేకరణ.

**సింహం :** ఉద్యోగాలలో ఏర్పడిన చిక్కులు కొంత వరకు తీరుతాయి. పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. ఆహ్వానాలు.

**కన్య :** అదనపు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. జీవితభాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. వాహనసౌఖ్యం.

**తుల :** భూవివాదలు తీరి ప్రశాంతత పొందుతారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృశ్చికం :** ముఖ్య వ్యవహారాల్లో అవాంతరాలు ఎదురైనా సన్నిహితుల సహాయం అందుతుంది. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు.

**ధనుస్సు :** ప్రముఖులనుండి ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్థివృద్ధి చెందుతుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా వుండును.

**మకరం :** వృత్తి, వ్యాపారాలలో తొందరపాటు వద్దు. అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ధనలాభం.

**కుంభం :** చిన్ననాటి మిత్రులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా వుండును. సోదరుల కలయిక.

**మీనం :** పనులు సాఫీగా పూర్తి చేస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. అనుకోని అవకాశాలు లాభిస్తాయి.

–శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ప్రజలకు తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు: గవర్నర్

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజలకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 9న తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించుకొనున్న నేపథ్యంలో గవర్నర్ ప్రకటన విడుదల చేశారు . ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అంటూ తన రచనలతో కోట్లాది ప్రజల్లో చైతన్యం నింపిన కాళోజీ నారాయణరావు స్మృతికి నివాళులర్పిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది అంటూ ఆయన అందించిన స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని గవర్నర్ అన్నారు. నీ భాషలో నీ బతుకుంది.. నీ యాసలో నీ సంస్కృతి ఉంది అని చాటిచెప్పిన కాళోజీ మాటలు అక్షర సత్యాలని పేర్కొన్నారు. ప్రజాకవి కాళోజీ స్ఫూర్తితో మాతృభాష పరిరక్షణ, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆకాంక్షించారు.

## కౌన్సిల్‌లో హైటెన్షన్

>> సస్పెన్షన్ వేటు పడినందున, మండలి ఆవరణలో మాట్లాడేందుకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆయనకు సూచించారు. అయినప్పటికీ, అధికారుల సూచనను తిరస్కరించిన తాతా మధు, అక్కడే ఉండేందుకు ప్రయత్నించారు. దీంతో మార్షల్స్ రంగప్రవేశం చేసి, ఆయన్ను బలవంతంగా అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. ఆయన నిరాకరించడంతో, మార్షల్స్ ఆయనను చేతులపై ఎత్తుకుని ప్రాంగణం వెలుపలికి తీసుకెళ్లారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తాతా మధుపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, మండలి ప్రాంగణంలో ఆయనను మాట్లాడకుండా అధికారులు అడ్డుకున్నారు.



వడోదరలో మంగళవారం జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

## ప్రధాని పర్యటన వేళ భద్రతా లోపం!

>> తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో 24 ఏళ్ల యువకుడు తాను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) అధికారినని చెప్పుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అతడి వద్ద నుంచి నకిలీ పీఎంవో గుర్తింపు కార్డును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం అతడిని రోహన్ పారేఖ్‌గా గుర్తించారు. అతడితో పాటు ఓ బాడీగార్డ్ కూడా ఉన్నాడని, అతడి వద్ద నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. నకిలీ గుర్తింపు కార్డులతో పాటు తుపాకీతో వేదిక వద్దకు ఎందుకు వచ్చారు వారి ఉద్దేశం ఏమిటనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇద్దరి మొబైల్ ఫోన్లు, గుర్తింపు పత్రాలు, ఇతర వస్తువులను పరిశీలిస్తున్నారు. ఈ ఘటన తీవ్రత దృష్ట్యా దర్యాప్తును ముంబై క్రైమ్ బ్రాంచ్ చేపట్టింది. ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ అయిన తర్వాత తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అదుపులో ఉన్న ఇద్దరినీ మంగళవారం కిల్లా కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం సాయంత్రం 5.45 గంటల సమయంలో ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026 ఏడో ఎడిషన్‌ను ప్రారంభించనున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద, ప్రభావవంతమైన వార్షిక ఫిన్‌టెక్ సదస్సుల్లో ఒకటైన జీఎఫ్ఎఫ్ 2026 నాలుగు రోజుల పాటు జరగనుంది.

## మధు, నవీన్ కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

>> తాతా మధు, నవీన్‌రెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో చేసిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అసెంబ్లీ సిఫార్సు మేరకు మండలిలో వారిపై తీసుకుంటున్న చర్యలను చైర్మన్ ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది. అంతకు ముందు సభాపతి గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తూ చేసిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీర్మానం ప్రతిపాదించారు. 'శాసన మండలిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సభ్యులు తాతా మధుసూదన్, ఎన్. నవీన్ కుమార్ రెడ్డి 7వ తేదీన శాసనసభ ప్రాంగణంలోని గేట్ నంబర్ 3 సమీపంలో శాసన సభాపతిని ఉద్దేశించి అత్యంత అవమానకరంగా, కించపరిచేలా చేసిన దూషణలను ఈ సభ తీవ్రంగా ఖండిస్తుంది. సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన నమోదు చేస్తోంది. ఈ ఇద్దరు సభ్యులు మహిళల ఎదుట చొక్కాలు విప్పి అనుచితంగా, అసభ్యకరంగా, సమాజం తలదించుకునేలా ప్రవర్తించడాన్ని కూడా ఈ సభ తీవ్రంగా ఖండిస్తోంది. ఇటువంటి ప్రవర్తన శాసన మండలి సభ్యుని హోదాకు ఏమాత్రం తగదని, శాసన సభాపతి గౌరవం, అధికారం రాజ్యాంగబద్ధ హోదాకు తీవ్ర భంగం కలిగించిందని ఈ సభ భావిస్తోంది. ఇది తెలంగాణ శాసనసభ గౌరవం, సభా హక్కులు, సంస్థాగత సమగ్రతకు విఘాతం కలిగించే చర్యగా ఈ సభ పరిగణిస్తోంది. రాజకీయ విభేదాలు, వ్యక్తిగత అభ్యంతరాలు, భిన్నాభిప్రాయాలు ఏవైనా సరే, సభాపతి హోదాలో ఉన్న వ్యక్తి గౌరవాన్ని, అధికారాన్ని తగ్గించే ఉద్దేశంతో సభ్యులు ప్రవర్తించడాన్ని సమర్థించబోమని ఈ సభ స్పష్టం చేస్తోంది. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించటాన్ని సహించేది లేదని సభ అభిప్రాయపడుతుంది. తమ పార్టీ సభ్యుల అనుచిత ప్రవర్తనకు ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావు బాధ్యత స్వీకరించి, ఈ సభ హుందాతనం, సభా మర్యాదలను పరిరక్షి ంచేందుకు, శాసన సభాపతికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఈ సభ తీర్మానిస్తోంది. అదే విధంగా, తాతా మధుసూదన్, ఎన్. నవీన్ కుమార్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ శాసన మండలి సభ్యులుగా ఉన్నందున, ఈ తీర్మానం ప్రతితో పాటు సభ ముందు ఉంచిన ఆధారాలు, సభా హక్కుల ఉల్లంఘన నోటీసు, వాటికి సంబంధించిన కార్యకలాపాల వివరాలను తెలంగాణ శాసనమండలి చైర్మన్‌కు పంపించాలని ఈ సభ తీర్మానిస్తోంది. ఈ అంశంపై శాసనమండలి సభా హక్కులు, సభా విధానాలు, క్రమశిక్షణకు సంబంధించిన నిబంధనలకు అనుగుణంగా శాసనమండలి చైర్మన్ తదుపరి చర్యలు తీసుకోవాలని ఈ సభ తీర్మానిస్తున్నది' అని తెలిపారు. ఇదిలా ఉండగా, మండలిలో ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్‌ను బీఆర్ఎస్ సభ్యులు ఖండించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను చట్ట విరుద్ధంగా సస్పెండ్ చేశారని శాసనమండలి భవనంలో చైర్మన్ పోడియం వద్ద బైఠాయించారు. తర్వాత శాసనమండలి ఆవరణలో తాతా మధు, నవీన్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

**తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలను అడ్డుకున్న మార్షల్స్**

కాగా, తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెన్షన్ అనంతరం ప్రాంగణంలో గందరగోళం నెలకొంది. మీడియా పాయింట్‌లో తాతా మధు మాట్లాడుతుండగా మార్షల్స్ అడ్డుకున్నారు. సస్పెన్షన్ వేటు పడినందున ప్రాంగణంలో మాట్లాడవద్దని అధికారులు తెలిపారు. తాతా మధును అదుపులోకి తీసుకుని వ్యానులో తరలించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ఆ పార్టీ సభ్యులు సమావేశమయ్యారు.

## తెలంగాణ బియ్యం

>> ఫిలిప్పీన్స్‌కు దిగుమతి చేసుకునే బియ్యం అవసరం గణనీయంగా ఉండటం, అంతర్జాతీయంగా బియ్యం సరఫరా చేసే దేశాల సంఖ్యను విస్తరించేందుకు ఆ దేశం ప్రయత్నిస్తుండటం నేపథ్యంలో ఈ చర్చలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. పోటీ ధరలు, విశ్వసనీయమైన నాణ్యత, నిర్ణీత సమయంలో సరఫరా చేయగల సామర్థ్యంతో తెలంగాణ దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బియ్యం రకాలు, ధరలు, నాణ్యతా ప్రమాణాలు, కొనుగోలు విధానాలు, రవాణా, ధ్రువీకరణ ప్రక్రియలు, శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలపై కూడా ఇరువురు చర్చించారు. ఈ అంశాలను సంబంధిత అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పరిశీలించి, వాణిజ్య అవకాశాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు.

భారత్–ఫిలిప్పీన్స్ సంబంధాలు, ఆహార భద్రత, వ్యవసాయ సహకారం, తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు ప్రత్యక్ష వాణిజ్యాన్ని పెంచే అవకాశాలపై కూడా ఇరువురు విస్తృతంగా చర్చించారు. భారత్–ఫిలిప్పీన్స్ మధ్య అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో వ్యవసాయం, ఆహార వాణిజ్యం కీలక పాత్ర పోషించగలవని అభిప్రాయపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కార్యదర్శి లారెల్ తమ తమ ప్రాంతాలను సందర్శించాల్సిందిగా పరస్పరం ఆహ్వానించుకున్నారు. 2026 డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ రావాల్సిందిగా కార్యదర్శి లారెల్‌కు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం అందించారు. చర్చించిన అంశాలను కొనసాగిస్తూ వ్యవసాయం, బియ్యం మరియు ఆహార ఉత్పత్తుల వాణిజ్యం, విత్తనాభివృద్ధి, అనుబంధ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నిర్ణయించారు. ఈ ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం, ఫిలిప్పీన్స్ రాయబార కార్యాలయం, సంబంధిత ఫిలిప్పీన్స్ సంస్థలు, ప్రైవేటు రంగ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## బకాయిలు ఇప్పించండి

>> లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాని కలిసి వినతిపత్రం అందజేసింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతమ్ రావు, టి. వీరేందర్ గౌడ్, వేముల అశోక్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయశ్రీ, డా. కళ్యాణ్ నాయక్, రాష్ట్ర కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, భరత్ ప్రసాద్, అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి. సుభాష్, బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందేతో పాటు నిన్నటి ఆందోళనలో పోలీసుల లాఠీఛార్జీలో గాయపడిన యువమోర్చా కార్యకర్తలు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. గవర్నర్‌తో భేటీ అనంతరం ఎన్. రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ పాలన నుంచి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు దాదాపు 40 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఎదురుచూస్తూ తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. హైకోర్టు చీవాట్లు పెట్టడంతో పాటు బిజెపి చేపట్టిన నిరంతర ఆందోళనలు, నిరసన కార్యక్రమాల వల్లే ఈ విద్యాసంవత్సరం కొత్తగా చేరిన విద్యార్థులకు నామమాత్రంగా అయినా నిధులు మంజూరయ్యాయని, అయితే దాదాపు రూ.15,000 కోట్ల పాత బకాయిలు విడుదల కాకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులకు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు అందక వారి భవిష్యత్తు అంధకారంలో పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు రాకపోవడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు బిఎ, బికాం, బిఎస్సీ, ఇంజనీరింగ్, ఫార్మసీ లెక్చరర్లు, ప్రొఫెసర్లకు పూర్తి జీతాలు ఇవ్వలేక సగం జీతాలతోనే నడిపిస్తున్నాయని, దీనివల్ల రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు దారుణంగా పడిపోయే ప్రమాదం ఏర్పడిందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి కూడా విద్యా వ్యవస్థను ఇలా నిర్వీర్యం చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను కాపాడేందుకు ఫీజు బకాయిలను విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, తగిన సలహాలు ఇవ్వాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు.

దీనిపై సానుకూలంగా స్పందించిన గవర్నర్ ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకునేలా సలహా ఇస్తానని హామీ ఇచ్చారని రాంచందర్ రావు వెల్లడించారు. అదేవిధంగా శాసనసభలో జరుగుతున్న పరిణామాలపై రాంచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడానికి కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలే కారణమని, అందుకే ఆ రెండు పార్టీలు కుమ్మక్కై అసెంబ్లీలో ఈ అంశంపై చర్చ జరగకుండా ప్రజలకు సంబంధం లేని అంశాలపై మాట్లాడుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల దృష్టిని పక్కదారి పట్టించడం మాని, జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కనీసం ఒక్క రోజైనా పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రత్యేక చర్చ (స్పెషల్ సెషన్) నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

# చిరంజీవి కుమార్తె సుస్మితకు ఏపిలో కీలక పదవి

## కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డులో చోటు

**విజయవాడ, సెప్టెంబరు 8, ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ కేంద్రమంత్రి చిరంజీవి కుమార్తె, సినీనిర్మాత కొణిదెల సుస్మితకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు లభించాయి. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై వున్న కనకదుర్గ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డులో ఆమెను ప్రత్యేక ఆహ్వానితురాలిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి కన్నబాబు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంతో సుస్మిత ఇకపై దుర్గమ్మ ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామి కానున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు కల్పిస్తున్న వసతులు, ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులు, దసరా నవ రాత్రులు వంటి ప్రత్యేక ఉత్సవాల నిర్వహణపై ఆమె ట్రస్ట్ బోర్డుకు తగిన సలహాలు, సూచనలు అందిస్తారు. సుస్మిత కొణిదెల 'గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్' బ్యానర్‌పై చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగా రాణిస్తున్నారు. ఇటీవల తన తండ్రి చిరంజీవితో నిర్మించిన 'మన శంకర వరప్రసాద్' చిత్రంతో ఆమె మంచి విజయాన్ని అందుకున్నారు. ఆసక్తికరంగా సుస్మిత తల్లి సురేఖ తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా సేవలు అంది స్తున్నారు. ఇప్పుడు సుస్మితకు కూడా ఏపిలోని ప్రముఖ ఆలయ బోర్డులో స్థానం లభించింది.



కొణిదెల సుస్మిత

## పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో ఇటీవల వెలువడ్డ 7437 కానిస్టేబుల్స్ తత్సమాన ఉద్యోగాల కోసం దరఖా స్తు గడువును పోలీసు నియామక మండలి పొడిగించింది. ఈ గడువు ముందుగా ప్రకటించిన దాని ప్రకారం మంగళవారంతో ముగియనుండగా దీనిని ఈ నెల 16వ తేదీ సాయం త్రం ఐదు గంటల వరకు పొడిగించారు. పోలీసు కొలువుల కోసం జూలై 29వ తేదీన నోటిఫికేషన్ వెలువడిన విషయం తెలిసిందే. ఇందులో సివిల్ కానిస్టేబుల్స్ 697, సాయుధ బలగం కానిస్టేబుల్స్ 1052, ప్రత్యేక సాయుధ బలగం కానిస్టేబుల్స్ 24, ఫై ర్ సర్వీస్ కానిస్టేబుల్స్ 751, జైలు వార్డర్లు 208, ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్స్ 1380, పుండడం విది తమే. ఈ పోస్టులతో పాటు మెకానిక్, డ్రై వర్లకు సంబంధించి 27 పోస్టు లకు కూడా దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ పోస్టులకు ఇప్పటి వరకు మూడు లక్షల 38 వేలమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో రెండు లక్షల 88 వే 530 మంది ఫీజులు చెల్లించారు. అభ్యర్థుల ఆధార్ కార్డుల పరిశీలన 95 శాతం వరకు పూర్తయ్యిందని నియామక మండలి తెలి పింది. గడువు పొడిగింపుతో మరింతమంది దరఖాస్తు చేసుకునే వీలుంది.




మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు

## బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై మహిళా కమిషన్‌లో కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదు

**హైదరాబాద్ (బేగంపేట) సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** మహిళా పోలీసుల పట్ల దురుసుగా వ్యవహరించారని, మహిళా పోలీసుల ముందే అర్ధనగ్న ప్రదర్శన చేసారంటూ మహిళా పోలీసులతో అనుచితంగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై తెలంగాణ మహిళా కమిషన్‌లో కాంగ్రెస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలు మంగళవారం ఫిర్యాదు చేసారు. మహిళా కమీషన్ సభ్యులు కాసోజు శంకరమ్మ, శశికళా యాదవ్ రెడ్డి, కుమారి సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా ఆషయ్ షాకీర్, కమీషన్ కార్యదర్శి పద్మజ రమణలకు కాంగ్రెస్ మహిళా శాసన సభ్యులు ఫిర్యాదు చేసారు. మహిళా కమీషన్ లో ఫిర్యాదు చేసిన వారిలో ఎమ్మెల్యేలు పద్మావతి రెడ్డి, యశస్విని రెడ్డి, పర్ణిక, రాగమయి, వైశ్య కార్పోరేషన్ ఛైర్ పర్స న్ కల్వ సుజాత, కుడా ఛైర్మన్ గుండు సుధారాణ్ తదితరులు ఉన్నారు.

## దేశవ్యాప్తంగా 123 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** దేశంలో ప్రస్తుతం బొగ్గుకు ఎటువంటి కొరత లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో మంగళవారం జాతీయ మీడియాతో మాట్లాడుతూ బొగ్గు నిల్వలు, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంశాలపై క్లారిటీ ఇచ్చారు. వర్షాకాలం కారణంగా బొగ్గు ఉత్పత్తిలో కొద్దిరోజుల పాటు స్వల్ప అంతరాయం ఏర్పడినా, ప్రస్తుతం దేశంలో ఎలాంటి కొరత లేదని తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గత రెండు, మూడు రోజులుగా బొగ్గు ఉత్పత్తి గరిష్ట స్థాయికి చేరిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 123 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.



ఎసిబికి పట్టుబడ్డ సబ్ రిజిస్ట్రార్, ప్రైవేట్ వ్యక్తి

## రూ.90 వేల లంచం డిమాండ్

### ఎసిబి వలలో సబ్‌రిజిస్ట్రార్

**నారాయణపేట, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్ లగిశెట్టి వెంకటస్వామి, మరో ప్రైవేట్ వ్యక్తి కమ్మరి నాగేష్ ఏసీబీ వలలో చిక్కారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు నారాయణపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం ఫిర్యాదుదారుడి ఇంటి రిజిస్ట్రేషన్ పూర్తి చేసేందుకు అధికారిక అనుకూలత చూపించాలంటే రూ.90 వేల లంచం ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ వెంకటస్వామి డిమాండ్ చేసినట్లు పేర్కొంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జూలై 21న కమ్మరి నాగేష్ ద్వారా రూ.50 వేల నగదును పాక్షి క చెల్లింపుగా స్వీకరించినట్లు తెలిపింది. అనంతరం మిగిలిన రూ.40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది ఫిర్యాదుదారుడి ఇంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నంబర్ 4723/2026కు సంబంధించిన పనిని పూర్తి చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. అధికారిక విధులను దుర్వినియోగం చేసి అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు పేర్కొంది. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి, సబ్ రిజిస్ట్రార్ వెంకటస్వామి, ప్రైవేట్ వ్యక్తి నాగేష్‌లను న్యాయపరమైన రిమాండ్ నిమిత్తం నాంపల్లి ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా వెల్లడించలేదని ఏసీబీ పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ ప్రజలకు సూచించింది.

# ఉద్యమాలతో తెలంగాణ రణరంగం

### స్పీకర్‌ను దూషించడంతో కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు

### ఎర్రవెల్లిలో వెయ్యి డప్పులతో కాంగ్రెస్ దరువు

### కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ రోడ్డెక్కిన బిఆర్ఎస్ శ్రేణులు

### పెద్దసంఖ్యలో ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**న్యూస్ నెట్‌వర్క్ / ప్రభాతవార్త:** అసెంబ్లీ సమా వేశాల్లో చోటుచేసుకున్న ఘటనలతో రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించాయి. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాయి. పలు చోట్ల రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిం చారు. ప్రతిపక్షాల ఉద్యమకారులు ఎదురెదురు అయిన ప్రాంతాల్లో ఉద్రిక్తత ఏర్పడింది. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా పోలీసులు కీలకపాత్ర పోషించారు. సాయంత్రం వరకు ఉద్యమాలు దశలవారీగా కొనసాగడంతో వారిని అదుపుచేయడానికి పోలీసులు తీవ్రస్థాయిలో శ్రమించాల్సి వచ్చింది. ఎర్రవెల్లిలో వెయ్యి డప్పులతో దరువు కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. దీనితో హైదరాబాద్ సిద్దిపేట రహదారిలో పలుప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు. ఎర్రవెల్లిలోని మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద తెల్లవారు జామునుంచే పోలీసులను గస్తీకి దింపారు. ఈ ప్రాంతంలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ప్రధానంగా అసెంబ్లీ ప్రాంగణం నుంచి బిఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్‌రావు ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యకర్తలు ఎర్రవెల్లికి బయలుదేరారు. ఈ సమయంలో అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కేటీఆర్‌లు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు, కార్యకర్తలతో ఎర్రవెల్లికి వెళ్లడానికి ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఎదురయ్యాయి. హరీష్‌రావును, కేటీఆర్‌ను హకీంపేట, అల్వాల్ వద్ద పోలీసులు అదుపులో తీసుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసిన



కెసిఆర్ ఫాంహౌస్ సమీపంలోకి చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులు

వ్యాఖ్యలకు నిరసనగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. దళితులు ఉన్నత పదవుల్లో ఉండటం చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో జగిత్యాలలో రోడ్డుపై బైఠాయించి బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. హన్మకొండ అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేశారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం మర్లపాడులో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన చేశారు. బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ ఆందోళన నిర్వహిస్తుండగా అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అక్కడికి చేరుకున్నారు. దీనితో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పటాన్‌చెరు ప్రాంతంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ వర్గాల ఆందోళనకారులు తారసపడటంతో పోటాపోటీ నినాదాలతో హోరెత్తించారు. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. గజ్వేల్ వరదరాజపూర్ వద్ద సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసిన బిఆర్ఎస్ నాయకులు. దీనికి పోటీగా కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి కాంగ్రెస్ వర్గాలు. యాదాద్రి జిల్లా తుర్కపల్లి చౌరస్తాలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, అనిల్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. సూర్యాపేటలో రహదారిపై బిఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఖమ్మం జిల్లా ముదిగొండతో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించి ఎమ్మెల్సీ తాతామధు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కోదాడలో మాజీ ఎమ్మెల్యే బొల్లంమల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేయడంతో ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి.

# అసెంబ్లీ వద్ద పోలీసులతో గొడవ

## బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు 14 మంది సహా ముఖ్యనేతలపై కేసులు

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** అసెంబ్లీ వద్ద సోమవారం పోలీ సులతో జరిగిన గొడవ కారణంగా బిఆర్ఎస్ ఎంఎల్ఎలు 14 మంది తో పాటు ముఖ్య నేతలపై సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. అసెంబ్లీ వద్ద బందోబస్తులో వున్న సైఫాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎం. బాలస్వామి ఫిర్యాదు మేరకు బిఆర్ఎస్ ఎంఎల్ఎలు కెటిఆర్, హరీశ్‌రావు, జగదీష్ రెడ్డి, సుధీర్ రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి, సు నీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి, గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి సంజయ్, విజయుడు, ఎంఎల్‌సి లు శంబీపూర్ రాజు, తాత మధు, నవీన్ రెడ్డిలతో పాటు ఇతర శాసనసభ్యులపై బిఎన్‌ఎస్ సెక్షన్ 121 (1), 132, 74, 79, 351, 352, 353, రెడ్‌విత్ 3 (5) కింద కేసులు నమో దు చేశారు. సోమవారం ఉదయం అసెంబ్లీ సమావేశాలు ప్రా రంభం కావడానికి ముందు బిఆర్ఎస్ ఎంఎల్ఎలు నల్ల టి షర్టులు ధరించి, వాటి పై ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ నినాదాలు రాయించి లోపలికి వెళ్లేందుకు యత్నించడం తెలిసిందే. ఈ సందర్భంగా పోలీసులు వారిని లోప లికి అనుమతించక పోవడం విదితమే. నల్ల టి షర్టులతో అసెంబ్లీలోకి వెళ్లేందుకు అనుమతించ వద్దని స్పీకర్ నుంచి ఆదేశాలు వున్నాయని పోలీ సులు చెప్పగా అందుకు బిఆర్ఎస్ ఎంఎల్ఎలు అంగీకరించక పోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో పలువురు ఎంఎల్ఎలు కిందపడగా స్వల్పంగా గాయాల య్యాయి. ఈ సమయంలో పోలీసులు తమ పట్ల దురుసుగా ప్రవర్తించారని బిఆర్ఎస్ ఎంఎల్ఎ లు, ఎంఎల్‌సిలు చెప్పగా అక్కడ బందోబస్తుకు నాయకత్వం వహించిన ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి ఖండించారు. బిఆర్ఎస్ నాయకులు పోలీసుల పట్ల హేయంగా వ్యవహరించారని ఆమె ఆరోపించారు. మహిళా పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించారని ఆమె తెలిపారు. ఈ నేపథ్య ంలో అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి బందోబస్తులో వున్న సైఫాబాద్ డిఐ బాలస్వామి చేసిన ఫిర్యాదు మేరకు బిఆర్ఎస్ నేతలపై కేసులు నమోదు చేశారు. కేసు నమోదుకు ముందు పోలీసులు సిసి ఫుటేజిలను పరిశీలించి తగిన ఆధారాలను సేకరించారు.

# బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బిఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

## కాంగ్రెస్ ఎమ్మెల్యేపై చర్యలకు డిమాండ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం బం జారా హిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసీఆర్ చావాలని, ఆయన చావును తాము కోరుకుంటున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా స్పందిస్తున్నాయి. రాజకీయ ప్రత్యర్థిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని, ప్రజా ప్రతినిధిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బంజారాహిల్స్ పోలీసులను కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించి తదుపరి చర్యలపై పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి కూడా పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒకే అంశంపై రెండు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేయడంతో ఈ వ్యవహారం రాజకీయంగా మరింత చర్చనీయాంశంగా మారింది.

# అసెంబ్లీ గేటు వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై ఫొటోలు విడుదల

## స్పీకర్ అనుమతితో సభలో సభ్యులకు అందజేసిన ప్రభుత్వ విప్

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** అసెంబ్లీ వర్షాకాలం సమావేశాల మొదటి రోజున సోమవారం ఉదయం బిఆర్ఎస్ ఎంఎల్ఎలు నల్ల టి షర్టులతో లోపలికి వచ్చేందుకు ప్రయత్నించిన సమయంలో పోలీసులు వారిని నిలువరించినపుడు ఏం జరిగిందనే దానిపై సర్కారు ఫోటోల ను మంగళవారం విడుదల చేసింది. ఆ సమయంలో విధుల్లో వున్న పోలీసులతో బిఆర్ఎస్ ఎంఎల్ఎలు ఎలా దురుసుగా వ్యవహరించారనే దానిపై సమీపంలోనే వున్న సిసి టివి ఫుటేజిలు, పోలీసు వీడియో కవరేజి సిబ్బంది తీసిన ఫోటోలను పరిశీలించిన ఉన్నతాధికారులు వీటిని స ర్కారుకు అందజేశారు. ఈ ఫోటోలను పరిశీలించిన సర్కారు పోలీసులతో బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, ఇతర ప్రజాప్రతినిధులు వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుపట్టింది. ఇలాంటి చర్యలు ఎంతమాత్రం సమంజమైనది కాదని సర్కారు పేర్కొంది. ఈ ఫోటోలలో కొన్నింటిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అనుమతి తీసుకుని శాసనసభలో ప్రదర్శించారు. వీటిని ఆయన సభలో వున్న సభ్యులకు అందజేశారు.

# రాహుల్‌గాంధీ ఉన్న విమానానికి ల్యాండింగ్ ట్రబుల్

**లక్నో, సెప్టెంబరు 8:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా విమానం లక్నో విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు కొద్దిసేపటి ముందు గోఅరౌండ్ చేసింది. మంగళవారం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెపుతున్నారు. అయితే రెండో ప్రయత్నంలో విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఎఐ1717 విమానం ఢిల్లీ నుంచి లక్నోకు బయలుదేరింది. లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేందుకు పైలట్ తొలుత ప్రయత్నించారు. అయితే విమానం రన్‌వేకు సమీపానికి వచ్చిన తర్వాత ఆ ల్యాండింగ్ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. దీంతో విమానం మళ్లీ సురక్షితమైన ఎత్తుకు చేరుకునేలా పైలట్ చర్యలు చేపట్టారు. అనంతరం మరోసారి ల్యాండింగ్ కోసం విమానాన్ని తీసుకువచ్చి రెండో ప్రయత్నంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ విమానంలో రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్నారు. మధ్యాహ్నం ఢిల్లీ నుంచి బయలుదేరిన విమానం ఎఐ 1717 విమానం మంగళవారం మధ్యాహ్నం సుమారు 2:20 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరింది. సుమారు 3:30 గంటలకు లక్నో చేరుకోవాల్సి ఉంది. ల్యాండింగ్‌కు ముందు గోఅరౌండ్ చేసినప్పటికీ రెండో ప్రయత్నంలో విమానం ఎలాంటి ఇబ్బంది లేకుండా లక్నో విమానాశ్రయంలో దిగింది. విమానం ల్యాండింగ్ ప్రక్రియలో ఉన్నప్పుడు పైలట్ ఆ ప్రయత్నాన్ని నిలిపివేసి మళ్లీ సురక్షితమైన ఎత్తుకు విమానాన్ని తీసుకెళ్లి, ఆ తర్వాత మరోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించడాన్ని "గో అరౌండ్" అంటారు. ఇది విమానయాన రంగంలో సాధారణంగా అనుసరించే భద్రతా విధానమే. రన్‌వే పరిస్థితులు, వాతావరణం, విమానాల రాకపోకలు లేదా ల్యాండింగ్‌కు అనువైన పరిస్థితులు లేకపోవడం వంటి పలు కారణాలతో పైలట్లు గోఅరౌండ్ చేయవచ్చు. ఈ ఘటనలోనూ తొలి ల్యాండింగ్ ప్రయత్నాన్ని విరమించుకున్న తర్వాత విమానం తిరిగి మరోసారి ల్యాండింగ్‌కు వచ్చి సురక్షితంగా ల్యాండ్ అయింది.






ఛాలెంజ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌ను సద్వినియోగం చేసుకోండి

### ఆర్‌అండ్‌బి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026ను యువ ఫిలిం మేకర్స్ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డిసి ఎండి జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి ఛాలెంజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..షార్ట్‌ఫిలింలు, పాటలు, వీడియోల ద్వారా యువత తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ ఛాలెంజ్ మంచి వేదికగా నిలుస్తుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదా యాలతోపాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సృజనాత్మ కంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. యువ ఫిలిం మేకర్స్, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్దసంఖ్యలో పాల్గొని ఛాలెంజ్‌ను విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

## శాసనసభలో విషాదం

### నవీన్‌మిట్టల్ పిఎస్ రాజు గుండెపోటుతో మృతి

### మంత్రి వాకిటి శ్రీహరి సిపిఆర్ చేసినా ఫలితం శూన్యం

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** శాసనసభ ప్రాంగణంలో ఇవాళ చోటుచేసుకున్న ఓ అత్యంత విషాదకర ఘటన అసెంబ్లీ వర్గాలను, అధికారులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ దగ్గర పర్సనల్ సెక్రటరీ (పిఎస్) గా విధులు నిర్వహిస్తున్న రాజు శాసనసభ ఆవరణలోనే అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. అసెంబ్లీ ప్రాంగణంలో రాజు ఉన్నట్టుండి స్పృహ తప్పి పడిపోవడాన్ని గమనించిన మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే స్పందించారు. అప్పటికప్పుడు రాజుకు కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సిపి ఆర్) చేస్తూ ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ రాజు ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో, వెంటనే మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో హుటాహుటిన ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పల్స్ పడిపోవడంతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యు లు ధ్రువీకరించారు. రాజు అకస్మాత్తుగా గుండెపోటుకు గురికావడమే ఈ మృతికి కారణమని తెలుస్తోంది. ఈ హఠాత్పరిణామం అసెంబ్లీ ప్రాంగ ణంలో ఉన్న వారందరినీ ఆందోళనకు గురిచేసింది. రాజు ఆకాల మరణం పట్ల సచివాలయ ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఎసిబికి పట్టుబడిన బల్దియా క్వాలిటీ కంట్రోల్ సెల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

### రూ.10 వేలు తీసుకుంటూ దొరికిపోయిన వైనం

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** బల్దియాలో లంచావతారులను ఎసిబి పట్టుకోవడ ఆగడం లేదు. గడచిన నాలుగు నెలలుగా 20 మ ందికి పైగా అధికారులు లంచాలు మేస్తూ దొరికిపోగా తాజాగా మంగళవారం నాడు ముషీరాబాద్ డివిజన్ క్వాలిటీ కంట్రోల్ సెల్ డిప్యూటీ ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ సాయిరాం ఒక పనికి సంబంధించి కాంట్రాక్టర్ నుంచి పది వేల రూపాయలు



ఎసిబికి పట్టుబడిన సాయిరాం

లంచం తీసుకుంటూ పట్టు బడ్డాడు. బల్దియాలో తాను చేబట్టిన పనులకు సంబంధించిన బిల్లుల మజూరు కోసం సదరు కాంట్రాక్టర్ సాయి రాంను సంప్రదించగా తనకు దండిగా లంచాలు ఇస్తే నే సంతకం చేస్తానని దబాయిం చాడు. దీంతో చేసేదిలేక పది వేల రూపాయలు ఇచ్చేందుకు కాంట్రాక్టర్ ఒప్పుకు న్నాడు. అయితే పది వేల రూపా యలు చాలదని మరింత కావాలని సాయిరాం డిమాండ్ చేశాడు. దీంతో కాంట్రాక్టర్ దీనిపై ఎసిబి అధికారులను సంప్రదిం చగా వారు పక్కాగా వ్యవహరించి మంగళవారం నాడు సాయిరాం పనిచేస్తున్న కార్యా లయంలో కాపుకాశారు. బాధిత కాంట్రాక్టర్ పది వేల రూపాయలు సాయి రాంకు ఇవ్వగా దీనిని అతను తీసుకుని జేబులో వేసుకోగానే ఎసిబి అధికారులు ఒక్కసారిగా దాడిచేసి పట్టు కున్నారు. అనం తరం సాయిరాం నుంచి పది వేల రూపాయల లంచం డబ్బులను జప్తు చేశారు. దీని తరువాత అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండుకు తరలించారు, కాగా సర్కారీ విభాగాల్లో లంచావ తారుల గురించి ధైర్యంగా ఎసిబికి ఫిర్యాదు చేయాలని ఈ విభాగం డిజి చారు సిన్హా కోరారు.


ఈశాన్య రైల్వే
సవరణ
వెబ్‌సైట్-www.ner.indianrailways.gov.in తేదీ: 07.09.2026
ఇందుమూలముగా టెండర్ నెం. 22261047 (ఐటమ్ నెం.03) 15.06.2026 తేదీ టెండర్ నోటీస్ నెం.05, 01.09.2026 గడువు గల దాని ఎదురుగా ప్రకటింపబడిన విధులకు క్రింద సవరణ చేయబడుతోంది. ఐటమ్ నెం.03, ఐటమ్ వివరణ : టెండర్ తెరచు తేదీ- సమయంతో, ప్రస్తుతం ఉన్న ఎంట్రీ: 01.09.2026, ఉ.11.30గం. సవరణ ఈ విధంగా చేయబడింది: 05.10.2026, ఉ.11.30గం. IREPS వెబ్‌సైట్ వద్ద వివరణ చూడవచ్చును. ఇతర అన్ని నియమాలు మరియు నిబంధన ఎటువంటి మార్పులేకుండా ఉంటాయి. గమనిక: పై సమాచారాన్ని N.E. రైల్వే వెబ్‌సైట్ www.ner.indianrailways.gov.in మరియు భారత ప్రభుత్వం యొక్క వెబ్‌సైట్ www.tenders.gov.in పై చూడవచ్చును.
ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్ మేనేజర్,
CPRO/S-55 N.E.రైల్వే/గోరఖ్‌పూర్.
"పై కప్పు మీద మరియు ఫుట్ బోర్డ్‌పై ఎన్నడూ ప్రయాణించేయవద్దు"



డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II హైదరాబాద్ నందు
ఎస్.ఎ. నెం. 52 OF 2023
మధ్య
శ్రీమతి పోరం కవిత ...పిటిషనర్ / దరఖాస్తుదారు
వర్సెస్
బ్యాంక్ ఆఫ్ ఇండియా, తమ అధీకృత అధికారి ద్వారా & ఇతరులు ...ప్రతివాదులు ప్రతివాదులు నెం. 3 & 5
3. శ్రీ ఎ.సత్యనారాయణ రెడ్డి, తండ్రి: ఎ.నరసింహా రెడ్డి, వయసు సుమారు 48 ఏళ్లు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇంటి నం. 1-10/112/8, అశోక్ నగర్, హైదరాబాద్ – 500 020.
5. శ్రీ నాగోతు దిలీప్ కుమార్, తండ్రి: ఎస్. రాయన్న, వయసు సుమారు 31 ఏళ్లు, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, నివాసం: ఇంటి నం.30-265/21/252/A, ఆర్‌కెపురం కాలనీ, ఎఎస్ రావు నగర్, కాప్రా, హైదరాబాద్.
నోటీసు
పై పేర్కొన్న నా క్లయింట్/దరఖాస్తుదారు గౌరవనీయ రుణాల వసూళ్ల ట్రిబ్యునల్-II, హైదరాబాద్ నందు మీపై ఐఏ నెం. 1587 of 2026 ఇన్ ఎస్.ఎ. నెం.1252 of 2017 దాఖలు చేసిన సంగతి మీకు ఈ ద్వారా తెలియజేయబడుచున్నది. పై కేసు 30-09-2026 తేదీన విచారణకు నియమించబడినది. గౌరవనీయ ట్రిబ్యునల్ మీకు నోటీసు జారీ చేయవలెనని ఆదేశించినందున, ఈ నోటీసు మీకు అందజేయబడుచున్నది.
కావున, మీరు 30-09-2026 తేదీన గౌరవనీయ ట్రిబ్యునల్ ఎదుట వ్యక్తిగతంగా గానీ, మీ న్యాయవాది ద్వారా గానీ హాజరు కావలెను. మీరు ఆ తేదీన హాజరు కాకపోయిన యెడల, మీ గైర్హాజరులోనే కేసును మెరిట్స్ ఆధారంగా విచారించి తగిన ఉత్తర్వులు జారీ చేయబడును.
అందువలన ఈ నోటీసు జారీ చేయబడినది.
స్థలం: హైదరాబాద్ డి. రాఘవులు,
తేది: 08-09-2026 న్యాయవాది (అడ్వకేట్) అడ్వకేట్
(గౌరవనీయ రుణాల వసూళ్ల ట్రిబ్యునల్ - II, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు)



కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం లిమిటెడ్
KUPPAM RURAL ELECTRIC CO.OPERATIVE SOCIETY LIMITED
e-Procurement Tender Notice
The **KRECS Ltd., Kuppam, Chittoor Dist., A.P.** intends to procure the electrical line materials such as DTRs, Cable Conductor and other ancillary materials through e-procuremt. The interested bidders may visit and submit their bids online through https:// tender.apeprocurement.gov.in/ from 11.09.2026, 00:00 hrs. For further details, contact on 9440808304 or write to us on **adet@kuppamresco.org.**
Sd/-
MANAGING DIRECTOR
Dial "1912" for all electricity related complaints
Pay electricity charges using QR code printed on electricity bills


వార్త

నీతిలేని వాణిజ్యం, కృషిలేని సంపద, శీలంలేని విద్య, త్యాగం లేని ఆరాధన, మానవత లేని శాస్త్ర విజ్ఞానం, నియమనిష్టలు లేని రాజకీయం ఇవి సామాజిక దురాచారాలు.

- మహాత్మా గాంధీ

# తెరచాటు దొర తంత్రం!

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు నిధులు వేరడం తప్పేమీ కాదు. కానీ ఊరూపేరులేని పార్టీలను నమ్మి ప్రజలు అంతలేసి మొత్తంలో విరాళాలు ఇస్తారా అంటే అది మిలియన్ డాలర్ల ప్రశ్న. విరాళాలిచ్చేవారు జనాదరణ లేని పార్టీల నుంచి ఏమీ ఆశించలేమని తెలిసీ ఎందుకు విరాళాలు ఇస్తారో పలు విషయాలపై దృష్టి పెడితేనే విశ్లేషించుకోగలం. ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో ఏమాత్రం జనంలో లేని రాజకీయ పార్టీలకు దాదాపు రూ.1700 కోట్ల మేరకు విరాళాలు అందాయి. అవి ఎక్కడ్నించి వచ్చాయి. ఎవరి కోసం దేనికోసం ఈ విరాళాలు పోగుపడ్డాయి. ఎవరిచ్చారు? ఎందుకిచ్చారు? ప్రతిఫలాపేక్ష లేకుండా ఎవరైనా ఎందుకిస్తారు? అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. పైగా రాజకీయ పార్టీలకి ఇచ్చే ప్రతి రూపాయి ప్రజావిశ్వాసంతో ముడిపడి ఉంటాయి. రాజకీయ చైతన్యంలో మమేకమై విస్తృత రాజకీయకార్యకలాపాలు చేసే పార్టీలకు కోట్లాది రూపాయలు విరాళమిచ్చే దాతలు ఆయా పార్టీల నుంచి ఏం ఆశిస్తున్నారన్న నేపథ్య ఎజెండా ఏదో ఒకటి ఉండనే ఉంటుంది. దాన్ని ఎవరూ కాదనరు. గుజరాత్‌లో కొన్ని రాజకీయ పార్టీలు అసలు ఉన్నట్లే ఎవరికీ తెలియదు. వాటి జెండా,ఎజెండా కూడా ఏదో కానరావు.కానీ 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆరు చిన్న చితక పార్టీలకు రూ. 1700 కోట్ల రూపాయలు ఎలా జమ అయ్యాయి. ఈ సొమ్మును వారు ఖర్చు పెట్టేందుకు వారికి ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు లేవు. ఎలాంటి కార్యాచరణ కూడా లేదు. దీంతో ఈ విరాళాల అసలు సిసలు లబ్ధిదారులెవరో తేలాల్సి ఉంది. ఒకవేళ బడా రాజకీయ నాయకుల కొమ్ము కాసేందుకే ఈ చిన్నాచితకా పార్టీల పేర్లను నమోదు చేసారా అన్న అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఆమ్ జన్మత్ పార్టీకి రూ. 620 కోట్లు, సత్యవాది రక్షక్ పార్టీకి రూ. 330.55 కోట్లు, స్వతంత్ర అభివ్యక్తి పార్టీకి రూ.200.69 కోట్లు, న్యూ ఇండియా యునైటెడ్ పార్టీకి రూ.200.69 కోట్లు, భారతీయ నేషనల్ జనతా దళ్‌కు రూ. 191.61 కోట్లు, గరీబ్‌కళ్యాణ్ పార్టీకి రూ. 138కోట్లు మేరకు విరాళాలు జమపడ్డాయి. ఆయా పార్టీలు2024 ఎన్నికల్లో 15 లోక్‌సభ స్థానాల్లో ఆయా పార్టీ అభ్యర్థులను నిలబెట్టిన చరిత్ర ఉంది. ఎవరికీ డిపాజిట్లు కూడా దక్కలేదు. అందరికన్నా ఎక్కువ మొత్తంలో విరాళాలు పొందిన ఆమ్ జన్మత్ పార్టీ అభ్యర్థులు విరాళాలు అందుకున్న స్థాయిలో రెండవది అయిన సత్యవాది రక్షక్ పార్టీలైతే ఒక్కో అభ్యర్థిని మాత్రమే నిలబెట్టాయి. ఎవరి ప్రోద్బలంతో ఈ పార్టీలు ఏర్పడ్డాయో పూర్తి సమాచారం లేకపోయినా వీరి వెనక ఏదో బలమైన వ్యక్తుల నేపథ్యమే ఉంటుందన్నది నిర్వివాదాంశం. కానీ ఎవరు ఎవరు పార్టీలనుమానించి నడుపుతున్నారో తెలిస్తే మరో మాయ బజార్ బయటపడ్డది. ఇలాంటి అంశాలు భారతీయ రాజకీయ వ్యవస్థ పారదర్శకతను ప్రశ్నించే అంశాలుగా మిగిలిపోతాయి. ఆయా రాజకీయ పార్టీలకు చేరిన నిధులుపార్టీ రాజకీయ కార్యకలాపాల కోసమేనా లేదా మరొక మార్గంలో నగదు ప్రవాహాన్ని దారి మళ్లించడానికి చిన్న రాజకీయ పార్టీల సృష్టి జరుగుతోందా అన్నది తేలాలి. 2024–25 అసోషియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ఎన్నికల సంఘానికి పార్టీలు ఇచ్చిన నివేదికల మేరకు జాతీయ పార్టీల ఆదాయం లెక్కలు గమనిస్తే భారతీయ జనతాపార్టీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, సిపిఐ(ఎం) ఆప్, బిఎస్‌పి, ఎన్‌పిఇపిల ఆదాయం మొత్తం రూ. 7,960.09 కోట్లు. వాటిలో 85శాతంతో బిజెపి ప్రథమ స్థానంలో ఉంది. ఆయా పార్టీల కార్యక్రమాల నిర్వహణ పరిస్థితులు ప్రధాన పార్టీలకు చేరిన నిధులను బట్టికొంత సమంజసమేనని చెప్పుకోవచ్చు. ఆ తర్వాత స్థానంలో ఉన్న పార్టీల నిధుల రాబడి చూస్తే చెప్పుకోదగిన మొత్తాలు కావు. పార్టీలు విరాళాల మీద ఆధారపడటం పెద్ద తప్పేమీ కాదు కానీ అనామక పార్టీలకు అన్నేసి కోట్ల నిధులెలా వచ్చాయన్నది సర్వులు తెలుసుకోదగిన విషయమే. ఫిబ్రవరి 2024లో ఎలక్టోరల్ బాండ్లను సుప్రీం కోర్టు రద్దుచేశాక పార్టీల ఆదాయం కాస్త తగ్గింది కూడా. కాగా కొన్ని చిన్న పార్టీలకు పోగుపడిన విరాళాల సంగతే సందేహాస్పదంగా ఉంది.ప్రస్తుతం భారతీయ జనతాపార్టీ బీహార్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఉన్న అనామిక పాశ్వాన్ ఆధ్వర్యంలో 2020 పట్నాలో స్థాపించిన ఆమ్ జన్మత్ పార్టీకిఅత్యధిక నిధులు వసూళ్లయ్యాయి. ఇలాంటి నిధులున్న ఖాతాలన్నీ అహ్మదాబాద్‌లోనే ఉన్నాయి.గుజరాత్ రాష్ట్రమే ఓ బడాపారిశ్రామిక నగరం కనుక ఆయా అనామిక పార్టీలకు పారిశ్రామికవేత్తలే విరాళాలు ఇచ్చి ఉంటారని ఊహించవచ్చు. రాజకీయ పార్టీల నిర్వహణకే ఆ నిధులు ఖర్చుపెట్టాలని నిబంధన ఏదీలేకపోయినా ఎన్నికల కార్యక్రమాలకు పరిమితుల మేరకు వినియోగించవచ్చు. విచిత్రమేమిటంటే వాటిలో సత్యవాది రక్షక్ పార్టీ తనకు వచ్చిన రూ.330 కోట్లలో రూ.316 కోట్లను సామాజిక కార్యక్రమాలకు ఖర్చు చేసినట్లు వెల్లడించింది. ఇప్పటికిప్పుడు ఆయా పార్టీలకు చేరిన విరాళాలు ఎవరెవరు ఏయే రాజకీయ ప్రయోజనాలను ఆశించి వారికి ఫండ్స్ పంపినదీ తెలిస్తే తప్ప విరాళాల నేపథ్యం వాటి ఫలితాల గురించి తెలియదు. ఒకసారి పార్టీ కార్యకలాపాలకు ఆ పార్టీకివచ్చిన నిధులకు మధ్య అసమానత తీవ్రంగా ఉన్నప్పుడు అనేక సందేహాలు తలెత్తకమానదు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంత పారదర్శకంగా జరగాలో చెప్పుకునే ప్రజలు ఎన్నికలకు నిధులు సమకూరే మూలాలపై ఎలాఉండాలో నిర్దేశించవచ్చు. సుప్రీంకోర్టు తీర్పుతర్వాత ఎన్నికల్లో నిధుల ప్రవాహం పార్టీలకుఅందే విరాళాల విషయంలో పారదర్శకత పెరిగినా, తెలియని వనరుల ద్వారా వచ్చే ఆదాయం ఇంకా ప్రశ్నార్థకమే!.



జీవంతో ఉన్నవన్నీ మరణించవలసిందే. మరణం అనేది ప్రకృతి ద్వారా శాశ్వతత్వంలోకి చేసే ప్రయాణం.

షేక్‌స్పియర్



మనుషులందరూ మట్టి నుంచి వచ్చినవాళ్లే. వారు పరస్పరం గౌరవప్రదంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంబేద్కర్

# నైపుణ్యం ఉంటే ఉద్యోగం భద్రం

ఏఐ వస్తోంది..నా ఉద్యోగం పోతుందా?"అని భయపడే కంటే, ఏఐ వచ్చిన తర్వాత నా పని ఏ రూపంలో ఉంటుంది? దానికి నేనుసిద్ధంగా ఉన్నానా? అని ఆలోచించడం ముఖ్యం. మరో అపోహను తొలగించుకోవడం కూడా అవసరం. ఏఐని నేర్చుకోవడం అంటే కేవలం చాట్‌జిపిటి వంటి కొన్ని ఏఐ సాధనాలను ఉపయోగించడం లేదా కొన్ని ప్రాంప్ట్‌లు రాయడం మాత్రమేకాదు, తాను పనిచేస్తున్న రంగానికి సంబంధించిన లోతైన విషయ పరిజ్ఞానాన్ని ఏఐ సామర్థ్యానికి జోడించి మెరుగైన ఫలితాలను రాబట్టడం. పొంచి ఉన్న ప్రమాదాన్ని జాగ్రత్తగా గమనిస్తూ, తనకున్న నైపుణ్యాలకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పదు ను పెట్టుకుంటూ ఉండటమే ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగికి శ్రీరామరక్ష. ఉద్యోగస్తులతోబాటు ఉద్యోగార్థులకు, విద్యార్థులకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.



కృష్ణ బాలాజి పల్లపోతు

టెక్నాలజీ రంగంలో ఉద్యోగాల కోతలకు సంబంధించి తరచూ వెలువడుతున్న గణాంకాలు కలవరపెడుతున్నాయి. లేఆఫ్స్‌పై సమాచారం ప్రకారం, ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు ప్రపంచవ్యాప్తంగా 289 టెక్ కంపెనీలు 1,23,305 మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. గత ఏడాది మొత్తం తొలగింపుల సంఖ్యను ఈ ఏడాది ఎనిమిది నెలల్లోనే చేరుకోవడం ఆందోళనకరమే. అయితే ఈ గణాంకాన్ని చూసి టెక్ రంగంలో ఇన్ని ఉద్యోగాలు శాశ్వతంగా కనుమరుగయ్యాయని భావించడం సరికాదు. ఇదే సమయంలో కొత్త నియామకాలు కూడా పెద్ద సంఖ్యలోనే జరిగి ఉండవచ్చు కానీ వాటికి సంబంధించిన కచ్చితమైన సమాచారం అందుబాటులో లేదు. ఈ తొలగింపులకు ఖర్చుల తగ్గింపు, సంస్థల పునర్వ్యవస్థీకరణ, వ్యాపార ప్రాధాన్యతల్లో మార్పులతో పాటు కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం కూడా ఒక ప్రధాన కారణంగా చర్చించబడుతోంది. అయితే ఉద్యోగాలను తొలగిస్తున్న పలు సంస్థల్లోనే కొత్తరకాల ఉద్యోగాలకు గిరాకీ పెరుగుతోంది. ఉదాహరణకు టీసీఎస్ గత ఏడాది 12,000కు పైగా ఉద్యోగాలను తగ్గించే పునర్వ్యవస్థీకరణను చేపట్టగా, ఈ ఏడాది ఏఐ ఆధారిత పరిష్కారాలను అమలు చేయడం కోసం కస్టమర్లతో కలిసి పనిచేసే ఫార్వర్డ్‌డిప్లాయ్డ్ ఇంజినీర్లు అనే ప్రత్యేక విభాగాన్ని సుమారు 8,000 మంది సిబ్బందితో రూపొందిస్తోంది. ఒక సంస్థ కార్యకలాపాలను మునుపటి కంటే వేగంగా, మెరుగ్గా, తక్కువ సిబ్బందితో నిర్వహించగలిగే ఏఐ సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. దాంతో ఉద్యోగి నుంచి కంపెనీ ఆశించే నైపుణ్యాలు, నియామక పద్ధతులు వేగంగా మారుతున్నాయి. ఫౌండిట్ సంస్థ ఆగస్టు గణాంకాల ప్రకారం 7–10 సంవత్సరాల అనుభవం ఉన్న వారి నియామకాలు 10శాతం పెరగ్గా, 0–3 సంవత్సరాల అనుభవం ఉన్నవారి నియామకాలు 9శాతం తగ్గాయి. మరోవైపు, లింక్డ్‌ఇన్ నివేదిక ప్రకారం భారత్‌లో సాధారణ నియామకాలు మందగిస్తున్నప్పటికీ, ఏఐ ఇంజినీరింగ్ నియామకాలు ఏడాది వ్యవధిలో 59.5 శాతం పెరగడం గమనార్హం. నియామకాల విధానం, పరిమాణం ఆధారిత పద్ధతి అంటే 'ఎక్స్' పనికి 'వై' మంది సిబ్బంది కావాలి అనే నమూనా నుంచి, సామర్థ్యం ఆధారిత పద్ధతి అంటే 'ఎక్స్' పనికి 'వై' సామర్థ్యం కావాలి అనే ఒరవడికి మారుతోంది. మూస పద్ధతిలో సాగిపోయే సాధారణ పనులను ఏఐ చేపడుతుండటం వల్ల ప్రవేశ స్థాయి ఉద్యోగాల అవసరం తగ్గుతోంది. అదే సమయంలో నిర్ణయం, విచక్షణ, పరిశోధన,సమస్య పరిష్కారం అవసరమైన మధ్యస్థాయి ఉద్యోగులకు గిరాకీ పెరుగుతోంది. ఈ ధోరణి వేతనాల్లోనూ ప్రతిబింబిస్తోంది. ప్రపంచ బ్యాంకు గణాంకాలను ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం డిజిటల్ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులకు సగటున 12 శాతం అధిక



వేతనం ఉంటే, ఏఐ సంబంధిత ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన వారికి 28శాతం వరకు అధిక పారితోషికం లభిస్తోంది. పిడబ్ల్యుసి ఏఐజాబ్స్ బారోమీటర్ కూడా ఇదే దిశను సూచిస్తోంది. ఏఐ ప్రభావం ఉన్న ఉద్యోగాల్లో కొన్ని పనులు యంత్రాలు చేపట్టగా మిగిలే పనిలో నైపుణ్యం, నిర్ణయ సామర్థ్యం, సృజనాత్మకత, నాయకత్వం వంటి లక్షణాలకు ప్రాధాన్యం ఉంటోంది. ఇలాంటి ఉద్యోగాలను పిడబ్ల్యుసి ప్రొఫెషనలైజ్డ్ ఉద్యోగాలుగా వర్గీకరించింది. మరోవైపు, ఇంతకుముందు శిక్షణ అవసరమైన కొన్ని పనులను ఏఐ సులభతరం చేయడంతో, అవి ప్రత్యేకమైన నైపుణ్యాల అవసరం లేకుండా ప్రతి ఒక్కరూ చేయగలిగేలా మారాయి. పిడబ్ల్యుసి వాటిని డెమొక్రటైజ్డ్ ఉద్యోగాలుగా పేర్కొంది. ఈ రెండు రకాల ఉద్యోగాల వేతనవృద్ధిలో 42 శాతం భారీ వ్యత్యాసం ఉండటం గమనార్హం. ఈపరిణామం టెక్ ఉద్యోగుల బాధ్యతలను తిరగరాస్తోంది. ఒక ప్రోగ్రామర్ కోడ్ రాయడంలో దిట్టకావచ్చు. కానీ అదే పనిని ఏఐ వేగంగా చేయగలిగితే, ఆ నైపుణ్యానికి ఉన్న ప్రత్యేకత, విలువ తగ్గిపోతాయి. అప్పుడు ప్రోగ్రామర్ విలువ కోడ్ రాయడంలో కాకుండా అసలు కోడ్ రాసే అవసరమే లేని ప్రత్యామ్నాయం ఏమైనా ఉందా? కోడ్ అవసరం ఉంటే ఎలాంటి కోడ్ రాయాలి? ఏ ఏఐ మోడల్ ఆ కోడ్ కచ్చితంగారాయగలదు? ఏఐ రూపొందించిన కోడ్‌లో దోషాలు ఉన్నాయా? దానివల్ల భద్రతకు ముప్పు ఉందా? వ్యాపార అవసరానికి అది సరిపోతుందా? వంటి కీలక విషయాలను నిర్ధారించడంలో పెరుగుతుంది. ఈ మార్పు ఫ్రెషర్లకు కూడా ఇబ్బందికరంగా మారింది. కంపెనీలు ప్రవేశ స్థాయి ఉద్యోగాల్లోనూ వ్యూహాత్మక ఆలోచన, నిర్ణయ సామర్థ్యం ఆశిస్తున్నాయి. ఎందుకంటే ఒకప్పుడు ఉద్యోగంలో చేరిన తర్వాత నెమ్మది నెమ్మదిగా నేర్చుకునే అవకాశం ఉన్న సాధారణ పనులు తగ్గుతున్నాయి. ఫ్రెషర్‌కు మొదటి రోజు నుంచే ఏఐ సాధనాలను ఉపయోగించే సామర్థ్యంతోపాటు ఎక్కువ నిర్ణయసామర్థ్యం, లోతైన విషయ పరిజ్ఞానం కూడా అవసరమవుతోంది. ప్రాథమిక స్థాయి, మూసకట్టు ధోరణిలో సాగిపోయే పనులను చాలా వరకూ ఏఐ చేస్తోంది కాబట్టి, ఏఐని ఉపయోగించే సంస్థలన్నీ తప్పనిసరిగా తక్కువ మందితోనే పనిచేస్తున్నాయని చెప్పడం సరికాదు. ఏఐతో కొత్త సేవలు, ఉత్పత్తులు, వ్యాపార అవకాశాలను సృష్టించే కంపెనీలు కొత్త ఉద్యోగావకాశాలను సృష్టిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) అంచనాల ప్రకారం 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 17 కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడవచ్చని, 9.2కోట్ల ఉద్యోగాలు స్థానభ్రంశం చెందవచ్చని, మొత్తంగా 7.8కోట్ల ఉద్యోగాలు నికరంగా పెరగవచ్చని పేర్కొంది. ఉద్యోగం కోల్పోవడం అనేది ఒక్కసారిగా జరిగే పరిణామం,కానీ దానికి దారితీసే నైపుణ్యం విలువ కోల్పోవడం అనేప్రక్రియ మాత్రం నెమ్మదిగా జరిగుతుంది. చాలా సందర్భాల్లో ఆ పరిణామం ఉద్యోగికి తెలియకుండానే చాప క్రిందనీరులా సాగిపోతుంది. కాబట్టి ఏఐ వస్తోంది..నా ఉద్యోగం పోతుందా?"అని భయపడే కంటే, ఏఐ వచ్చిన తర్వాత నా పని ఏ రూపంలో ఉంటుంది? దానికి నేనుసిద్ధంగా ఉన్నానా? అని ఆలోచించడం ముఖ్యం. మరో అపోహను తొలగించుకోవడం కూడా అవసరం. ఏఐని నేర్చుకోవడం అంటే కేవలం చాట్‌జిపిటి వంటి కొన్ని ఏఐ సాధనాలను ఉపయోగించడం లేదా కొన్ని ప్రాంప్ట్‌లు రాయడం మాత్రమేకాదు, తాను పనిచేస్తున్న రంగానికి సంబంధించిన లోతైన విషయ పరిజ్ఞానాన్ని ఏఐ సామర్థ్యానికి జోడించి మెరుగైన ఫలితాలను రాబట్టడం. పొంచి ఉన్న ప్రమాదాన్ని జాగ్రత్తగా గమనిస్తూ, తనకున్న నైపుణ్యాలకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పదును పెట్టుకుంటూ ఉండటమే ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగికి శ్రీరామరక్ష. ఉద్యోగస్తులతోబాటు ఉద్యోగార్థులకు, విద్యార్థులకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. ●

# భూగర్భ జలాలను పరిరక్షిస్తున్నామా!


ఫిరోజ్ ఖాన్

నీటి సంక్షోభం అంటే నదులు ఎండిపోవడం, చెరువులు ఖాళీ కావడం మాత్రమే కాదు. నేల అడుగున నిశ్శబ్దంగా తగ్గిపోతున్న భూగర్భ జలాలు కూడా తీవ్రమైన హెచ్చరిక. ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం 2026 జనవరిలో విడుదల చేసిన ప్రపంచ జల అధ్యయనం ప్రకారం ప్రపంచంలోని ప్రధాన భూగర్భ జలాశయాల్లో దాదాపు 70 శాతం దీర్ఘకాలిక క్షీణతను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ గృహ అవసరాలకు ఉపయోగించే నీటిలో సుమారు సగం భూగర్భ జలాల నుంచేవస్తోంది. సాగునీటికి ఉపయోగించే నీటిలో 40శాతానికి పైగా భూగర్భజలాలపై ఆధారపడుతోంది. అధికంగా నీటిని వెలికితీయడం వల్ల భూమి దిగజారే ప్రమాదం కూడా పెరుగుతోంది. భూగర్భ జలాల అధిక వినియోగంతో ముడిపడిన భూమి దిగజారే ప్రభావం ఆరు మిలియన్ చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరించినట్లు అధ్యయనం పేర్కొంది. దాదాపు రెండు బిలియన్ల మంది ప్రజలు అటువంటి ప్రభావ పరిధిలో ఉన్నట్లు నివేదిక అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా పెద్ద సరస్సుల్లో సగం 1990ల ప్రారంభం నుంచి నీటి నష్టాన్ని ఎదుర్కొన్నట్లు అధ్యయనం వెల్లడించింది. సహజంగా తిరిగి నిండే వేగాన్ని మించి భూగర్భ జలాలను వినియోగిస్తే భవిష్యత్ తరాలపై నీటి భారం మరింత పెరిగే అవకాశం ఉంది. భారతదేశ పరిస్థితిని కేంద్ర భూగర్భ జల మండలి 2025 అంచనాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. దేశవ్యాప్తంగావార్షిక భూగర్భ జల పునఃనింపుదల పరిమాణం 448.52 బిలియన్ ఘనపు మీటర్లు. వినియోగానికి అందుబాటులోఉన్న వార్షిక వనరు 407.75 బిలియన్ ఘనపు మీటర్లు.వార్షిక భూగర్భ జల వెలికితీత 247.22 బిలియన్ ఘనపు మీటర్లు. దేశ స్థాయి భూగర్భ జల వినియోగ దశ 60.63 శాతంగా నమోదైంది. తెలంగాణలో వార్షిక భూగర్భ జల పునఃనింపుదల పరిమాణం 21.93బిలియన్ ఘనపు మీటర్లు కాగా, వినియోగానికి అందుబాటులో ఉన్న వనరు 19.84 బిలియన్ ఘనపు మీటర్లు.వార్షిక వెలికితీత 9.26 బిలియన్ ఘనపు మీటర్లు. వినియోగ దశ 46.69 శాతంగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లో పునఃనింపుదల పరిమాణం 26.34 బిలియన్ ఘనపు మీటర్లు. వినియోగానికి అందుబాటులోఉన్న వనరు 25.02 బిలియన్ ఘనపు మీటర్లు. వార్షిక వెలికితీత 7.88 బిలియన్ ఘనపు మీటర్లు. వినియోగ దశ 31.51 శాతంగా ఉంది. తెలంగాణ తాజా పర్యవేక్షణ గణాంకాలు మరో కోణాన్ని చూపిస్తున్నాయి. 2026 ఆగస్టులో రాష్ట్రసగటు భూగర్భ జలమట్టం భూమి ఉపరితలం నుంచి 7.87 మీటర్ల లోతులో నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 1,771పర్యవేక్షణ కేంద్రాల ద్వారా జలమట్టాలను పరిశీలించారు. జూలైతో పోలిస్తే ఆగస్టులో సగటున 1.61మీటర్ల మెరుగుదల కనిపించింది. 27 జిల్లాల్లో జలమట్టం పైకివచ్చింది. అయితే 2025 ఆగస్టుతో పోలిస్తే రాష్ట్ర సగటు జలమట్టం 2.09 మీటర్లు దిగజారింది. 30 జిల్లాల్లో క్షీణత నమోదైంది. కాబట్టి ఒక నెలలోకనిపించిన మెరుగుదల కంటే దీర్ఘకాలిక జలమట్టాల ధోరణినే ప్రధానంగా పరిశీలించాలి. వర్షం పడటం ఒక్కటే భూగర్భ జల భద్రతకు హామీ కాదు. వర్షపు నీటిలో ఎంత భాగం నేలలోకి చేరుతోంది అన్నదే కీలక ప్రశ్న. తెలంగాణలో 2026 రుతుపవన కాలంలో వర్షపాతం ప్రాంతాలవారీగామారింది. సెప్టెంబర్ 1నాటికి రాష్ట్రంలో 473.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణంగా 581.2 మిల్లీమీటర్లు ఉండాల్సిన స్థాయితో పోలిస్తే 18శాతం లోటునమోదైంది. 33 జిల్లాల్లో 17జిల్లాలు లోటు వర్షపాతం వర్గంలో ఉండగా 16 జిల్లాలు సాధారణ వర్గంలో ఉన్నాయి. ఆగస్టులో 134.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదై, సాధారణ215.8 మిల్లీమీటర్లతో పోలిస్తే 3 శాతం లోటు కనిపించింది. అయితే వర్షపాతంలోటు ఒక్కటే భూగర్భ జలాల క్షీణతకు కారణమని చెప్పడం శాస్త్రీయంగా సరైంది కాదు. వర్షపు నీరు నేలలోకి చొచ్చుకెళ్లే సామర్థ్యం, భూమి స్వభావం, బోర్ల వినియోగం, సాగు విధానం, పట్టణీకరణ, సహజ జలమార్గాల పరిస్థితి వంటి అనేక అంశాలు జలమట్టాలను ప్రభావితం చేస్తాయి. అందుకే ఎంత వర్షం పడింది అన్న దానితో పాటు ఎంత నీరు నేలలోకి చేరింది, ఎంత నీరు వెలికితీశారు అన్న లెక్క కూడా అవసరం.నగర విస్తరణతో సహజ నీటిచొరబాటు ప్రాంతాలు తగ్గకుండా చూడటం భూగర్భ జలభద్రతలో కీలక అంశం. బోర్ల లోతు కాదు.. జల భద్రతే ముఖ్యం! భూగర్భ జలాల సమస్యకు మరింత లోతైన బోర్లు మాత్రమే పరి ష్కారం కావు. వర్షపు నీటిని నిల్వ చేయడం, చెరువులను పునరుద్ధరించడం, కుంటలను కాపాడటం, చెక్‌డ్యామ్‌లు, పర్కొలేషన్ ట్యాంకులు, నీటిని నేలలోకి చేర్చే బావులు నిర్మించడం, పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సేకరణ వ్యవ స్థలను బలోపేతం చేయడం అవసరం. కేంద్ర ప్రభుత్వం కూడా నీటి సంరక్షణ,కృత్రిమ భూగర్భ జల పునఃనింపు దల, వర్షపు నీటి సేకరణకు ప్రాధాన్యం ఇస్తోంది. అయితే ఒక ప్రాంతంలో పనిచేసిన విధానాన్ని మరో ప్రాంతానికి యథాతథంగా వర్తింపజేయడం కంటే స్థానిక భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలి. ప్రజలు, రైతులు, పరిశ్రమలు, పట్టణ సంస్థలు, స్థానికసంస్థలు భాగస్వాములు కావాలి. ●

# రాజకీయ కాలుష్యానికి చరమగీతం పాడాలి!

డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి

వాతావరణ కాలుష్యం ప్రకృతిని దెబ్బతీస్తే.. రాజకీయ కాలుష్యం ప్రజాస్వామ్య వ్యవస్థను, సామాజిక విలువలను నాశనం చేస్తుంది. ఒకటి మన ఊపిరిని కలుషితం చేస్తే మరొకటి మన ఆలోచనలను, సంబంధాలను, భవిష్యత్తును కలుషితం చేస్తుంది. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు నాటాల్సిన అవసరం ఎంత ఉందో.. రాజకీయ కాలుష్యాన్ని తగ్గించేందుకు నైతిక విలువలను పెంచాల్సిన అవసరం అంతే ఉంది. రాముడిని ధర్మానికి ప్రతీకగా, రామరాజ్యాన్ని ఆదర్శ పాలనకు ప్రతీకగా కొలిచే భారతదేశంలో రాజకీయాల్లో విలువల పతనం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ ప్రత్యర్థిత్వం అనేక సందర్భాల్లో విధానపరమైన విమర్శల స్థాయి దాటి వ్యక్తిగత దూషణలు, కక్షసాధింపులు, పరస్పర ఆరోపణలకు చేరుకోవడం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి మంచిది కాదు. రాజకీయ వ్యవస్థలో నైతిక విలువలు క్షీణించి, ప్రజాసేవ స్థానంలో స్వార్థం, అధికార దాహం, అవినీతి, అసత్య ప్రచారం, అవకాశవాదం, కక్షసాధింపు వంటి ధోరణులు పెరగడాన్ని రాజకీయ కాలుష్యంగా చెప్పవచ్చు.సిద్ధాంతాలు, విధానాలు, ప్రజా ప్రయోజనాల కంటే అధికారం, పదవి ముఖ్యమైపోతే రాజకీయాల స్వభావమే మారిపోతుంది. పార్టీలు మారడం తప్పు కాదు, ప్రజా ప్రయోజనాల కోసం రాజకీయ పునర్వ్యవస్థీకరణ కూడా ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ కేవలం పదవి లేదా వ్యక్తిగత ప్రయోజనంకోసం సిద్ధాంతాలను మార్చుకోవడం, ప్రజల తీర్పును తేలికగా తీసుకోవడం రాజకీయ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. ప్రజాస్వామ్యంలో అధికార పక్షాన్ని ప్రతిపక్షం ప్రశ్నించాలి. ప్రతిపక్షాన్ని అధికార పక్షం విమర్శించాలి. కానీ విమర్శ విధానాలపై ఉండాలి. వ్యక్తిత్వ హననంగా మారకూడదు. సోషల్ మీడియా విస్తరణతో రాజకీయ ప్రత్యర్థులపై అసభ్య పదజాలం, ట్రోలింగ్, తప్పుడు ప్రచారం పెరగడం ఆందోళనకరం. నాయకులు మాట్లాడే భాషను యువత గమనిస్తుంది. ప్రజా జీవితంలో ఉన్నవారు పరస్పరం గౌరవం కోల్పోతే, సమాజంలోనూ అదే సంస్కృతి వ్యాపించే ప్రమాదం ఉంది. రాజకీయ నాయకత్వం సమాజానికి ఆదర్శంగా ఉండాలి. అనైతిక ప్రవర్తనకు నమూనాగా మారకూడదు. అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించడం సహజం. తప్పులు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం కూడా అవసరమే. అయితే చట్టం అందరికీ సమానంగా వర్తించాలి. దర్యాప్తు సంస్థలు, పోలీసు వ్యవస్థలు, ప్రభుత్వ యంత్రాంగం రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి ఉపయోగపడుతున్నాయనే భావన ప్రజల్లో ఏర్పడితే ప్రజాస్వామ్యసంస్థలపై నమ్మకం దెబ్బతింటుంది. అధికారం శాశ్వతం కాదు. ఈ రోజు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండవచ్చు. అందుకే వ్యవస్థలను బలపరచడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత.రాజకీయ



కాలుష్యానికి మరో ప్రధాన కారణం ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టే సంస్కృతి. డబ్బు, మద్యం, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలకు ఓటును అమ్ముకోవడం కేవలం ఒక ఎన్నికను ప్రభావితం చేయడం కాదు.ఐదేళ్ల భవిష్యత్తును ప్రభావితం చేయడం. కులం, మతం, ప్రాంతం, వ్యక్తిగత పరిచయం వంటి అంశాలతోపాటు అభ్యర్థి సామర్థ్యం, నిజాయితీ, ప్రజాసేవా దృక్పథం, గత పనితీరు,ప్రజా సమస్యలపై అవగాహన వంటి అంశాలను ఓటరు పరిశీలించాలి. రాజకీయ కాలుష్యానికి మూల్యం సమాజమే చెల్లిస్తుంది రాజకీయాల్లో అవినీతి పెరిగితే ప్రజాధనం దుర్వినియోగమవుతుంది. బంధుప్రీతి, సిఫార్సులు పెరిగితే ప్రతిభకు అన్యాయం జరుగుతుంది. తప్పుడు హామీలు పెరిగితే ప్రజల్లో నిరాశ పెరుగుతుంది. కుల,మత, ప్రాంతీయ విభజనలు రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొట్టబడితే సామాజిక ఐక్యత బలహీనపడుతుంది. అత్యంత ప్రమాదకరమైన పరిణామం ప్రజల్లో రాజకీయ ఉదాసీనత పెరగడం. ఎవరు అధికారంలోకి వచ్చినా మన పరిస్థితి మారదు అనే భావన ప్రజాస్వామ్యానికి విషపూరితం. ప్రజలు రాజకీయాలపై నమ్మకం కోల్పోతే ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల ప్రక్రియగా మిగిలిపోతుంది. యువతే మార్పుకు చోదకశక్తి. భారత దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువత.అందుకే రాజకీయాలను తిట్టడం మాత్రమే కాకుండా, రాజకీయాలను శుద్ధి చేసే బాధ్యతను కూడా యువత తీసుకోవాలి. ముందుగా విజ్ఞతతో ఓటు వేయాలి. అభ్యర్థుల గురించి తెలుసుకోవాలి. తప్పుడు వార్తలను ధృవీకరించకుండా సామాజిక మాధ్యమాల్లో పంచకూడదు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించాలి. అవసరమైనప్పుడు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించాలి. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపాలి. అంతకంటే ముఖ్యంగా సేవాభావం, నిజాయితీ, నిబద్ధత ఉన్న యువత స్థానిక సంస్థల రాజకీయాల్లోకి రావాలి. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ, అసెంబ్లీ, పార్లమెంట్ వరకు మంచి నాయకత్వం ఎదగాలి. రామరాజ్యం అంటే కేవలం నినాదం కాదు రామరాజ్యం అంటే ఒక మతపరమైన నినాదంగా చూడాల్సిన అవసరం లేదు. ప్రజలందరికీ న్యాయం, పాలనలో పారదర్శకత, పాలకుల్లో ధర్మబద్ధత, బలహీనులకు రక్షణ, ప్రజల పట్ల బాధ్యత, అధికారంలో ఉన్నవారికి జవాబుదారీతనం ఉండే ఆదర్శ పాలన అనే విస్తృత భావనగా చూడాలి. అలాంటి రామరాజ్యం రావాలంటే ముందుగా రాజకీయ కాలుష్యాన్ని తొలగించాలి. అందుకు నాయకులు మారాలి. రాజకీయ పార్టీలు మారాలి. అంతకంటే ముఖ్యంగా ఓటర్లు కూడా మారాలి. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతిఒక్కరూ తమవంతుబాధ్యత తీసుకోవాల్సినట్లే, రాజకీయ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి పౌరుడు తన బాధ్యతను నిర్వర్తించాలి. పంచాయతీ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ప్రజాస్వామ్య విలువలు, నైతికత, జవాబుదారీతనం, ప్రజాసేవ అనే నాలుగు స్తంభాలపై భారత రాజకీయ వ్యవస్థను నిర్మించాలి. అప్పుడే రాజకీయాలు అధికార పోరాటానికి వేదిక కాకుండా.. ప్రజాసేవకు పవిత్రమైన వేదికగా మారతాయి. రాజకీయ కాలుష్యాన్ని ప్రశ్నిద్దాం.ప్రజాస్వామ్యాన్ని ప్రక్షాళన చేద్దాం. నైతిక రాజకీయాలకు నాంది పలుకుదాం. ●

# ప్రజావాక్కు



## అన్నీ స్మార్ట్‌ఫోన్‌లోనే..

ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం ప్రభుత్వపాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల కోసం, విద్యార్థిని విద్యార్థుల కోసం లీప్ యాప్ ప్రవేశపెట్టింది. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల హాజరుతో పాటు, వార్షిక పరీక్షల్లో వచ్చిన మార్కులు, టెస్టులలో వచ్చిన మార్కులు, అసెస్మెంట్ చేసినప్పుడు వచ్చిన మార్కులు, కరికులర్ కోరికులర్ ఎక్స్‌ట్రా క్యులర్ యాక్టివిటీస్ అన్ని నమోదు చేసే విధంగా హోలిస్టిక్ ప్రెస్ కార్డును కూడా ప్రవేశపెట్టింది.అయితే గతప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లలో పెట్టించినా ప్యానల్ బోర్డ్స్‌లో బైజుస్ కంటెంట్ కి బదులుగా క్లికర్స్ అనే కంటెంట్‌ని ఉపయోగించమని అధికారులు సూచించారు ఆక్లిక్కర్స్ ఉపయోగించడానికి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వారి స్మార్ట్ ఫోన్‌లలో ఏపీకే ఆప్ ద్వారా వచ్చే డేంజరస్ అని చూపే ఒక యాప్‌ను డౌన్లోడ్ చేయమంటున్నారు. ఇప్పుడు ప్రతిఒక్కటి స్మార్ట్‌ఫోన్‌లోనే ఉంటున్నాయి.

- వి. భాస్కర్ రావు, బొబ్బిలి

## సమాజంలో మార్పు రావాలి

అక్రమ సంబంధాలు పెట్టుకునిభర్తలను భార్యలు, భార్యలను భర్తలు అంతమొందిస్తున్నారు. కడుపున పుట్టిన పిల్లలు అడ్డుగా ఉన్నారనుకుంటే వారినీకిరాతకంగా హతమారుస్తున్నారు. కన్నకూతుళ్లపైనే తండ్రులు అత్యాచారాలు చేస్తున్నారు. దీంతో బాల్యం నుంచే పిల్లలు విలన్‌లా తయారవుతున్నారు. కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత ఉండటం లేదు. ఆస్తికోసం డబ్బుల కోసం కలహించుకుంటున్నారు. ఒకర్నొకరు మోసగించుకుంటున్నారు. స్నేహితులు కూడా ఇలానే ఉంటున్నారు. సమాజం ఎటువైపు పోతోంది. సమాజంలో మార్పు రావాలి.

- కె.రామకృష్ణ, హైదరాబాద్

## ఇ-గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం పాఠశాలవిద్యార్థులకు ఇ-గ్రంథాలయం ఏర్పాటు చేసే దిశగాచర్యలు తీసుకోవాలి. నేటియుగం ఇంటర్నెట్‌కాలం. ప్రతీపాఠశాలలో వాట్సాప్ గ్రూపులున్నాయి. ఈ గ్రూపులల్లో ప్రతీ రోజు పిల్లల కథలు పోస్ట్ చేసి వారిచే చదివించాలి. ఇలా పోస్ట్ చేసిన కథలువిద్యార్థులు ఫోన్లోగ్రంథాలయంగా ఏర్పాటు చేసుకోవాలి. వారంలో వచ్చిన కథలు ప్రతీ శనివారం నోబాగ్ డేగా ఉంచి తరగతిలో విద్యార్థులచే చెప్పించాలి.

- ఆర్. సంగం నాయుడు, హైదరాబాద్

## సమన్వయమే శాశ్వత పునాది

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. జాతీయ రహదారులు, రైల్వేకారిడార్లు, విమానాశ్రయాలు, పారిశ్రామిక పార్కులు, డిజిటల్ మౌలికసదుపాయాల విస్తరణ దేశ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. అయితే ఈప్రగతి ప్రకృతి వనరుల సంరక్షణతో సమన్వయంగా సాగితేనే దీర్ఘకాలిక ఫలితాలు లభిస్తాయి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ పరస్పర విరుద్ధాలు కావు. సరైన విధానాలతో ఒకదానికొకటి బలాన్ని చేకూర్చగలవు. 1987లో బ్రంట్‌లాండ్ కమిషన్ నివేదిక ఆధారంగా ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన సుస్థిర అభివృద్ధి భావన ప్రపంచ విధానాలకు దిశానిర్దేశం చేసింది. భావితరాల అవసరాలను దెబ్బతీయకుండా నేటి అవసరాలను తీర్చే అభివృద్ధినే నిజమైన ప్రగతిగా నిర్వచించింది. ప్రకృతి–అభివృద్ధిసమన్వయమే ఆర్థికవృద్ధికి,పర్యావరణ భద్రతకు, సుస్థిర భద్రతకు, సుస్థిర భారత నిర్మాణానికి శాశ్వత పునాది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## కల్తీ నూనెలతో కేన్సర్

నగరాలు, పట్టణాలలో హోటళ్ళు అనేకంగా ఉన్నాయి. ఈ హోటళ్ళలో వంటలకు, మిఠాయిలకు,తినుబండారాల తయారీకి వాడే వంటనూనెలను ఒకసారి కంటే ఎక్కువ సార్లు వాడటంతో ప్రజలు కేన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు గురి అవుతున్నారు. వాడిన వంటనూనెను పదే పదే వాడటం నిషేధం అయినా అనేక హోటళ్ళ యజమానులు పట్టించుకోవటం లేదు. అయితే దీనికో పరిష్కారం ఉంది. వాడేసిన వంటనూనెలను ప్రాసెస్‌చేసి బయోడీజిల్ తయారీకి ఉపయోగించుకోవచ్చు. ఇప్పుడు మనదేశంలో అనేక పట్టణాలు, నగరాలలో హోటళ్ళ వారి నుంచి వాడేసిన వంట నూనెలను సేకరిస్తున్నారు. దీనివల్ల హోటళ్ళ వారికి రాబడేకాక ప్రజల ఆరోగ్యాలు కాపాడబడతాయి. శిలాజ ఇంధనాల కంటే బయోడీజిల్ ఉత్తమం. కొద్దో గొప్పో పర్యావరణమూ బాగవుతుంది. ఆహార భద్రతాధికారులు ఈ విషయమై లోతుగా ఆలోచించి ఒక ప్రణాళిక రూపొందించాలి.

- కె. వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## చట్టం అందరికీ సమానమే

భారతదేశ రాజ్యాంగంలోని హక్కులు ప్రభావితం చేసే అంశాలు ప్రతి ఒక్కమానవుడికి సమానమే.కులాల పేరుతో మతాల పేరుతో పార్టీలపేరుతో బడానాయకుల పేరుతో నీకొక చట్టం, నాకొక చట్టం అనికాకుండా చట్టాలను గౌరవించాలి. అందరూ ఆర్థికంగా ఎదగాలి.సోదరభావంతో కలిసి మెలసి ఉండాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# యుఎన్ కొత్త మ్యాప్‌లో మళ్లీ తేడాలు!

## అరుణాచల్, అక్సాయ్‌చిన్‌లను ప్రత్యేక ప్రాంతాలుగా చూపిన సమితి

### తప్పుదోవ పట్టించే చిత్రణను ఆమోదించం : భారత్

**న్యూయార్కు, సెప్టెంబరు 8:** ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కరెక్ట్ ది మ్యాప్ తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో వెలువడిన ఈ మ్యాప్‌లో అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను భారత్, చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపించారు. అక్సాయ్‌చిన్‌ను లడఖ్‌లో భాగంగా భారత్ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ఐరాససర్వసభ్య సమావేశం తీర్మానంపై చర్చలు జరుగుతున్న సమయంలో జులై 1న ఈ మ్యాప్‌ను తొలిసారి విడుదల చేశారు. ఇందులో అరుణాచల్‌ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించారు. అరుణాచల్‌ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చూపిస్తూ పశ్చిమాన అసోం, ఉత్తరాన చైనా సరిహద్దుగా ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. అదే విధంగా అక్సాయ్‌చిన్‌ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. దాని పశ్చిమ వైపు భారత్, తూర్పు వైపు చైనా సరిహద్దులు ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. ఈ మార్పులు ఎందుకు చేశారన్న దానిపై ఐరాస ఎలాంటి వివరణ ఇవ్వలేదు. జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్యఉన్న నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)ని కూడా మ్యాప్‌లో చుక్కల రేఖతో చూపించారు. దీనిపై మ్యాప్ కింది భాగంలో ఐరాస వివరణ ఇచ్చింది. భారత్, పాకిస్థాన్ అంగీకరించిన జమ్మూ కశ్మీర్ ఎల్‌ఓసీని ఈ చుక్కల రేఖ సుమారుగా సూచిస్తుందని పేర్కొంది. జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా అంగీకారం కుదరలేదని తెలిపింది. ప్రపంచంలోని ప్రాంతాలను పటాల్లో మరింత కచ్చితంగా, సమానత్వంతో చూపించాలంటూ ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో తీసుకొచ్చిన కరెక్ట్ ది మ్యాప్ తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం గత వారం ఆమోదించింది. ముఖ్యంగా ఆఫ్రికా ప్రాంతాల భౌగోళిక చిత్రణను మరింత సమానంగా చూపించడమే దీని లక్ష్యం. ఈ తీర్మానం చట్టబద్ధంగా అమలు చేయాల్సినది కాదు. అయితే ప్రపంచవ్యాప్తంగా బహుళపక్ష సంస్థలు ఉపయోగించే ప్రామాణిక ప్రపంచ పటాల్లో దీనికి అనుగుణంగా మార్పులు చేసే అవకాశం ఉంది. ఆఫ్రికన్ గ్రూప్ తరఫున టోగో ఈ తీర్మానాన్ని ముందుకు తీసుకెళ్లింది. భారత్ దీనికి మద్దతు తెలిపింది. సమాన విస్తీర్ణాన్ని ప్రతిబింబించే పటాల రూపకల్పన అనే మౌలిక సూత్రానికి మద్దతుగా తాము ఓటు వేసినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఏదైనా నిర్దిష్ట పటం, మ్యాప్ ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణకు ఈ తీర్మానం ఆమోదం కాదని స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు సహా భారత సార్వభౌమ భూభాగాన్ని అధికారిక భారత పటం ప్రకారమే చూపించాలని పేర్కొంది. తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే చిత్రణను అంగీకరించబోమని తెలిపింది.



## విమానాలకు పోటీగా సరికొత్త రైళ్లు

### 600 కి.మీ. వేగంతో ప్రయాణం

**బీజింగ్, సెప్టెంబరు 8:** వేగంలో విమానాలతో పోటీ పడేలా చైనా, జపాన్‌లు రైళ్లను తీర్చిదిద్దుతున్నాయి. తూర్పు ఆసియాలో గంటకు 370 మైళ్ల (600 కి.మీ.) వేగంతో ప్రయాణించే ఫ్లోటింగ్ రైళ్లు, వాణిజ్య విమాన ప్రయాణానికి పోటీగా హై స్పీడ్ రైలున నిలబెడుతున్నాయి. ఈ సాంకేతిక పురోగతిలో చైనా, జపాన్ ప్రధాన కేంద్రంగా ఉన్నాయి. ఒక వాణిజ్య విమానం గంటకు 550 మైళ్ల (885 కి.మీ.) వేగంతో ప్రయాణిస్తుండగా, మ్యాగ్లెవ్ రైలు గంటకు 217 మైళ్ల (350 కి.మీ.) వేగంతో వెళ్లే సాధారణ హైస్పీడ్ రైలు వేగానికి పూర్తి భిన్నమైనది. సాంప్రదాయ బుల్లెట్ రైళ్లు, విమానయాన రంగం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడానికి చైనా ప్రభుత్వ మద్దతు ఉన్న తయారీదారు సిఆర్‌ఆర్‌సి గంటకు 370 మైళ్ల వేగంతో వెళ్లే మాగ్లెవ్ రైలు ప్రోటోటైప్‌ను ప్రదర్శించింది. విద్యుదయస్కాంత సస్పెన్షన్‌పై నడిచే ఈ రైలు యాంత్రిక ఘర్షణ లేకుండా గైడ్ ట్రాక్‌కంటే కొద్ది మిల్లీమీటర్లఎత్తులో సునాయాసంగా తేలుతూ వెళ్తుంది. గరిష్ఠ వేగంతో ఇరుకైన పర్వత మార్గాల్లోకి ప్రవేశించేటప్పుడు ఏర్పడే 'టన్నెల్ బూమ్' గాలి ఒత్తిడిని నివారించడానికి పోరస్, షాక్ అబ్జార్బింగ్ టన్నెల్ బఫర్‌లను రూపొందించడం వంటి సంక్లిష్టమైన ఏరోడైనమిక్ సవాళ్లను చైనా ఇంజినీర్లు అధిగమించారు. రద్దీఎక్కువగాఉండే బీజింగ్ నుంచి షాంఘైకారిడార్‌లో ఈ 370 మైళ్ల మాగ్లెవ్‌ను అందుబాటులోకి తెస్తే, ప్రయాణసమయం సుమారు 4 గంటల నుంచి 2.5 గంటలకు తగ్గ తుంది. ఇది కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తూనే డోర్-టు-డోర్ ఫ్లైట్ సమయాలకు సరిసమానంగా ఉంటుంది.

**పోటీనిస్తున్న జపాన్ రైళ్లు**

షింక్యాన్సెన్‌తో ఆధునిక బుల్లెట్ రైళ్లను ప్రారంభించిన జపాన్, తన చువో షింక్యాన్సెన్ లైన్‌తో దీనికి పోటీనిస్తున్నది. సూపర్ కండక్టింగ్ మ్యాగ్నెటిక్ లెవిటేషన్ సాంకేతికతపై నిర్మించబడిన జపనీస్ టెస్ట్ రైళ్లు, ప్రయోగాత్మక ట్రాక్‌లపై గంటకు 375 మైళ్లు (603 కి.మీ.) రికార్డు వేగాన్ని అందుకున్నాయి. టోక్యో, నాగోయా, ఒసాకా నగరాలను అనుసంధానించేలా డిజైన్ చేసిన జపాన్ సిస్టమ్, అత్యల్ప ఉష్ణోగ్రతలకు చల్లబరిచిన శక్తివంతమైన నియోబియం-టైటానియం అయస్కాంతాలను ఉపయోగిస్తున్నది. ఇది 10 సెంటీమీటర్ల గ్యాప్‌లో తేలుతూ ప్రయాణిస్తుంది. స్థిరమైన లెవిటేషన్‌ను సాధ్యం చేస్తుంది.



## ఇరాన్‌తోయుద్ధం ముగిస్తే భారీగా తగ్గనున్న గ్యాసోలిన్ ధరలు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 8:** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో యుద్ధంలో మనం గెలిచినప్పుడు, మిగతావన్నీ పడిపోతున్నట్లే చమురు ధరలు కూడా వేగంగా పడిపోతాయి. మొదట గ్యాలన్ ధర మూడు డాలర్లకు, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుంది. ఇదంతా చాలా వేగంగా జరిగిపోతుంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో గ్యాసోలిన్ సగటు ధర గ్యాలన్‌కు సుమారు 4.15 డాలర్లుగా ఉంది. లేబర్ డే సమయంలో ఇది రికార్డు స్థాయి కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 97 డాలర్ల వద్ద, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 92 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్‌చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ కూడా ఘాటుగా స్పందించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ మాట్లాడుతూ.. తమ దేశ ఇంధన వనరులపై దాడి చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి వ్యవస్థలు బహిరంగంగానే ఉన్నాయని, అయితే అమెరికా ఆస్తులు కూడా అదే విధమైన బలహీనతను పంచుకుంటాయని ఆయన గుర్తుచేశారు. గతంలో ఇరాన్ ఆయిల్‌ట్యాంకర్ల విషయంలో అమెరికా చేసిన వ్యాఖ్యలను, దానికి తాము ఇచ్చిన సమాధానాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇదిలా ఉంటే ఇరాన్‌కు చెందిన నౌకలపై దాడులకు సంబంధించి అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారులు చర్చలు జరుపుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి.

## మోడీ సభలను పోలుస్తూ రాహుల్‌పై బిజెపి సెటైర్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీల ప్రజాదరణను పోలుస్తూ బిజెపి సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు సంధించింది. మోడీ వడోదర సభకు ప్రజలు స్వచ్ఛందంగా పోటెత్తారని, కానీ రాహుల్ పుణె సభకు మాత్రం డబ్బులిచ్చి జనాలను తరలించాల్సి వచ్చిందని బిజెపి నేత అమిత్ మాలవీయ ఆరోపించారు. ఒక నేతకు నిజమైన ప్రజాదరణ ఉందని, మరొకరికి జనాన్ని సమీకరించడానికి ప్రోత్సాహకాలు అవసరమని ఆయన సోషల్‌మీడియా పోస్ట్ చేశారు. మంగళవారం వడోదరలో జరగనున్న ప్రధాని మోడీ నమో ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమానికి ఆన్లైన్లో ఉచిత రిజిస్ట్రేషన్లు ప్రారంభించిన గంటలోనే సీట్లన్నీ నిండిపోయాయి. బుక్‌మైషో ప్లాట్ఫామ్ ద్వారా ఈ ప్రక్రియను నిర్వహించగా, మరో 42 వేల మందికి పైగా వెయిటింగ్ లిస్టులో ఉండిపోయారు. గత నెలలో పుణెలో రాహుల్ గాంధీ విద్యార్థుల కోసం నిర్వహించిన ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాలవీయ ఈ విమర్శలు చేశారు. ఆసభకు హాజరయ్యేందుకు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు రూ.25వేల నుంచి రూ.35వేల వరకు చెల్లించారని బిజెపి ఆరోపించింది. దీన్ని పైసే కీ గూంజ్ (డబ్బుల హోరు) అని కూడా విమర్శించింది. బిజెపి ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిం చింది. యువత నుంచి రాహుల్ సభకు వస్తున్న స్పందన చూసి బిజెపి భయపడుతోందని, అందుకే ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తోందని ఎదురుదాడి చేసింది.

## మైనర్లు గర్భం దాలిస్తే భర్తలపై పోక్సోకేసు పెడతాం

### పశ్చిమబెంగాల్ సిఎం సువేందు అధికారి

**కోల్‌కత్తా, సెప్టెంబరు 8:** బాల్య వివాహాలు, మైనర్ల ప్రసవాలపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. 18 ఏళ్లు నిండకుండానే భార్య గర్భం దాల్చితే, ఆమె భర్తపై కఠినమైన పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామని ముఖ్యమంత్రి సువేందు అధికారి సంచలన ప్రకటన చేశారు. ఇలాంటి ఘటనల్లో ప్రభుత్వమే సుమోటోగా కేసులు స్వీకరించి, నిందితులపై కఠినచర్యలు తీసుకుంటుందని స్పష్టంచేశారు. కోల్‌కతాలో మీడియాతో మాట్లాడిన సిఎం సువేందు అధికారి బాల్య వివాహాలు, 18 యేళ్లలోపు ప్రసవాల విషయంలో పశ్చిమ బెంగాల్ అపఖ్యాతి పాలైంది. దీనికి గత తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం. ఇకపై ఇలాంటివి ఉపేక్షించం. 18 యేళ్లు నిండకముందే గర్భం దాల్చిన బాలికల భర్తలపై పోక్సో చట్టం కింద కేసులు పెడతాం. దోషులకు గరిష్ఠంగా 20 యేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. వారికి అన్ని ప్రభుత్వ అవకాశాలు, సంక్షేమ పథకాలు కూడా నిలిపివేస్తాం అని తీవ్రంగా హెచ్చరించారు. మైనర్లకు వివాహం జరిపించిన పురోహితులు లేదా ఖాజీలను కూడా వదిలిపెట్టబోమని, వారి కుటుంబ సభ్యులపైనా చర్యలు ఉంటాయని సిఎం తెలిపారు.

## పదేళ్ల అభివృద్ధిపై వారికి ఎంతో కోపం

### వడోదరలో కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ సెటైర్లు

**వడోదరా, సెప్టెంబరు 8:** అభివృద్ధి కార్యక్రమాలపై తన ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తున్న వారిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అలాంటి వారిని నారాజ్ ఫూఫా అంటే కోపంగా ఉన్న మామయ్యలని అభివర్ణించారు. గుజరాత్‌లోని వడోదరాలో నిర్వహించిన నమో ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని రూ.35,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన గత 12 యేళ్లలో దేశంలో పని సంస్కృతి గణనీయంగా మారిందని మోడీ అన్నారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ అవసరమేంటని ప్రశ్నిస్తున్న వారిని ఉద్దేశిస్తూ ఒక నారాజ్ ఫూఫాజీ ట్రక్ డ్రైవర్లు ఏం చేస్తారని అడుగుతారు" అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు నారాజ్ ఫూఫాకు కూడా పని దొరికిందంటూ ఆయన ఎవరినీ పేరుపెట్టకుండా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు చేశారు. ఇదిలా ఉండగా, సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రధాని మోడీని ధురంధర్‌పాటతో కార్యక్రమంలోకి ప్రవేశించిన వీడియోను షేర్ చేస్తూ ఈ కార్యక్రమంపై విమర్శలు చేశారు. సత్య నికేతన్ పీజీ భవనం కూలిన ఘటనను ప్రస్తావిస్తూ విద్యార్థులు విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన సమయంలో గుజరాత్‌లో ఇంత భారీ కార్యక్రమం నిర్వహించడంపై సోషల్ మీడియాలో ప్రశ్నలు లేవనెత్తారు. ప్రధాని మోడీ మాట్లాడుతూ గత కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంతో తమ ప్రభుత్వ మౌలిక వసతుల అభివృద్ధిని పోల్చారు. 21వ శతాబ్దానికి చారిత్రక విజయంగా అభివర్ణించిన 2,800 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు.

నవి ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్టును ఉత్తరప్రదేశ్‌లోని దాద్రీతో అనుసంధానించే వెస్టన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లోని మూడు కీలక సెక్షన్లను ప్రధాని ప్రారంభించారు. వేగంగా అభివృద్ధి



చెందుతున్న భారతదేశానికి డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు జీవనాడి వంటివి. ఆధునిక సరుకు రవాణా నెట్‌వర్క్ కారణంగా భారత్ పరివర్తన వేగవంతమవుతోంది" అని మోడీ అన్నారు. గతంలో ప్రయాణికుల రైళ్లు, సరుకు రవాణా రైళ్లు ఒకే ట్రాక్‌ను ఉపయోగించాల్సి వచ్చేదని, దీంతో ప్రయాణికుల రాకపోకలతో పాటు సరుకు రవాణా కూడా నెమ్మదించేదని చెప్పారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఈ సమస్యను పరిష్కరించిందన్నారు. 2014 తర్వాత మీ ఆశీర్వాదాలతో నేను ఢిల్లీకి చేరుకున్న వెంటనే ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేశాం. 2,800 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ల పనులు నేడు పూర్తయ్యాయని ప్రధాని తెలిపారు. ఈ రోజు తూర్పు, పశ్చిమ ఫ్రైట్ కారిడార్లు దేశ వాణిజ్యం, వ్యాపారానికి ప్రధాన వెన్నెముకగా మారుతున్నాయి" అని పేర్కొన్నారు. 2,800 కిలోమీటర్ల ఫ్రైట్ కారిడార్ పూర్తవడం గత 12 యేళ్లలో దేశ పని సంస్కృతి ఎలా మారిందో చూపిస్తోందని మోడీ అన్నారు.

## వచ్చే యేడాది మే, జూన్‌లలో బుల్లెట్ రైలు

### కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

**వదోదర, సెప్టెంబరు 8:** భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే యేడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన నమో ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్క్వీజ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే యేడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ రైలును ప్రారంభిస్తార్తు అని వైష్ణవ్ చెప్పారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్‌వాపి మార్గం ఈ యేడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో




ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.

## ట్రంప్ మూడోసారి కూడా ఎన్నికవుతారు!

### ఇరాన్‌పై యేళ్లతరబడి అమెరికా యుద్ధం!: చైనా నోస్ట్రడామస్ జోస్యాలు

**బీజింగ్, సెప్టెంబరు 8:** చైనా నోస్ట్రడామస్‌గా పేరుపొందిన చైనాకెనడాకు చెందిన విద్యావేత్త ప్రొఫెసర్ జియాంగ్ జ్యూకిన్ 2027లో అమెరికా ఎదుర్కొనే పరిణామాలపై చేసిన అంచనాలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. జియాంగ్ అంచనాల ప్రకారం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మరింత ముదిరే అవకాశం ఉంది. వైమానిక దాడులతో సమస్య పరిష్కారం కాకపోతే అమెరికా నేరుగా భారీ స్థాయిలో భూతల యుద్ధంలోకి దిగే పరిస్థితి రావచ్చని ఆయన భావిస్తున్నారు. ఈ యుద్ధం యేళ్ల తరబడి కొనసాగుతుందని చెబుతున్నారు. యుద్ధం సుదీర్ఘంగా సాగితే అమెరికా సైన్యంలో సిబ్బంది కొరత ఏర్పడొచ్చని జియాంగ్ అంచనా. దీంతో తప్పనిసరి సైనిక సేవకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థను 2027 నాటికి సిద్ధం చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. యువతను సైన్యంలోకి తీసుకునే పరిస్థితి రావచ్చని అన్నారు. అమెరికాలో అంతర్గత పరిస్థితులు కూడా ఉద్రిక్తంగా మారొచ్చని ఆయన అంచనా వేశారు. ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థ ఐసిఇ అధికారాలు మరింత పెరగవచ్చని అన్నారు. ప్రధాన నగరాల్లో నేషనల్ గార్డ్ మోహరింపులు తరచుగా కనిపించే అవకాశం ఉందని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిలో రవాణాకు అంతరాయం ఏర్పడితే దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుందని జియాంగ్ చెబుతున్నారు. చమురు, గ్యాస్, ఎరువుల



ధరలు భారీగా పెరగొచ్చని అంచనా వేశారు. సరఫరా వ్యవస్థలు దెబ్బతింటే ఆహార కొరత, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, తప్పనిసరి సైనిక సేవపై వ్యతిరేకత, వీధుల్లో భద్రతా బలగాల మోహరింపులు కలిసి అమెరికాలో తీవ్ర అశాంతికి దారితీయొచ్చని జియాంగ్ అభిప్రాయపడ్డారు.

2027లో అంతర్యుద్ధానికి దారితీసే పరిస్థితులు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. జియాంగ్ మరో సంచలన అంచనా కూడా వెలువరించారు. డొనాల్డ్ ట్రంప్ మూడోసారి అమెరికా అధ్యక్షుడయ్యే అవకాశం ఉందని అన్నారు.

ప్రస్తుత అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండు పర్యాయాలకు మించి అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి వీల్లేదు. అయినప్పటికీ ట్రంప్ మూడోసారి అధికారంలోకి రావచ్చని జియాంగ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో అంతర్యుద్ధం జరిగితే దేశం చిన్న చిన్న ప్రాంతాలుగా విడిపోయే పరిస్థితి రావచ్చని ఆయన మరోసారి వ్యాఖ్యానించారు. దీన్నే బాల్కనైజేషన్‌గా పేర్కొన్నారు. దాదాపు 20 యేళ్ల తర్వాత అమెరికా క్రిస్టియన్ ఎఐ థియోక్రసీగా మారుతుందని కూడా ఆయన అంచనా వేశారు. ఆస్టిన్ భవిష్యత్తులో అమెరికాకు కొత్త కేంద్రంగా మారొచ్చని న్యూయార్క్, లాస్ ఏంజెల్స్ ప్రాధాన్యం తగ్గొచ్చని అన్నారు.

## బ్రిక్స్ సదస్సుకు ముందు ప్రధాని మోడీ, పుతిన్‌ల ద్వైపాక్షిక భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** ప్రధాని నరేంద్ర మోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు రష్యా ధ్రువీకరించింది. ఈ సమావేశంలో ప్రపంచ ఇంధన సరఫరా, వాణిజ్యం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. రష్యా ప్రెస్ సెక్రటరీ దిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ ప్రధాని మోడీ, అధ్యక్షుడు పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారని వెల్లడించారు. పర్షియన్ గల్ఫ్‌లో నెలకొన్న పరిస్థితులు, ప్రపంచ ఇంధన సరఫరా, ఇరాన్ చుట్టూ కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు చర్చల్లో ప్రస్తావనకు రానున్నాయని తెలిపారు. అదేవిధంగా ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక సంబంధాలపైనా చర్చలు జరుగుతాయని పెస్కోవ్ చెప్పారు. అయితే ఈ అంశాలను బహిరంగంగా చర్చించే అవకాశం లేదని, కొన్ని స్నేహపూర్వకంగా లేని దేశాల కారణంగా వాణిజ్య, ఆర్థిక అంశాలపై చర్చలు గోప్యంగా జరిగే అవకాశముందని పేర్కొన్నారు. భారత్ మార్కెట్‌పై రష్యా కంపెనీల ఆసక్తిరష్యా కంపెనీలు భారత మార్కెట్‌పై ఆసక్తి చూపుతున్నాయని పెస్కోవ్ తెలిపారు.

అదే సమయంలో రష్యాలో భారత కంపెనీలు పెట్టుబడులు, వ్యాపార అవకాశాలపై చూపుతున్న ఆసక్తి కూడా ఇరు దేశాల వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు మంచి అవకాశమని చెప్పారు. ఈ అంశాన్ని ప్రధాని మోడీతో చర్చించేందుకు అధ్యక్షుడు పుతిన్‌కు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, త్వరలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం వాణిజ్యం, పెట్టుబడులు, సరఫరా గొలుసుల సహకారానికి కొత్త అవకాశాలను తెరవనుందని భావిస్తున్నారు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధ, తయారీ, స్వచ్ఛ ఇంధనం, ఫిన్‌టెక్ వంటి రంగాలు దీనివల్ల ప్రయోజనం పొందే అవకాశం ఉంది. సభ్య దేశాల మధ్య మరింత ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం, సరఫరా గొలుసుల స్థిరత్వానికి మార్గాలను రూపొందించడం, డిజిటల్ సాధికారతను ప్రోత్సహించడం వంటి అంశాలకు న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సు ద్వారా భారత్ ప్రాధాన్యత ఏర్పడుతోంది.

# సంక్షిప్త వార్తలు

## పోక్సోకేసులో ఒకరికి మరణశిక్ష, మరో ఇద్దరికి కఠినజైలు


**తిరునల్వేలి, సెప్టెంబరు 8:** మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికపై పెయింటర్ మునీశ్వరన్ (25) తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు.

## రాజస్థాన్‌లో 44 మంది బిజెపి అభ్యర్థులు ఏకగ్రీవం

**జైపూర్, సెప్టెంబరు 8:** రాజస్థాన్‌లో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ దశలో ఎన్నికలు జరగాల్సిన మొత్తం 77 స్థానాల్లో బిజెపికి చెందిన 44 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నుంచి 16 మంది, స్వతంత్రులు 17 మంది ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన 77 మందిలో 37 మంది మహిళలు ఉన్నారు. వీరిలో నలుగురు అత్యంత పిన్న వయస్కులైన అభ్యర్థులు కూడా ఉన్నారు.

## అగ్నిపర్వతం పేలుడుతో 2300 విమాన సర్వీసులు రద్దు

**జకార్తా, సెప్టెంబరు 8:** ఇండోనేషియాలోని సుప్రసిద్ధ అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలవడం తెలిసిందే. సుమారు 25 గంటల పాటు నిరంతరాయంగా లావా, బూడిద వెదజల్లడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విస్ఫోటనం కారణంగా ఆకాశమంతా దట్టమైన బూడిద మేఘాలు అలుముకోవడంతో రవాణా వ్యవస్థ, ముఖ్యంగా విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ అగ్నిపర్వతం 24 గంటల పాటు ఏకధాటిగా లావాను వెలిగక్కింది.



## రాయ్‌బరేలి పర్యటనకు రాహుల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ పార్లమెంటరీ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరును రాహుల్ సమీక్షించనున్నారు.

## కేరళ మాజీ సిఎంపై కేసు నమోదుచేయాలని ఇడి లేఖ

**తిరువనంతపురం, సెప్టెంబరు 8:** కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కేసుతో ముడిపడి ఉన్న లంచాల వ్యవహారం కేరళ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. నిధుల అక్రమ మళ్లింపు వ్యవహారంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె టి. వీణ, అల్లుడు పి.ఎ. మహమ్మద్ రియాస్‌లతో పాటు పలువురిపై తక్షణమే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని రాష్ట్ర డిజిపికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారికంగా లేఖ రాసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 66 నిబంధనల ప్రకారం తమ వద్ద ఉన్న పక్కా ఆధారాల ప్రాతిపదికన ఈ సమాచారాన్ని కేరళ పోలీసులకు బదిలీ చేసినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి.



## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు..

## మహిళా కాంగ్రెస్ నిరసన

### తాతామధు దిష్టిబొమ్మదగ్ధం

**హైదరాబాద్,సెప్టెంబరు 8,ప్రభాతవార్త:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ ఎంఎల్సీ తాత మధు దిష్టిబొమ్మను మహిళా కాంగ్రెస్ శ్రేణులు దగ్ధం చేశారు. దళితుల పట్ల అమర్యాదగా వ్యవహరించడమే కాకుండా శాసనసభ గౌరవం తగ్గించే విధంగా ప్రవర్తించిన శాసనమండలి సభ్యులను వెంటనే బర్తరఫ్ చేయాలనీ మహిళా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వంలో, ఖైరతాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్ల ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే తాటి మధు చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తాత మధు దిష్టిబొమ్మను దహనం చేశాము. బాధ్యతాయుతమైన శాసనసభ్యుడిగా వ్యవహరించాల్సి న వ్యక్తి రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని కించపరిచేలా మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఈ వ్యాఖ్యలు మహిళల పట్ల బిఆర్ఎస్‌కు ఉన్న అమర్యాదకరమైన వైఖరితోపాటు దళితుల పట్ల ఆ పార్టీ నాయకుల్లో నెలకొన్న చిన్నచూపును మరోసారి బయటపెట్టాయనీ ఆరోపించారు. దళిత స్పీకర్‌ను అవమానించిన తాత మధును బిఆర్ఎస్ పార్టీ నుంచి కెసిఆర్ బహిష్కరించి శాసనసభకు వచ్చి క్షమాపణలు తెలుపాలని కోరారు. ఎంఎల్సీ పదవి వెంటనే బర్తరఫ్ చేయడంతోపాటు ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీ, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు కవిత, మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆఫీస్ బేరర్లు, నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్యానల్ స్పీకర్లుగా కడియం, కూనంనేని, బాలునాయక్, కౌసర్ నియామకం

**హైదరాబాద్,సెప్టెంబరు 8,ప్రభాతవార్త:** శాసనసభలో నలుగురు ఎమ్మెల్యే పేర్లను మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. కార్వాన్ అసెంబ్లీ ఎమ్మెల్యే కౌసర్‌మోహినోద్దిన్, స్టేషన్ ఘణపురం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌లను ఎంపిక చేసినట్లు స్పీకర్ ప్రకటించారు. ఆ వెనువెంటనే మధ్యాహ్నాం ప్యానల్ స్పీకర్ స్టేషన్ గణపురం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అసెంబ్లీని నిర్వహించారు.

## మాజీ ఎమ్మెల్యేల మృతికి అసెంబ్లీ సంతాపం

**హైదరాబాద్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇటీవల మృతి చెందిన నలుగురు మాజీ ఎమ్మెల్యేలకు శాసనసభ సంతాపం వ్యక్తం చేస్తూ తీర్మానం చేసింది. తెలంగాణ శాసనసభ మంగళవారం వాయిదా పడిన అనంతరం మధ్యాహ్నాం సంతాప తీర్మానాలతో ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా ఎల్లందు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుబ్బారావు వంగా, భోంగీర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నరసింహారెడ్డి కొమ్మిడి, నర్సంపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, చెరియల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జి. సిద్దయ్యల మృతుల కుటుంబాలకు సభ లాంఛనంగా సంతాపం తెలిపింది. నాయకులకు గౌరవ సూచకంగా సభ రెండు నిమిషాల పాటు మోనం పాటించింది.

## ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డితో పోలీసులు వ్యవహరించిన తీరు హేయం

### బిజెపి ఎంపి డికె అరుణ

**హైదరాబాద్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** అసెంబ్లీ అవరణలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డితో పోలీసులు వ్యవహరించిన తీరు చాలా హేయమైందని బిజెపి ఎంపి డికె అరుణ అన్నారు. మహిళ శాసన సభ్యులపై పోలీసులు అనుచితంగా ఎవరి ఆదేశాల ప్రకారం ప్రవర్తించారని, సిఎంగా, హోం మంత్రిగా నా ఏ హోదాలో పోలీసులను ఆదేశించారా? అంటూ ప్రశ్నించారు. కొంచమైనా సిగ్గు అనిపించడం లేదా..? అన్నారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీ చేసిన అనుచిత వాక్యాలను తప్పుగా ఉందని భావించి క్షమాపణలు కోరాలని చెప్పడం, చర్యలు తీసుకోవాలని సభలో చర్చించడం జరిగిందన్నారు. దీంతో పాటు మహిళ శాసన సభ్యులపై వ్యవహరించిన తీరుపై చర్చ పెట్టాలన్నారు. ఎందుకు మహిళ శాసన సభ్యులను అవమానించాల్సి వచ్చింది, మహిళ ఎమ్మెల్యేల మెడ, వెంటుకలు పట్టుకొని గుంజడం, చీర లాగడంపై నోరు విప్పకపోవడం కన్నా దారుణం ఏమైనా ఉంటుందా? అన్నారు. ఆ పోలీసులపై వెంటనే యాక్షన్ తీసుకోవాలి. మహిళ ఎమ్మెల్యేల పరిస్తితి ఇలా ఉంటే సామాన్యుల పరిస్తితి తెలంగాణలో ఎలా ఉందో అర్థం చేసుకోవాలి. మహిళ ఎమ్మెల్యేలకు ఎంత అగౌరవం అన్నారు. ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలు ఉమ్మడి రాష్ట్రంలో మంత్రులుగా పని చేసిన వారు, పార్టీలు వేరైన సాటి ఎమ్మెల్యేలను గౌరవించాల్సి న బాధ్యత ముఖ్యమంత్రిపై ఉంటుందన్నారు.

# అసెంబ్లీలో మాటల యుద్ధం



హరీశ్‌రావు



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల రెండో రోజు మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ సభాపతి స్థానంలో కూర్చోగానే 'సభాపతి ఒకవైపు చూస్తారు మహిళా శాసనసభ్యులపై దాడిచేస్తే స్పందించరా అంటూ బిఆర్ఎస్ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు వ్యాఖ్యలతో వాడివేడిగా మొదలైంది. మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌లు, రాంచందర్‌నాయక్‌లు మాట్లాడతూ మాజీ మంత్రులు బట్టలిప్పి అసభ్యంగా ప్రవర్తించారని మహిళా కానిస్టేబుళ్లను తడిమారని ఆరోపించారు. బిఆర్ఎస్ శాసనసభ్యులు నల్లబ్యాడ్జిలు ధరించి శాసనసభకు హాజరై మహిళా ఎమ్మెల్యేల పట్ల అమర్యాదగా వ్యవహరించిన పోలీసులపై చర్యతీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు ప్రశాంతరెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, వివేకానంద, డా.కల్వకుంట్ల సంజయ్‌లుమాధవరం కృష్ణా రావు ప్లకార్డులు పట్టుకొని వెల్‌లోకి దూసుకొని వచ్చి నినాదాలు చేయడంతో సభను స్పీకర్ గడ్డం ప్రసాద్ వాయిదా వేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు మధ్యవాగ్వాదం జరిగింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సభ్యుల పట్ల అగౌరవంగా ప్రవర్తించడం నిజమైతే బాధ్యులపై చర్యతీసుకొంటాం అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నది తన తల్లిపై నాకు ఆవేశం ఉండాలి హరీశ్‌రావు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. నాకు ఎనిమిది మంది అక్కా చెల్లెలు ఉన్నారనీ సబిత,సునీతలు కూడా నా చెల్లెలే మరి నా సంగతేమిటి హరీశ్‌రావు తల్లిని కాదని వ్యాఖ్యానించారు. ఆవేశం తనకు ఉండాలని బిఆర్ఎస్ నేతలపై కాదనీ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడికి సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు. హరీష్‌రావు మీరు భయపెడితే నేను భయపడను లొల్లి పెట్టకండి వినండి మీరు తప్పుచేశారు. మహిళా సభ్యులంటే సభతో పాటు తనకు కూడా గౌరవం స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. మీరు చెబితే నేను వినట్లేదా? తాను మాట్లాడుతుంటే మీకు ఎందుకంత ఆవేశమని హరీశ్‌రావును స్పీకర్ ప్రశ్నించారు. "మీకు కాదు ఆవేశం నాకు ఉండాలి. మీ తల్లిని అనలేదు, నా తల్లిని అన్నారు" అని పదేపదే అంటూ భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మిపట్ల తనకు గౌరవం ఉందని స్పీకర్ అన్నారు. వారికి జరిగిన అసౌకర్యానికి నివేదిక కావాలని ఆదేశించినట్లు తెలిపారు. రిపోర్టు రాగానే దానికి సంబంధించిన చర్యలు తీసుకుంటామని హరీశ్‌రావుకు సమాధానం ఇచ్చారు. ప్రశాంతరెడ్డి మీరు కూడా ఈ విధంగా వ్యవహరించడం తగదు కూర్చోండి అంటూ స్పీకర్ ఆదేశించారు. అసెంబ్లీ ప్రారంభించక ముందే మాజీ మంత్రి హరీశ్ రావులేచి తమ ఎమ్మెల్యేలు సబిత, సునీతలపై జరిగిన దాడికి ఇంకా చర్యలు తీసుకోలేదని అన్నారు. ముగ్గురు బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై కేసు పెట్టారని పేర్కొన్నారు. గౌరవ సభ కౌరవసభగా మారిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అసెంబ్లీకి రాకుండా చేసి, ప్రజా సమస్యలు సభలో చర్చకు రాకుండా చేయడమే మీ కుట్రా అని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. వెయ్యి రోజుల పాలనా వైఫల్యాలు, సెక్షన్ 22ఎ భూముల వ్యవహారం, భూ కుంభకోణాలపై చర్చకు భయపడుతున్నారా అని నిలదీశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు, రైతు సమస్యలు, సభలో చర్చకు వస్తాయనే భయంతోనే ఈ అరెస్టులా అని మండిపడ్డారు. మహిళా శాసనసభ్యుల చీరలు లాగారని,గొంతు పిసికారని తెలిపారు. ఈ వికృత చేష్టలకు పాల్పడిన వారిపై చర్యలకు తీసుకోరా అని ప్రశ్నించారు. ఉల్టా మాపైనే కేసులు పెట్టి అరెస్టు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయని హరీశ్‌రావు విమ ర్శించారు. మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డిపై మగ పోలీసులు దాడి చేశారని ఎమ్మెల్యే సునీతమ్మ చీర లాగారని ఆరోపించారు. దీనిపై హైదరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు లేవని తెలిపారు. ఉల్టా సబితమ్మ, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మిపైనే కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మహిళలందరిపై జరిగిన దాడిగా హరీశ్‌రావు అభివర్ణించారు. ఇది కౌరవ సభ అనీ, రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడు అని విమర్శించారు. కౌరవులకు పట్టిన గతే కాంగ్రెసోళ్లకు పడుతుందని అన్నారు. శ్రీధర్ బాబుకు కూడా అక్కాచెల్లెళ్లు ఉన్నారని హరీశ్‌రావు అన్నారు. మహిళా సభ్యులకు మంత్రి శ్రీధర్ బాబు క్షమాపణ చెబుతారని అనుకున్నామని తెలిపారు. కానీ మా ఎమ్మెల్సీలను అరెస్టు చేసి, జైలుకు పంపించారని అన్నారు. అధికారం మీ చేతిలో ఉంది.. మీ ఇష్టమని వ్యాఖ్యానించారు. స్పీకర్ అంటే తమకు అత్యున్నత గౌరవం ఉందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. స్పీకర్‌తో ఇదే సభలో కలిసి పనిచేశామని తెలిపారు. స్పీకర్‌ను ఉద్దేశించి అనలేదని మా ఎమ్మెల్సీ తాతా మధు మీడియా ముఖంగా చెప్పారని అన్నారు. ఒకవేళ స్పీకర్ భావించి ఉంటే విత్‌డ్రా చేసుకుంటానని చెప్పారని తెలిపారు. స్పీకర్ బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేస్తున్నానని కూడా చెప్పారని పేర్కొన్నారు. స్పీకర్ బాధపడి ఉంటే మేమందరం కూడా విచారిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దళితులపై గౌరవం ఉంటే125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఎందుకు అవమానించారని ప్రశ్నించారు. భారీ అంబేద్కర్ విగ్రహానికి కనీసం ఒక పూలదండ అయినా వేశారా అని నిలదీశారు. మా పార్టీ మహిళా సభ్యులకు జరిగిన అవమానంపై చర్యలేవి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మా మీద దాడి చేయించింది రేవంత్ రెడ్డినే అని స్పష్టం చేశారు. స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క మాట్లాడతూ మాజీ మంత్రి హరీష్‌రావు బట్టలు విప్పి మహిళల పోలీసుల ఉన్నారని కూడా చూడకుండా అసభ్యంగా ప్రవర్తించారని కెటిఆర్ మహిళా పోలీసు అధికారిని పిడిగుద్దులు గుద్దారని అన్నారు. మహిళా శాసనసభ్యురాలు చీరలాగారని ఆరోపించేవారు నిజంగా తమచీరను పోలీసులు లాగా ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆమె హితవు చెప్పారు. హరీష్‌రావును విమర్శించారని కవితను బహిష్కరించలేదా ప్రతిపార్టీకి ఉన్నట్లుగానే ప్రభుత్వంకు కూడా సమష్టి బాధ్యత ఒక క్రమశిక్షణ ఉంటుదని ఆమె వ్యాఖ్యానించారు. శాసనసభ వ్యవవహారాల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హరీష్‌రావు వైఖరి స్పీకర్‌ను బెదిరించినట్లు ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు స్పీకర్‌ను అవమానపరిచిన అంశంపై హరీష్‌రావు చేసిన క్షమాపణ సంజాయి ఎలా ఉందంటే " సభ్యుడు ఆవిధంగా అనేదని అలా వ్యాఖ్యానించినారని స్పీకర్ భావిస్తే, బాధపడితే" అంటూ బాధ్యతరహితంగా ఉందని ఆవేదన చెందారు. స్పీకర్‌పై జరిగిన మాటల దాడిని పక్కనపెట్టాల స్పీకర్‌ను హరీష్‌రావు డిక్టేట్ చేస్తున్నారని శ్రీధర్‌బాబు అన్నారు. స్పీకర్ ఇలా చేయొద్దు అలా చేయొద్దు అని చెప్పడం ఏంటి మీ కు ఎలా అనుకూలమో అలా సభ నడపాలా అని అన్నారు. నాకు ఒక అక్క చెల్లె ఉన్నారు మొన్ననే రాఖీ పండుగకు రాఖీ కట్టించుకొన్నాను సబిత,సునితలతో కలిసి పనిచేసిన అనుబంధం ఉంది పూర్తి సమాచారం రాగానే చర్యలు తీసుకొంటామని తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మన్‌కుమార్ మాట్లాడుతూ కెసిఆర్ సభకు వచ్చి క్షమాపణ చెప్పితేనే బిఆర్ఎస్ సభ్యులు సభలో మాట్లాడటానికి అనుమతి ఇవ్వాలని కోరారుజ మహిళలను అడ్డంపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహించారు

నేను బెదరను.. నా తల్లిని మాటలన్నారు..
హరీశ్ నా సంగతేమిటి ? : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సునీతాలక్ష్మారెడ్డి చీరె లాగిన పోలీసులు : హరీశ్‌రావు

స్పీకర్‌ను హరీశ్‌రావు డిక్టేట్ చేయడమేంటి?
మీరు చెప్పినట్లు సభ జరపాలా? : మంత్రి శ్రీధర్‌బాబు

హరీశ్‌రావును విమర్శిస్తే కవితను ఎందుకు బహిష్కరించారు? మంత్రి సీతక్క

కెసిఆర్ సభకు వచ్చి క్షమాపణ చెబితేనే బిఆర్ఎస్‌కు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వండి : మంత్రి అడ్లూరి

# కౌన్సిల్‌లో రోజంతా హైడ్రామా

### అక్రమంగా అరెస్ట్ చేశారంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీల ఆందోళన

### స్పీకర్‌పై వాఖ్యలు ఖండించిన కాంగ్రెస్, బిజెపి, ఎంఐఎం నేతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 8,ప్రభాతవార్త:** శాసనమండలిలో మంగళవారం హైడ్రామా నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రంవరకు బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలిలో ఆందోళనకు దిగారు. తమ ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ నిరసన తెలిపారు. ఉదయం 10గంటలకు సభ ప్రారంభం కాగానే మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి తాతామధు, నవీన్‌రెడ్డిల అరెస్ట్ వివరాలు సభకు తెలుపగా వారిపై చర్యలు తీసుకోలని పిసిసి ఛీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతున్న సమయంలో బిఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో చైర్మన్ సభను వాయిదా వేశారు. అనంతరం 11గటంలకు సభ తిరిగి ప్రారంభం కాగా బిఆర్ఎస్ ఎల్పిలీడర్ మధుసూధనాచారి మాట్లాడుతూ తమ సభ్యుల వాయిస్ వినకుండా బిఆర్ఎస్‌ను బదనాం చేయాలని చూడటం సరికాదన్నారు. ఈనేపథ్యంలో మధుసూథనాచారి మాట్లాడుతుండగా చైర్మన్ మైక్ కట్‌చేసి బిజెపి ఎమ్మెల్సీకి ఇవ్వగా బిఆర్ఎస్ సభ్యులు మళ్లీ ఆందోళన చేశారు. మరోవైపు మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, ఎవిఎన్‌రెడ్డి ,మాట్లాడుతున్న సమయంలోనూ బిఆర్ఎస్ నేతలు నినాదాలు చేస్తూ వెల్‌లో కింద కూర్చుని నిరసన తెలిపారు. దీంతో చైర్మన్ 11.50కి సభను వాయిదా చేశారు. అనంతరం అసెంబ్లీ సమావేశం ముగిశాక మండలి సమావేశం ప్రారంభం కాగా తాతామధు, నవీన్‌కుపై చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ ప్రకటించిన తర్వాత సభ బుధవారానికి వాయిదా పడింది. సభ వాయిదా పడ్డాక బిఆర్ఎస్ సభ్యులు తమ సీట్లలోనే ఉండటంతో మార్షల్స్ వచ్చి వారిని బయటకు తీసుకెళ్లారు.

### మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పుతారా? మంత్రి సీతక్క



మహిళా సభ్యులు, పోలీసులుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దుస్తులు ఎలా విప్పుతారని సీతక్క ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించి, అనంతరం అలాంటి వ్యాఖ్యలు అనలేదని అబద్ధాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అసలు స్పీకర్‌ను ఎందుకు తిట్టాల్సి వచ్చిందని సీతక్క ప్రశ్నించారు. అసభ్యకర పదజాలంతో స్పీకర్‌ను తిట్టారని, అసెంబ్లీలో హరీశ్‌రావు స్పీకర్ పోడియంపైకి వెళ్తున్నారని, ఇప్పుడు స్పీకర్‌ను కొడుతారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై మహిళా కమిషన్‌కు వినతిపత్రం అందిస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్‌ను అవమానించారని మంత్రి వాకిటి శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ,ఎస్టీ ,బిసి లీడర్లు మాట్లాడినా, రాజకీయంగా ఎదిగినా వీరు జీర్ణించుకోలేరిన మండిపడ్డారు.

### దళితుల విషయంలో బీఆర్ఎస్ పార్టీ దారుణంగా ప్రవర్తిస్తుంది: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

సోమవారం అసెంబ్లీ వద్ద జరిగిన సంఘటన తీవ్ర అభ్యంతరకమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. దళితుల విషయంలో బీఆర్ఎస్ పార్టీ దారుణంగా ప్రవర్తిస్తుందన్నారు. దళితులపై జరుగుతున్న దాష్టీకాలను ఖండించాలన్న మల్లన్న, దళిత బిడ్డ స్పీకర్ స్థానంలో ఉన్నందుకే బీఆర్ఎస్ దారుణంగా ప్రవర్తిస్తుందని మండిపడ్డారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండించిన అసెంబ్లీ

### కెసిఆర్ క్షమాపణ చెప్పాలి: అక్బరుద్దీన్ ఓవైసి

**హైదరాబాద్, సెప్టెంబరు 8,ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధుసూదన్, ఎన్ నవీన్‌కుమార్‌రెడ్డిలు అత్యంత అవమానకరమైన, దూషణాత్మక, పార్లమెంటరీయేతర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలను సభ తీవ్రంగా ఖండించింది. వ్యాఖ్యలు చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సభ్యులు ముక్త కంఠంతో కోరారు. తెలంగాణ వర్షాకాల శాసనసభ సమావేశాలు మంగళవారం రెండో రోజు మధ్యాహ్నాం వాయిదా పడిన అనంతరం ప్రారంభం కాగానే శాసన వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై సభలో చర్చకు ప్రవేశపెట్టారు. ఇదే సమయంలో సోమవారం శాసనసభ వద్ద ప్రతిపక్ష బిబీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరుపై కూడా ప్రస్తావనకు వచ్చింది. స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అభ్యంతరకరమైన భాష, అసెంబ్లీ వద్ద మహిళలపై జరిగిన సంఘటన పట్ల సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. మహిళల సమక్షంలో సభ్యులు బహిరంగంగా తమ చొక్కాలు తొలగించారని ఆరోపిస్తూ, వారి ప్రవర్తనను అసభ్యకరమని పేర్కొంటూ సభ తీవ్రంగా విమర్శించింది. ఈ చర్య అభ్యంతరకరమని, అక్కడున్న మహిళల గౌరవానికి అవమానకరమని అభివర్ణించింది. ఈ సభ యొక్క సంస్థాగత సమగ్రత, మర్యాద, సభ్యత దృష్ట్యా, బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ప్రతిపక్ష నాయకుడు కే చంద్రశేఖర్ రావు బాధ్యత వహించి, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కూడా సభ కోరింది. తీర్మానంలో పేర్కొన్న ఇద్దరు ఎమ్మెల్యేలు శాసన మండలిలో సిట్టింగ్ సభ్యులుగా ఉన్నందున, మండలి హక్కులు క్రమశిక్షణకు సంబంధించిన నియమాల ప్రకారం తదుపరి పరిశీలన, తగిన చర్య కోసం, తీర్మానం యొక్క ప్రతిని, హక్కుల నోటీసు, సహాయక సామగ్రి మరియు సంబంధిత కార్యకలాపాలతో పాటు తెలంగాణ శాసన మండలి చైర్మన్‌కు పంపాలని అసెంబ్లీ నిర్ణయించింది.

### కఠిన చర్యలు తీసుకోవాలి: సభ్యులు

ఈ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, ఆ వ్యాఖ్యలు తనను అవమానించడమే కాకుండా, తన దివంగత తల్లిపై దాడి అని, ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కోదాడ ఎమ్మెల్యే నలమడ పద్మావతి మాట్లాడుతూ బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తన తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. ఒక మహిళా ఎమ్మెల్యేగా, పౌరురాలిగా ప్రతిపక్ష సభ్యులు ఉపయోగించిన భాష తనను ఆగ్రహానికి గురిచేసిందని ఆమె పేర్కొన్నారు. సభ లోపల ఉన్నా, బయట ఉన్నా, ప్రతి సభ్యుడి బాధ్యత స్పీకర్ గౌరవాన్ని కాపాడటమేనని చెప్పారు. మహిళా పోలీసుల పట్ల బీఆర్ఎస్ నాయకులు ఆమోదయోగ్యం కాని రీతిలో దురుసుగా ప్రవర్తించారన్నారు. స్పీకర్ పట్ల, మహిళల పట్ల అభ్యంతరకంగా వ్యవహరించిన వారిపై కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఐఎం ఎల్పీ నేత ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఈ రెండు అంశాలను ఖండిస్తూ, ఈ సమస్యకు ముగింపు పలకాలని కోరారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన, సీనియర్ నాయకుడిగా ఉన్న కే చంద్రశేఖర్ రావు కేవలం స్పీకర్‌కే కాకుండా యావత్ తెలంగాణకు క్షమాపణ చెప్పాలన్నారు. నిబంధనల ప్రకారం ఆ శాసనసభ్యుడిపై చర్య తీసుకోవాలని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసుల ప్రవర్తనను కూడా ఆయన ఖండించారు. చింతకుంట విజయరామారావు ప్రసంగిస్తూ మహళల పట్ల ఇష్టానుసారంగా బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరించారన్నారు. అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని సర్వసభ్య సమాజం తలవంచుకునేలా వ్యఖ్యానించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తల్లులను కూడా కించపరచేలా మాట్లాడారని దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దళితులకు వ్యతిరేక పార్టీ బీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారు. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా తాతా మధు నవీన్‌రెడ్డిలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బిఆర్ఎస్‌ది బూర్జువామనస్తత్వం కలిగిన పార్టీ అన్నారు. కేసీఆర్ ప్రేరేపిత మాటలని, అందువల్లే ఆ పార్టీ సభ్యులు స్పీకర్‌ను దూషించినా వాటిని ఖండించలదేన్నారు. కె సాంబశివరావు మాట్లాడుతూ ధర్మరాజు లాంటి గొప్ప వ్యక్తి స్పీకర్‌గా ఉన్నారని, ఆయనపై వాడిన భాష అభ్యంతరకరమన్నారు. మహిళల పట్ల గౌరవం లేకుండా భాషను ఉపయోగిస్తున్నారని, బూతుల సంస్కృతి తెచ్చారని విమర్శించారు. అమ్మలను, అక్కచెల్లెళ్లను తిట్టే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్ర సంస్కృతిని విధ్వంసం చేశారని తెలిపారు.



ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

# కెసిఆర్ ఫామ్‌హౌస్‌పైకి వెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలి

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** ప్రభుత్వం చేస్తున్న బాగోతం ప్రజలు రెండు రోజులుగా గమనిస్తు న్నారు. నామమాత్రంగా పెట్టాలని మాత్రమే అసెంబ్లీ పెడుతున్నారు. నిన్న శాసన సభకు రాకుండా మమ్మల్ని అడ్డుకున్నారు. ప్రజల ఆస్తులను దోచుకోవడానికి భూ భారతి తెచ్చారు. దానిపై చర్చ జరపడం ఇష్టం లేక, వారి దోపిడి బయటపెడతామని సభకు రాకుండా అడ్డుకుం టున్నారు. కేసీఆర్‌పై దాడికి ముఖ్యమంత్రి పోలీసు ఎస్కార్ట్ ఇచ్చి మరీ పంపిస్తున్నారు. దాడికి వెళ్లే వారిపై చర్యలు తీసుకోవాలి. పోలీసు అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి. లేదంటే మేము అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటాం.

### కెసిఆర్ చావు కోరుకునే నీచస్థాయి రేవంత్‌కు ఎందుకు?: వేముల ప్రశాంత్‌రెడ్డి



కెసిఆర్ చావు గురించి ముఖ్యమంత్రి చాలా సార్లు మాట్లాడారు. కేసీఆర్ ఎర్రవల్లి ఇంటిపై దాడి చేస్తామని సభ సాక్షి గా ఒక సభ్యుడు మాట్లాడారు. షాద్‌నగర్ శాసన సభ్యుడు కేసీఆర్ చావు కోరుకుంటున్నాం అని మీడియా ముందు కూడా మాట్లాడారు. కేసీఆర్ ఇంటి దగ్గర వెయ్యి దప్పులతో దాడి చేస్తాం, ఆయన చావు కోరుకుంటాం అని శంకర్ గారు అనడం, అది రేవంత్‌రెడ్డి అన్నట్లే. ముఖ్యమంత్రికి కేసీఆర్ చావు కోరుకునే నీచ స్థాయి ఎందుకు? శంకర్‌పై కేసు నమోదు చేయాలని డీజీపీని కోరుతున్నాం. రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ని రాజకీయంగా ఎదుర్కో. బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలి.

## మీడియా పాయింట్

### కేసులు పెట్టి మాట్లాడకుండా చేస్తున్నారు: కెపి వివేకానంద

అంశానికి సంబంధం లేని అంశాలు తెచ్చి సభను పక్కదోవకు పట్టేలా ముఖ్యమంత్రి ప్రయత్నం చేస్తు న్నారు. వెయ్యి రోజుల పాలన ఘోరంగా విఫలమైంది. అందుకే మా గొంతు నొక్కే ప్రయత్నాం చేస్తున్నారు. మమ్మల్ని అసెంబ్లీకి రాకుండా చేసే ప్రయత్నం చేస్తూ, కేసులు పెడుతున్నారు. తాతా మధు వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నా అని క్షమాపణలు చెప్పినా, తనపై కేసు నమోదు చేశారు. మహిళలను అవమానపరిచే విధంగా సీతక్క మాట్లాడారు. క్లారిఫికేషన్ ఇస్తామని అడిగితే మాకు మైక్ ఇవ్వడం లేదు. మమ్మల్ని సభ లోపలికి రానివ్వకుండా మాపైనే కేసులు పెట్టారు.

### ఎథిక్స్‌లేని కడియం నేతృత్వంలో ఎథిక్స్ కమిటీ : ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

అసెంబ్లీ సాక్షి గా సీఎం బడవే అంటూ బూతుల మాట్లా డారు. అసెంబ్లీ సాక్షి గా ముఖ్యమంత్రి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాసన సభ్యులను అవమానించినట్లే. మహిళా జర్నలిస్టులను బట్టలిప్పి కొడతా అని మాట్లాడుతున్నారు. మందుల సామ్యూల్ కత్తులతో కోలాటం ఆడుతాం అని మాట్లాడుతున్నారు. దానం నాగేందర్ మాట్లాడిన భాష ఏంటి? వీరిపై ఆక్షన్ ఉండదా? ఎతిక్స్ కమిటీని, ఎతిక్స్‌లేని, పార్టీ మారిన కడియం శ్రీహరి నేతృత్వంలో వేశారు! సబితా ఇంద్రారెడ్డిని జుట్టుపట్టి లాగారు, సునీతా లక్ష్మా రెడ్డి చీర లాగారు. అలా చేసిన వారిపై చర్యలు ఉండవా? తాతా మధు అరెస్టును ఖండిస్తున్నాం. ప్రభుత్వం సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మా రెడ్డికి క్షమాపణ చెప్పేవరకు ఒదిలిపెట్టము. తాత మధు స్పీకర్ ని అనలేదు. దాన్ని వక్రీకరిస్తున్నారు.

### పురుష ఎమ్మెల్యేలపై మహిళా పోలీసులతో దాడి : ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

ఇది సర్కార్ కాదు సర్కస్ అని పలు మార్లు రుజు వైంది, ముఖ్యమంత్రి వాడిన భాష మేము ఎక్కడ వాడలేదు, అసెంబ్లీకి రానివ్వకుండా మమ్మల్ని అడ్డుకున్నారు, మహిళా ఎమ్మెల్యేలకు మగ పోలీసులు, మగ ఎమ్మెల్యేలకు మహిళా పోలీసులను పెట్టి అడ్డుకున్నారు. మగ ఎమ్మెల్యేలకు మహిళా పోలీసులతో నెట్టి దాడి చేయించారు. మహిళా ఎమ్మెల్యేలను అసభ్యంగా ప్రవర్తించారు. మహిళా పోలీస్ అధికారి శిల్ప వల్లి తీరు బాధాకరం.

### సావిత్రి కంటే బిఆర్ఎస్ మహిళా నేతలు ఎక్కువ నటిస్తున్నారు : ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణరావు

తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు బిఆర్ఎస్ నేతలు. ఉద్యోగం చేస్తున్న పోలీసు అధికారి తల్లిని అవమానించి మాట్లాడారు. కేసీఆర్‌కు దళితుల పట్ల వివక్ష. రెండు సార్లు అధికారంలోకి వచ్చి దళితులకు కేబినెట్లో సముచిత స్థానం ఇవ్వలేదు. ముఖ్యమంత్రిపై గౌరవం లేకుండా బిఆర్ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాటాడుతున్నారు. కేసీఆర్ నిన్న జరిగిన సంఘటనపై అసెంబ్లీకి వచ్చి మీ ఎమ్మెల్యేల తరుపున క్షమాపణ చెప్పాలి. మహానటి సావిత్రి కన్నా ఎక్కువ నటిస్తున్నారు బి.ఆర్.ఎస్ మహిళా నేతలు. కేటీఆర్, హరీష్‌రావు ఉద్దేశపూర్వకంగా వారి ఎమ్మెల్యేలను సమర్థించే పనులు చేస్తున్నారు. మహిళా పోలీసుల ఎదుట చొక్కాలు ఇప్పి బిఆర్ఎస్ నేతలు నిన్న అసభ్యకరంగా ప్రవర్తించారు.

### సింపతీ కోసం గాయం లేకున్నా కట్లు కట్టించుకున్నారు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నిన్న జరిగిన సంఘటనపై ఇప్పటివరకు విచారణ వ్యక్తం చేయలేదు కేసీఆర్. కెసిఆర్ అసెంబ్లీకి రావాలి, స్పీకర్ గారికి క్షమాపణ చెప్పాలని మేము డిమాండ్ చేస్తున్నాం. నిన్న ఉద్యోగం చేస్తున్న పోలీసులను తోసి వేశారు. నిన్న కట్లు కట్టించుకున్న ఒక బిఆర్ఎస్ ఎమ్మెల్యేకు, ఈరోజు చూస్తే ఎలాంటి గాయం లేదు. సింపతీ పొందడానికి డ్రామాలు ఆడుతున్నారు. సభ్య సమాజం తల దించుకునే విధంగా నిన్న బి.ఆర్.ఎస్ నేతలు ప్రవర్తించారు. గత పదేళ్లలో అరాచకాలు, అక్రమాలు, అవినీతి చేసి, మళ్ళీ ఇప్పుడు అధికారం పోయి అల్లర్లకు తెరలేపుతున్నారు. దళిత సామాజిక వర్గాన్ని అవమానపరిచే విధంగా బి.ఆర్.ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు.

### నేను కొట్టినట్టు చేస్తా.. నువ్వు ఏడ్చినట్టు చేయి అన్నట్టు..: బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్



తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర భవిష్యత్తు మీద, ప్రజల ఇబ్బందుల మీద చర్చ జరగాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి.. గత పదేండ్లలో కేసీఆర్ అక్రమాలను కాంగ్రెస్ కాపాడుతోంది. నేను కొట్టినట్టు చేస్తా ..నువ్వు ఏడ్చినట్టు చేయి అన్నట్టు మిలాకత్ అయ్యాయి. మేము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ జరపడం లేదు. పేద ప్రజల భూములను 22ఏలో పెట్టడం దారుణం. 22 ఎ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం. 22ఎ ద్వారా భూదోపిడికి తెర లేపారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, డీఏ, పీఆర్సీల మీద చర్చ జరగాలి. రైతాంగం అనేక సమస్యల్ని ఎదురుకుంటున్నారు. ఇట్లాంటి సమస్యల మీద చర్చ జరగకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ టైం పాస్ చేస్తున్నాయి. సభను సజావుగా జరిపే బాధ్యత స్పీకర్‌పై ఉంది. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళల పక్షాన సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం.

## వారంటు ఉండగా విదేశాలకు ఎలా?

### ఐఎఎస్ అధికారులపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** కోర్టు ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో పాటు, విచారణకు సరిగా హాజరుకాని సీనియర్ ఐఎఎస్ అధికారుల తీరుపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కేసులో బెయిలబుల్ వారెంట్ అమల్లో ఉన్నప్పుడు అధికారులు విదేశీ పర్యటనలకు ఎలా వెళ్తారని, ఒకవేళ ఎయిర్ పోర్టులోనే వారిని అరెస్ట్ చేసి ఉంటే పరిస్థితి ఏంటని తీవ్ర స్థాయిలో ప్రశ్నించింది. భూసేకరణ ప్రక్రియలో కోర్టు నిర్ణయించిన పరిహారంలో 50 శాతం మొత్తాన్ని డిపాజిట్ చేయాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. ఆ ఉత్తర్వులను అమలు చేయడంలో తీవ్ర ఆలస్యం జరగడం, బాధితులకు పరిహారం అందకపోవడంతో బాధితులు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రోడ్లుభవనాల శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్‌కు హైకోర్టు బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. విచారణ సందర్భంలో అధికారులు హాజరు కాకపోవడంపై ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వివరణ ఇస్తూ, అసెంబ్లీ సమావేశాల రద్దీ కారణంగా అధికారులు కోర్టుకు రాలేకపోయారని తెలపగా, ఆర్థిక శాఖ అధికారి విదేశీ పర్యటనలో ఉన్నారని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఫారం1 నోటీసులు, బెయిలబుల్ వారెంట్లు అమల్లో ఉన్న సమయంలో అధికారులు విదేశాలకు వెళ్లడం ఏంటని ఆక్షేపించింది. విదేశాలకు వెళ్లే క్రమంలో విమానాశ్రయంలోనే వారిని అరెస్ట్ చేసి ఉంటే విభాగానికి, ప్రభుత్వానికి ఏం గౌరవం ఉండేదని ప్రశ్నించారు. బాధితులకు ఇటీవల పరిహారం మొత్తాన్ని పూర్తిగా చెల్లించామని కోర్టుకు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగవని, అధికారుల గైర్హాజరుకు క్షమాపణలు కోరుతూ అఫిడవిట్ దాఖలు చేయడంతో హైకోర్టు ఈ కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను ముగించింది.

## రాష్ట్రంలో 17 మంది డిఎస్‌పిల బదిలీ

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో 17 మంది డిప్యూటీ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి)లకు బదిలీలు, పోస్టింగులు కల్పిస్తూ డిజిపి సి.వి ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫారసుల మేరకు ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన అధికారులను సంబంధిత యూనిట్ అధికారులు వెంటనే రిలీవ్ చేసి, కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో విధుల్లో చేరేలా ఆదేశాలు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న డిఎస్‌పి కె. బాలకృష్ణారెడ్డిని మల్కాజిగిరి సైబర్ క్రైమ్స్ ఏసిపిగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్.జీ. శివశంకర్‌ను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఎస్‌కె. అబ్దుల్ రహ్మాన్‌ను జయశంకర్ భూపాలపల్లి డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా నియమించారు. ఏ. రవి కుమార్‌ను జగిత్యాల డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. బి. నందిరామ్ నాయక్‌ను డిజిపి కార్యాలయంలోని డిజి కంట్రోల్ రూమ్ డిఎస్‌పిగా, బి. సోమ్నారాయణ్ సింగ్‌కు టిజిపిఏ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. జె. వెంకటేశ్వర్‌రావును మెదక్ డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా, బి. కిషన్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎల్. రమేశ్ కుమార్‌ను హైదరాబాద్ సిటీ సిటిసి ఏసిపిగా నియమించారు. ఎన్. శ్రీనివాస్‌రెడ్డికి సంగారెడ్డి డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. కదరు వెంకట్‌రెడ్డిని టిజిపిఏ డిఎస్‌పిగా నియమించారు. కొమట్ల సుబ్బరామిరెడ్డికి హైదరాబాద్ సిటీ సిసిఎస్ అండ్ డిడి ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎస్. సుదర్శన్‌ని హైదరాబాద్ సిటీ సిసిఎస్ అండ్ డిడి ఏసిపిగా నియమించారు. ఎన్. శంకర్‌కుహైదరాబాద్ సిటీ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. పీ. విజయ్ కుమార్‌ను వెస్ట్ జోన్ రోడ్ సేఫ్టీ డిఎస్‌పిగా నియమించారు. కె. భాస్కర్‌కు టిజిపిఏ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎం. వెంకట నర్సయ్యను సిఐడి డిఎస్‌పిగా నియమించారు. కొత్తగా పోస్టింగ్ పొందిన అధికారులు తమ రిలీవ్ అనంతరం వెంటనే విధుల్లో చేరి, సంబంధిత ఉన్నతాధికారులకు ఛార్జ్ రిపోర్టులు సమర్పించాలని డిజిపి ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

### బిఆర్ఎస్ దాడిలో గాయపడిన

## మహిళా పోలీసులకు మంత్రి సీతక్క పరామర్శ

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** అసెంబ్లీ గేట్ వద్ద జరిగిన ఘటనలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దాడిలో గాయపడిన మహిళా పోలీసులను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీ ప్రాంగణంలో మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను మహిళా పోలీసు అధికారులు మంత్రి సీతక్కకు వివరించారు. విధి నిర్వహణలో ఉన్న తమ పట్ల కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసభ్యంగా ప్రవర్తించారని మహిళా పోలీసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమను అసభ్యకరంగా తాకారని, ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియో విజువల్స్‌ను మంత్రి సీతక్కకు చూపిస్తూ మహిళా పోలీసులు ఫిర్యాదు చేశారు. తాము కేవలం తమకు కేటాయించిన విధులను నిర్వహిస్తున్న సమయంలో కొందరు నేతలు టీ షర్టులు విసిరేసి తమ మీదికి దూసుకొచ్చారని, దీంతో విధి నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని వివరించారు. అంతేకాకుండా, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అంతు చూస్తామని కొందరు బెదిరింపులకు పాల్పడ్డారని మహిళా పోలీసులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. చొక్కాలు తొలగించి అసభ్యంగా తమ వైపునకు దూసుకొచ్చారని, వారి మితిమీరిన ప్రవర్తనతో తలదించుకోవాల్సి వచ్చిందని, తమ ప్రతిష్టకు భంగం వాటిల్లిందని మహిళా పోలీసులు మనస్థాపానికి గురయ్యారు.



వివరాల వెల్లడిస్తున్న పోలీసులు

## కొత్తూరులో రూ.1.42 కోట్ల విలువైన హాష్‌ఆయిల్ స్వాధీనం.. ఒకరి అరెస్ట్

**కొత్తూర్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** కొత్తూర్ పోలీసులు, ఎస్‌ఓటీ, షాద్‌నగర్ జోన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.1.42 కోట్ల విలువైన 11.319 కిలోల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం ఇన్ముల్‌నర్వలోని పి అండ్ జీ కంపెనీ రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని హెచ్. ధృవ్ అలియాస్ ధృవ్ జోషి (30)గా గుర్తించారు. అతను మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల్‌కు చెందినవాడని, ప్రస్తుతం ఒడిశాలో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా 11 ప్యాకెట్లలో హాష్ ఆయిల్ లభించింది. విచారణలో ఈ హాష్ ఆయిల్‌ను ఒడిశాకు చెందిన రోహిత్ అనే వ్యక్తి వద్ద నుంచి తీసుకుని కొత్తూర్ ప్రాంతంలో విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు 11.319 కిలోల హాష్ ఆయిల్‌తో పాటు ఒక రియల్‌మీ 12ఎక్స్ 5జీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌ను షాద్‌నగర్ జోన్ డీసీపీ సిరిష, షాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీ మనారాయణ పర్యవేక్షణలో, కొత్తూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా: హైకోర్టు

### బిఆర్ఎస్ సభ్యులు నిషేధాజ్ఞలు ఉల్లంఘించారు: హైకోర్టుకు తెలిపిన ఎజి

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** శాసనసభ బయట జరిగిన పరిణామాలపై హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దంటూ పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించించిన విషయం తెలిసిందే. మహిళా ఎమ్మెల్యేలు, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలంటూ డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి మంగళవారం వాదనలు వినిపించారు. సభను సజావుగా నడిపించే బాధ్యత స్పీకర్‌పై ఉంటుందని ఏజీ వాదించారు. ప్లకార్డులు, రాతలతో కూడిన నల్ల టీషర్టులతో శాసనసభలోకి ప్రవేశం లేదన్నారు. స్పీకర్ ఆదేశాలతో చీఫ్ మార్షల్ పోలీసులకు సూచనలు చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారన్నారు. అసెంబ్లీ పరిసరాల్లో ర్యాలీలు, నిరసనలపై నిషేధం విధిస్తూ హైదరాబాద్ సీపీ ఆదేశాలు కూడా అమల్లో ఉన్నాయని ఏజీ వాదించారు. నల్ల టీషర్టులతో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యేలను శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా పోలీసులు అడ్డుకున్నారని ఏజీ వాదనలు వినిపించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించారని న్యాయస్థానం దృష్టికి ఏజీ తీసుకొచ్చారు. ఇతర పోలీసు అధికారులను కూడా దూషించారని ఏజీ తెలిపారు. నల్ల టీషర్టులు ధరించి ప్రజల్లో భయానక వాతావరణం సృష్టించేలా ఎమ్మెల్యేలు ప్రవర్తించారని ఏజీ కోర్టుకు తెలిపారు. ఎమ్మెల్యేలతో దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్న కోర్టు ఉత్తర్వులను సవరించాలని ఏజీ కోరారు.

అయితే ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం, శాసనసభ నియమావళిని ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా అని ఏజీని ప్రశ్నించింది. పోలీసులు ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల పట్ల ఎందుకు అనుచితంగా ప్రవర్తించారని హైకోర్టు ప్రశ్నించింది. పోలీసులు ఎవరితోనూ అలా ప్రవర్తించలేదని, మహిళా ఎమ్మెల్యేలను లోపలికి వెళ్లకుండా అడ్డుకోలేదని ఏజీ వాదించారు. నియమావళిలోని విషయాలను శాసనసభ్యులకు ఘటన కంటే ముందే తెలియజేశారా అని హైకోర్టు ప్రశ్నించగా, సాధారణంగా అమల్లో ఉండే నిబంధనలేనని ఏజీ తెలిపారు, సభ్యులను అసెంబ్లీలోకి ప్రవేశించకుండా అడ్డుకునే అధికారం పోలీసులకు లేదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది వాదించారు. చీఫ్ మార్షల్‌కు స్పీకర్ ఆదేశాలున్నట్లు ఎలాంటి లేఖలు ప్రభుత్వం సమర్పించలేదన్నారు. ఎమ్మెల్యేలు ఏదైనా నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కానీ పోలీసులు కాదని బీఆర్ఎస్ న్యాయవాది వాదించారు. సోమవారం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ పేర్కొన్న అంశాలనే ప్రభుత్వం కౌంటర్‌గా దాఖలు చేసిందన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని, భావిస్తే సదరు ఎమ్మెల్యేలను స్పీకర్ దగ్గరికి తీసుకెళ్లకుండా, అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు ఎందుకు తీసుకెళ్లారని వాదించారు. సోమవారం నాటి కోర్టు ఉత్తర్వుల్లో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో కోర్టు తీర్పును రిజర్వు చేసింది.

## కూరగాయలు, పండ్లతోటలు, తృణధాన్యాల సాగు విస్తరణ

### అందుకోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి: సిఎస్ సంజయ్ జాజు



మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న సిఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూరగాయలు, పండ్లతోటలు, తృణధాన్యాలు, ప్రత్యామ్నాయ పంటల సాగును మరింత విస్తరించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. కూరగాయలు, పండ్లతోటలు, ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రోత్సాహంపై మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎస్ సంజయ్ జాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. అల్దాస్ జానయ్య, పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. ఎం. జ్ఞాన ప్రకాష్, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. దండా రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, రైతులకు అధిక ఆదాయం అందించే కూరగాయల సాగును మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కూరగాయలు, పండ్లతోటలు, తృణధాన్యాలు, ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి, సాగు విస్తీర్ణాన్ని పెంచేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం, ఆర్థిక వనరులు, మార్కెటింగ్ సదుపాయాలను అందించేందుకు నాబార్డ్‌తో పాటు అన్ని సంబంధిత సంస్థలు, ఏజెన్సీల సహాయ సహకారాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరుల సమర్థ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, కూరగాయలు, పండ్లతోటలు, ప్రత్యామ్నాయ పంటల్లో డ్రిప్ ఇరిగేషన్‌ను మరింత విస్తృతంగా ప్రోత్సహించాలని సీఎస్ సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు వ్యవసాయ, వెటర్నరీ విశ్వవిద్యాలయాలు సమన్వయంతో పనిచేసి రైతులకు మెరుగైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని ఆయన పేర్కొన్నారు.

## స్పీకర్‌ను పరామర్శించిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** శాసనసభ ఎదుట సోమవారం జరిగిన దురదృష్టకమైన పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి శాసనసభ స్పీకర్ ఛాంబర్‌లో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను పరామర్శించారు. శాసనసభ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజు అసెంబ్లీ ఆవరణలో సభాపతి పట్ల అసభ్యకరమైన పదజాలంతో దూషించడమే కాకుండా అధికారులపై దాడులకు పాల్పడిన సభ్యుల ప్రవర్తన అనుచితంగా, తెలంగాణ సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించిన సంఘటన నేపథ్యంలో ముఖ్యమంత్రి, స్పీకర్‌ను ఓదార్చారు. అసెంబ్లీ ఎదుట జరిగిన దురదృష్టకర పరిణామాలపై పత్రికలు, అన్ని మీడియాలు ప్రముఖంగా ప్రచురించడమే కాకుండా టీవీల్లో ప్రసారం చేశాయి. స్పీకర్‌ని వ్యక్తిగతంగా దూషించటంతో శాసనసభా వేదికగా వారు కంటతడి పెట్టుకున్న దృశ్యాలు చూసి ముఖ్యమంత్రి ఆవేదన చెందారు. మంగళవారం అసెంబ్లీకి రాగానే ముఖ్యమంత్రి నేరుగా స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లి ఆయనను పరామర్శించారు. స్పీకర్‌ను ఓదార్చి జరిగిన సంఘటనలపై విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని స్పీకర్‌కు తెలియజేశారు.

## క్రమశిక్షణతో కష్టపడి చదివితేనే విజయం

### మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్

### నూతన స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం

**హైదరాబాద్, సెప్టెంబరు 8,ప్రభాతవార్త:** విద్యార్థులు, యువతకు అందిస్తున్న విద్యా, కెరీర్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, అభిరుచి, కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణ, పట్టుదలతో విజయాన్ని సాధించాలని మైనారిటీస్ వెల్ఫేర్ అండ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం ఇందిరా ప్రియదర్శిని జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మైనారిటీ స్టడీ సర్కిల్ మరియు కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ను మంత్రి అజారుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైనారిటీ యువతకు విద్య, పోటీ పరీక్షల సన్నద్ధత, కెరీర్ మార్గదర్శకత్వం అందించేందుకు ఈ కేంద్రం ఒక ముఖ్యమైన ముందడుగు అని అన్నారు. కేంద్రం ఏర్పాటును పూర్తి చేయడంలో కృషి చేసిన మైనారిటీస్ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ తారిఖ్ అన్వర్‌ను మంత్రి అభినందించారు. ప్రభుత్వం అవసరమైన సదుపాయాలు, అవకాశాలను కల్పించిందని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకుని జీవితంలో ముందుకు సాగాలన్నారు. ఏదీ ఉచితంగా రాదు. మీ కోసం అన్ని సదుపాయాలు కల్పించాం. ఇప్పుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ముందుకు సాగాలి. మీ కష్టపడి పనిచేయడం ద్వారా దానికి తగిన మూల్యం చెల్లించాలి," అని మంత్రి అజారుద్దీన్ విద్యార్థులతో అన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంపై అభిరుచిని పెంచుకుని, లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. నిజాయితీతో కూడిన కృషికి అభిరుచి తోడైతే తప్పకుండా మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. తన క్రికెట్ కెరీర్‌ను గుర్తుచేసుకున్న మంత్రి అజారుద్దీన్, భారత జట్టుకు ఆడుతున్న సమయంలో తన కెప్టెన్ సునీల్ గవాస్కర్‌ను తరచూ ప్రశ్నలు అడిగి, ఆయన నుంచి నేర్చుకునేవాడినని తెలిపారు. అదే తనకు ఎంతో నేర్చుకోవడానికి, మెరుగుపడటానికి దోహదపడిందని చెప్పారు. తన నిజాం కాలేజ్ విద్యార్థి దశను గుర్తుచేసుకున్న అజారుద్దీన్, పరిమిత సదుపాయాలు ఉన్నప్పటికీ చెట్టు కింద కూర్చుని చదువుకునే తన ఇద్దరు స్నేహితులను చూశానని వారు కష్టపడి చదివి జీవితంలో విజయవంతమయ్యారని విద్యార్థులు అదేవిధంగా కష్టపడి చవదవాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఫహీమ్ ఖురేషీ, మైనారిటీస్ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ తారిఖ్ అన్వర్, అహ్మద్ నదీమ్, ఉబైదుల్లా కొత్వాల్, అజ్మతుల్లా హుస్సేని తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ జరుగుతున్న తీరును చూసి అసహ్యించుకుంటున్న జనం

### సభ తీరుపై, కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల వ్యవహారంపై కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ ఆగ్రహం

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** అసెంబ్లీలో జరుగుతున్న తీరును చూసి జనం అసహ్యించుకుంటున్నారని కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల బజారు భాషను చూసి జనం నవ్వుకుంటున్నారని, స్పీకర్‌ను బిఆర్ఎస్ నేతలు అసభ్య పదజాలంతో దూషించడాన్ని ప్రజాస్వామ్యవాదులెవరూ జీర్ణించుకోలేరన్నారు. తాతా మధుతో పాటు పోలీసులపై చేయి చేసుకున్న బిఆర్ఎస్ నేతలను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాల్సిందే అన్నారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని, ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు పెట్టి రెండ్రోజుల పాటు ఒకే అంశంపై చర్చ జరిపి విలువైన సభా సమయాన్ని వృధా చేయడం దుర్మార్గం అన్నారు. ప్రజా సమస్యలపై ఇకనైనా డైవర్షన్ డ్రామాలాపాలని, 22ఏతో జనం అల్లాడుతున్నారని అన్నారు. మంత్రులు, అధికార పార్టీ నేతల రూ.వేల కోట్ల భూ దందా చేస్తున్నారని, ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు రాక, సర్టిఫికెట్లు రాక లక్షల మంది విద్యార్థులు అరిగోస పడుతున్నారన్నారు. సాగు నీరందక దక్షిణ తెలంగాణ రైతాంగం ఆందోళనతో ఉందని, ఉద్యోగాలు లేక, ఐటి సంస్థలు, పరిశ్రమలు మూతపడి నిరుద్యోగులు అల్లాడుతున్నారని, డిఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులు రాక ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. అసెంబ్లీ చర్చ కోసం ఎదురు చూస్తున్నారు. 6 గ్యారెంటీగా అమలు కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారని, సొంత ఇల్లు లేక కిరాయి కట్టుకోలేక పేదలు అల్లాడుతున్నారని, దోమలతో, రోగాలతో, పారిశుధ్య నిర్వహణ లోపంతో జనం రోగాలతో ఆసుపత్రుల పాలవుతున్నరన్నారు. నిత్యావసర ధరలు అమాంతం పెరిగి జనం గోస పడుతుంటే ప్రజలు సమస్యలపై చర్చించి పరిష్కారం చూపాల్సిన శాసనసభను మీ రాజకీయాలకు వాడుకుంటారా? అంటూ మండిపడ్డారు. నువ్వు కొట్టినట్లు చేయ్... నేను ఏడ్చినట్లు చేస్తానంటూ....కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు కలిసి కాంప్రమైజ్ పాలిటిక్స్‌తో ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యబద్దంగా నిరసన చేస్తే పోలీసులతో అడ్డుకోవడం మూమ్మాటికీ తప్పేవిధి నిర్వహణలో ఉన్న పోలీసులపై బిఆర్ఎస్ నాయకులు దాడికి దిగడం, బూతులు తిట్టడం తప్పేఫీజు రీయంబర్స్ మెంట్‌పై ప్రజాస్వామ్యబద్దంగా నిరసన తెలిపిన బిజెపి కార్యకర్తలపై పోలీసులు రక్తం కారేలా కొట్టారన్నారు. బిజెపి కార్యకర్తలపైనా, ప్రజాస్వామ్యబద్దంగా నిరసనలు తెలిపే వారిపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే అన్నారు. బిఆర్ఎస్ నేతలకు దెబ్బలు తగలక పోయినా ఏదో జరిగినట్లు షో చేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధ నిరసనలను కూడా ప్రభుత్వం అంగీకరించలేక అసహనంతో కాంగ్రెస్ తప్పుల మీద తప్పులు చేస్తోందన్నారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ నల్లచొక్కా ధరించి పార్లమెంట్‌కు రాలేదా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి అక్కడో రూల్, ఇక్కడో రూల్ వుంటుందా? అన్నారు. సబితా ఇంద్రా రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వంటి సీనియర్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు అనుసరించిన తీరు హేయనీయం అన్నారు. వారిపై అమానుషంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందే అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉండే అర్హతను ఎప్పుడో కోల్పోయిందని, అసెంబ్లీకే రాని కెసిఆర్‌కు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఎందుకు? అన్నారు. ఎర్రవల్లి ఫాంహౌజ్‌పై దాడి, కెసిఆర్ పై హత్యాయత్నం పెద్ద జోక్ అన్నారు. కెసిఆర్ కలుగులో దాక్కున్నాడా అన్నారు. గతంలో నా తలను 6 ముక్కలు చేస్తానని కెసిఆర్ అన్నారు. పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురిచేసే సంస్కృతిని నాడు బిఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రోత్సహిస్తున్నాయని, ఎర్రవల్లిలోనైనా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి కెసిఆర్ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ దొందూ దొందే...రెండు పార్టీలు కలిసి ప్రజలను దోచుకుతింటున్నాయని అన్నారు ప్రజా సమస్యలు కనీసం చర్చకు రాకుండా అడ్డుకుంటున్నాయి కాంగ్రెస్, బిఆర్ఎస్ డ్రామాలు, దోపిడీ, అవినీతిని ప్రజలు గమనిస్తున్నారని, ఇకనైనా డ్రామాలు కట్టి పెట్టాలన్నారు.



### పాత ఫైళ్ల ధ్వంసానికి

## తెలంగాణ హ్యూమన్ రైట్స్ కమిషన్ నిర్ణయం

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫీసులో దశాబ్దాల నాటి పాత కేసుల రికార్డులను చెత్తబుట్టలో వేసేందుకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి ఏపీ కాలం నాటి 35,068 ఫైళ్లు, తెలంగాణ ఏర్పడిన తర్వాత తయారైన 16,730 రికార్డులతో కలిసి మొత్తం 51,798 డిస్పోజ్డ్ కేసుల రికార్డులను కలిపి మొత్తం 51,798 డిస్పోజ్డ్ కేసుల రికార్డులను ధ్వంసం చేయనున్నారు. 2005 ఆగస్టు 12 నుంచి 2021 మార్చి 20 మధ్య కాలానికి ఫైళ్లను డిస్పోజ్ చేస్తారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే ప్రకటన వెలువడిన 15 రోజుల్లోపు సంబంధిత అధికారులను సంప్రదించాలని టిజిహెచ్ఆర్‌సి కార్యాలయం పేర్కొంది.



విద్యార్థినుల చలో అసెంబ్లీ ప్రదర్శనలో ప్రసంగిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

## తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** కళాశాలల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులకు తక్షణమే ప్రభుత్వం ఫీజుల రీయింబర్స్ మెంట్ 8 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వందలాది మంది విద్యార్థినులు 'చలో అసెంబ్లీ ప్రదర్శన'ను భారీగా నిర్వహించారు. మార్గమధ్యంలో పోలీసులు అడ్డుకోవడంతో విద్యార్థినులు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్లు మోదీరాందేవ్, నిఖిల్‌పటేల్ ఈ భారీ ప్రదర్శన కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ప్రదర్శన బర్కత్‌పుర చౌరస్తానుంచి ప్రారంభమై రెడ్డి కాలేజీ, నారాయణగూడ వైఎంసిఎ మీదుగా విద్యార్థినులు అసెంబ్లీవైపు వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజుల రీయింబర్స్‌మెంట్ కోసం వందలాది మంది విద్యార్థినులు చేసిన ప్రదర్శనకు ప్రభుత్వం కళ్లు తెరిచి తక్షణమే 8వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే విద్యార్థుల్లో ఓపిక నశించిపోయిందని, ప్రభుత్వ మొండివైఖరి అవలంబిస్తే ఆపైన జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు.

## తెలంగాణ విద్యుత్ వెలుగులకు సింగరేణి భరోసా

### బొగ్గు కోసం వివిధ రాష్ట్రాల నుండి డిమాండ్

### రాష్ట్ర అవసరాలకే 90 శాతం సరఫరా

### సంస్థ సిఎండి జ్యోతిప్రకాష్

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతుండటంతో అందుకు తగినట్లుగా థర్మల్ విద్యుత్ కేంద్రాలు పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నాయి. అయితే ఇందుకు బొగ్గుకు డిమాండ్ పెరగడంతో ప్రధానంగా రాష్ట్రానికి సింగరేణి అండగా నిలుస్తోందని ఆ సంస్థ సిఎండి డాక్టర్ జ్యోతి ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో దేశంలోని పలు విద్యుత్ సంస్థలు సింగరేణి వైపు చూస్తూ బొగ్గు సరఫరా చేయాలంటూ కోరుతున్నాయన్నారు. సింగరేణి బొగ్గుకు ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ సంస్థ మాత్రం తెలంగాణ విద్యుత్ అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు భరోసా కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా స్థానిక విద్యుత్ కేంద్రాలకు సింగరేణి నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేస్తోందని చెప్పారు. కీలక సమయాల్లో విద్యుత్ రంగానికి అండగా నిలుస్తూ రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి చోదకశక్తిగా మారుతోందన్నారు. బొగ్గును దీర్ఘకాలిక ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలు విద్యుత్ సంస్థలకు కొన్ని దశాబ్దాలుగా బొగ్గు రవాణా చేస్తూ ఆయా రాష్ట్రాల ఇంధన అవసరాలను తీరుస్తోందని వివరించారు. విద్యుత్ రంగానికి సరఫరా చేస్తున్న ప్రతీ 10 టన్నుల బొగ్గులో దాదాపు 9 టన్నులు తెలంగాణలోని విద్యుత్ కేంద్రాలకే సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా గత నెలలో సింగరేణి 40,51,312 టన్నుల బొగ్గును దేశంలోని విద్యుత్ సంస్థలకు సరఫరా చేయగా, అందులో 36,25,937 టన్నులు రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలకు రవాణా చేయడం జరిగిందని పేర్కొన్నారు. సగటున ఒక రోజుకు 1,30,687 టన్నుల బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేస్తుండగా, రాష్ట్రంలోని కేంద్రాలకు సగటున రోజుకు 1,16,966 టన్నులు సరఫరా చేస్తూ రాష్ట్ర ఇంధన అవసరాలు తీరుస్తోందన్నారు. గత నెలలో కొత్తగూడెం థర్మల్ యూనిట్‌కు 6,99,661 టన్నుల బొగ్గు యాదాద్రి ప్లాంట్‌కు 7,99,017 టన్నులు, కాకతీయ ప్లాంట్ కు 1,02,959 టన్నులు, భద్రాద్రి ప్లాంట్‌కు 4,14,719 టన్నుల బొగ్గును ఇలా మొత్తం మీద రాష్ట్ర జెన్కోకు గత నెలలో 20,16,356 టన్నుల బొగ్గును సింగరేణి సంస్థ రవాణా చేసినట్లు వివరించారు.

కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం లిమిటెడ్
KUPPAM RURAL ELECTRIC CO.OPERATIVE SOCIETY LIMITED
e-Procurement Tender Notice
The KRECS Ltd., Kuppam, Chittoor Dist., A.P. intends to procure the electrical line materials such as DTRs, Cable Conductor and other ancillary materials through e-procuremt. The interested bidders may visit and submit their bids online through https:// tender.apeprocurement.gov.in/ from 11.09.2026, 00:00 hrs. For further details, contact on 9440808304 or write to us on adet@kuppamresco.org.
Sd/-
MANAGING DIRECTOR
Dial "1912" for all electricity related complaints
Pay electricity charges using QR code printed on electricity bills



మంగళవారం ఒయులో పట్టా సర్టిఫికెట్లను అందజేస్తున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

# ఉద్యోగాలు సృష్టించే స్థాయికి యువత ఎదగాలి

## గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**తార్నాక, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** యువత ఉద్యోగాలు కోరుకునేవారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని తెలంగాణ గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్ల పిలుపునిచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవం మంగళవారం ఒ.యూ ఠాగూర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 640 మంది పీహెచ్‌డీ పరిశోధకులకు పట్టాలు, 71 మంది ప్రతిభావంతులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ కృష్ణ ఎం.ఎల్లా హాజరయ్యారు. విద్యార్థులు ఆవిష్కర్తలు, పారిశ్రామి కవేత్తలుగా ఎదిగి దేశ ప్రగతికి దోహదపడాలని ఆయన సూచించారు. సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేయకుండా కృత్రిమ మేధ (ఏఐ)ను అభ్యసనం, పరిశోధన, సృజనాత్మకత, ఆవిష్కరణలకు వినియోగించుకోవాలని అన్నారు. యువతను మాదకద్రవ్యాల దుష్ప్రభావాల నుంచి కాపాడేందుకు సమాజం సమష్టిగా కృషి చేయాలని గవర్నర్ సూచించారు. దాదాపు 1,500 ఎకరాల్లో విస్తరించిన ఓయూ ప్రాంగణం తనను ఆకట్టుకుందని పేర్కొన్నారు. విద్యా ప్రగతికి కట్టుబడి ఉన్నాంవిశ్వవిద్యాలయ ప్రగతి, విజయాల నివేదికను సమర్పించిన వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, సంస్థాగత అభివృద్ధికి ఓయూ నిరంతరం కృషి చేస్తోందన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచంలో కొత్త సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులు, పరిశోధకులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఓయూ విజయాలు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితమని తెలిపారు. 71 బంగారు పతకాలు స్నాతకోత్సవంలో ప్రదానం చేశారు. ఆంగ్ల విభాగంలో ఎస్టీ విద్యార్థి సమర్పించిన ఉత్తమ పీహెచ్‌డీ పరిశోధనా గ్రంథానికి తెలంగాణ గవర్నర్ గోల్డ్ మెడల్ అందించారు. కళలు, వాణిజ్యం, విద్య, ఇంజినీరింగ్, న్యాయశాస్త్రం, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, సైన్స్, సోషల్ సైన్సెస్, టెక్నాలజీ తదితర విభాగాలకు చెందిన 640 మంది పీహెచ్‌డీ పరిశోధకులకు పట్టాలు అందజేశారు.

# మాన్‌హోల్ శుభ్రం చేస్తుండగా శిశువు మృతదేహం లభ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** మురుగు పేరుకుందని మ్యాన్‌హోల్ శుభ్రం చేస్తుండగా నవజాత ఆడశిశువు మృతదేహం బయటపడిన ఘటన కెపిహెచ్‌బికాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, జలమండలి సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కెపిహెచ్‌బికాలనీ జెఎన్టీయూ రోడ్డులో వంతెన పక్క సర్వీస్ రోడ్డుకి ఆనుకుని ఓరెసిడెన్సీ అపార్ట్‌మెంట్ ఉంది. దాని పక్కన ప్రైవేటు ఆసుపత్రి కలిసి ఉంటాయి. అయితే మురుగు సమస్య తలెత్తడంతో రెసిడెన్సీ నివాసితులు సోమవారం జలమండలికి ఫిర్యాదు చేశారు. మంగళవారం సిబ్బంది ఎయిర్టెక్ యంత్రంతో వెళ్లి తొలుత రెసిడెన్సీ మ్యాన్ హోల్‌ను శుభ్రం చేశారు. తర్వాత ఆసుపత్రికి చెందిన మ్యాన్‌హోల్ శుభ్రం చేస్తున్న క్రమంలో ఎయిర్టెక్ యంత్రం ఒత్తిడికి వ్యర్థాలు వెలువడ్డాయి. వ్యర్థాలను తొలగించే క్రమంలో శిశువు మృతదేహం కలిసిపోవడంతో జలమండలి సిబ్బంది తొలుత ఎలుక అనుకున్నారు. పూర్తిగా తొలగించి చూడగా నవజాత ఆడ శిశువు మృతదేహంగా గుర్తించారు. స్థానికులు 112కు ఫోన్ చేయడంతో పోలీసులు చేరుకుని క్లూస్ టీమ్‌కు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీమ్ శిశువు ముద్రలు సేకరించారు. మురుగు పైపుల్లో నుంచి శిశువు మ్యాన్ హోల్లోకి చేరిందా లేక మూత తీసి అందులో పడేశారా అనే కోణంలో కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మంగళవారం రవీంద్రభారతిలో జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న జి.సంజీవరెడ్డి తదితర నాయకులు

# మార్కెటింగ్‌శాఖలో దడవాయిల పాత్ర కీలకం

## ఐఎన్‌టియుసి జాతీయాధ్యక్షుడు, మాజీ ఎంపి డా. జి.సంజీవరెడ్డి

**రవీంద్రభారతి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉన్న వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో పనిచేస్తున్న దడవాయిల (తూకం) కార్మికుల పాత్ర అత్యంత కీలకమైందని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి, కనీస వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వంపై ఒత్తిడితెస్తానని ఐఎన్‌టియుసి జాతీయాధ్యక్షుడు, మాజీ ఎంపి డా. జి.సంజీవరెడ్డి భరోసానిచ్చారు. దడవాయిల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ దడవాయిల యూనియన్ ఐఎన్‌టియుసి రాష్ట్ర సదస్సు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి 15 వందలకుపైగా దడవాయిల కార్మికులు పాల్గొన్న ఈ సదస్సులో డా. జి.సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు ఛైర్మన్ బి.జనక్‌ప్రసాద్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు వై.నాగన్నగౌడ్, వి.భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్.వి.జలీల్, కార్యదర్శి నల్ల సంజీవరెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ యార్డుల ఛైర్మన్లు రంగరెడ్డి, సతీష్, ఆనందరావు పాటిల్, శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్ గౌరవ అతిథులుగా పాల్గొనగా యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.సురేందర్‌రెడ్డి, ఎస్.వి.రవికుమార్ తదితరులు ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కనీస వేతనాలు, పిఎఫ్ గ్రాట్యుటి, ఈఎస్ఐ ఆరోగ్యభీమా ఇతర సౌకర్యాలు పొందడానికి దడవాయిల కార్మికులు అర్హులని, వారి సమస్యలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఎం. రాజిరెడ్డి మాట్లాడుతూ రైతులకు న్యాయమైన తూకం అందించే దడవాయిల డిమాండ్లు న్యాయమైనవేనన్నారు. వారికి మెరుగైన పనిపరిస్థితులు, తగిన వేతనాలు, ఉద్యోగభద్రత, సంక్షేమపథకాల అమలుకై జి.సంజీవరెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించడానికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు. దడవాయిల కార్మికుల హక్కుల కోసం జరుగుతున్న పోరాటానికి ఐఎన్‌టియుసి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.




రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న నేతలు

# రైస్ మిల్లర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## తెలంగాణ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్

**ధర్నాచౌక్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పాడి గణపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఊట్కూరి వీరేశం, కోశాధికారి విశ్వనాథం వెంకటరమణలు మాట్లాడుతూ విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక దాడులు నిలిపివేయాలని, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఒప్పందాన్ని న్యాయబద్ధంగా రూపొందించాలని, ధాన్యానికి శాస్త్రీయంగా ఔట్‌టర్న్ రేసియో నిర్ణయించాలని డిమాండ్ చేశారు. క్వింటాల్‌కు మిల్లింగ్ చార్జిని 150 రూపాయలుగా నిర్ణయించాలని, 2014 నుంచి పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్, రవాణా, డ్రైయేజ్ కస్టోడియన్ చార్జీలు చెల్లించాలని కోరారు. మిల్లర్లపై విధించిన 25శాతం పెనాల్టీ, 12శాతం వడ్డీని మాఫీ చేయాలని, రైస్ మిల్లులకు 200 హెచ్‌పి వరకు విద్యుత్‌ను, ఎల్‌టి కేటగిరిలో అందిచాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 11 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లులను బంద్ చేస్తామని వారు హెచ్చరించారు. కార్మికుల ఉపాధి, రైతుల, రాష్ట్ర ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వందలాది మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# దళితులకు మధు బహిరంగ క్షమాపణ చెప్పాలి

## దళిత హక్కుల పరిరక్షణ సంఘం, మాల ప్రజాఫ్రంట్ డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అసభ్యపదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ తాతా మధు వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ అనేక మంది దళితులు మంగళవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అఖిల భారత షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం, మాల ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో అనేక మంది దళితులు పాల్గొని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజు ఉస్తాద్, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, ఉపాధ్యక్షుడు దాసరి విశాల్, ప్రజా ఫ్రంట్ చైర్మన్ డా.మంచాల లింగస్వామి, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ప్రసంగించారు. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్సీ తాతా మధు కుల దురంహాకారంతో అసభ్య పదజాలంతో దూషించడం సిగ్గుచేటని నిశితంగా విమర్శించారు. స్పీకర్‌ను అవమాన పరిచిన మధు వెంటనే నిండు సభలో బహిరంగ క్షమాపణ చెప్పాలని రాజుఉస్తాద్ డిమాండ్ చేశారు. ఈ అంబేద్కర్ విగ్రహం ఏదుట ముక్కు నెలకు రాసి యావత్ దళిత జాతికి క్షమాపణ చెప్పాలని, లేకపోతే మధు ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. జి.చెన్నయ్య మాట్లాడుతూ మధు స్పీకర్‌ను అవమానపరచడం యావత్ తెలంగాణ ప్రజలను, దళితులను అవమానించడమేనని తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి కడమంచి ముత్తయ్య, నేషనల్ అంబేద్కర్ సేన అధ్యక్షుడు మన్నే శ్రీధర్, మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు ఆవుల సుధీర్, వివిధ సంఘాల నాయకులు బేర బాలకీషన్, సుధమల్ల అంజలీ, శంకర్, జంగా శ్రీను, నాందేవ్, సర్వయ్య, తాలుకా రాజేష్, పచ్చ శ్రీనివాసులు, భుజంగరావు తదితులు పాల్గొన్నారు.



మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న రాజు ఉస్తాద్. చిత్రంలో జి.చెన్నయ్య తదితరులు

**మహిళా కాంగ్రెస్ నిరసన ప్రదర్శన**

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అసభ్య పదజాలంతో దూషించిన వారిని రాష్ట్ర శాసన మండలి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ అనేక మంది మహిళలు అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా స్పీకర్‌పై అసభ్యపదజాలంతో వీరు దూషించడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే వారిపైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వారిపైన చర్యలు తీసుకునేంతవరకు మహిళా కాంగ్రెస్ ఉద్యమిస్తుందన్నారు.

**తాతా మధు దిష్టిబొమ్మను దగ్ధం చేసిన ఎన్ఎస్‌యుఐ:** ఎన్ఎస్‌యుఐ విద్యార్థులు మధు దిష్టిబొమ్మను బషీర్‌బాగ్ లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ నాయకులు మాట్లాడుతూ స్పీకర్, ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుని, బిఆర్ఎస్ పార్టీని తక్షణమే సస్పెండ్ చేయాలని, తెలంగాణ జాతికి, దళిత జాతికి బిఆర్ఎస్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ నాయకులు తమ వైఖరిని మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలను మరింతగా ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# ఒకే యేడాది నాలుగు సార్లు బదలీలు

## ఎంపి ఐఎఎస్ ఆక్రోశం

**భోపాల్, సెప్టెంబరు 8:** మధ్యప్రదేశ్‌లో ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిణి తనకు జరుగుతున్న అన్యాయంపై బహిరంగంగా గళమెత్తారు. ఒకే సంవత్సరంలో నాలుగోసారి బదిలీకి గురవడం, కొత్త పోస్టింగ్‌లో బాధ్యతలు చేపట్టి 50 రోజులు కూడా పూర్తికాకముందే బదిలీ జాబితాలో తన పేరుండటంతో ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఉద్యోగుల బెదిరింపులకు తాను గురవుతున్నానని, వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోకపోగా తననే బదిలీలతో వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు ఐఏఎస్ అధికారుల వాట్సాప్ గ్రూప్‌లో తన ఆవేదనను పంచుకుంటూ వ్యవస్థ తీరును ప్రశ్నించారు. 2011 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి నేహా మార్వ్యను మధ్యప్రదేశ్ ప్రభుత్వం మరోసారి బదిలీ చేసింది. ఈనెల 5న జారీ చేసిన బదిలీల జాబితాలో ఆమె పేరు కూడా ఉంది. ఈ బదిలీకి ముందు ఆమె గిరిజన ప్రాంత అభివృద్ధి పథకం డైరెక్టర్, మధ్యప్రదేశ్ ఉపాధి, శిక్షణ మండలి మేనేజింగ్ డైరెక్టర్, మధ్యప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ, గిరిజన పరిశోధన, అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా పలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే, తాజా బదిలీల్లో ఆమె బాధ్యతలను కుదించి, కేవలం షెడ్యూల్డ్ తెగల ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్ ఎండీగా మాత్రమే పరిమితం చేశారు. ఈ పరిణామంపై నేహా మార్వ్య తీవ్రంగా స్పందించారు. నా నియంత్రణలో లేని కొందరు ఉద్యోగులు నాపై తిరగబడటం వల్లే ఈ బదిలీ జరిగింది. వారు నా టేబుల్‌పై చేతులు కొడుతూ, బదిలీ చేయిస్తామని నన్ను బెదిరించారని ఆమె వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు.

# గణేశుని తరలిస్తుండగా విద్యుత్‌షాక్: ఒకరి మృతి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** వినాయక విగ్రహం తరలిస్తుండగా కరెంట్ తీగ తగిలి విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.



భాను ప్రసాద్ అశోక్(ఫైల్)

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్వాల్‌కు చెందిన శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ గణేశ్ ఉత్సవ నిర్వాహకులు సోమవారం రాత్రి ఎఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ పవర్‌గ్రిడ్ సమీపంలోని వినాయక విగ్రహాల తయారీ కేంద్రానికి వచ్చారు. అశోక్ లేలాండ్ వాహనం (టిజి10టి-6203)లో నిర్వాహకులు శరత్‌యాదవ్ ఇక్కడి నుంచి అల్వాల్‌కు గణేశ్ విగ్రహం తరలించేందుకు డ్రైవర్ భానుప్రసాద్ అశోక్ (28)తో మాట్లాడుకున్నారు. వాహనంలో గణేశ్ విగ్రహాన్ని ఎక్కించుకొని రాత్రి 8:30 గంటలకు బయలుదేరిన కొద్దిసేపటికే రోడ్డుపై 11 కెవి హైటెన్షన్ విద్యుత్ తీగలు వేలాడుతుండటాన్ని గమనించి, ప్రమాదం పొంచి ఉందని నిర్వాహకుడు శరత్ యాదవ్‌కు భానుప్రసాద్ తెలిపాడు. అయినప్పటికీ నిర్వహకుడు తీవ్ర నిరక్ష్యంతో ఏం కాదు వాహనాన్ని ముందుకు తీసుకెళ్లమని చెప్పాడు. వాహనం ముందుకు వెళ్తున్న క్రమంలో గణేష్ విగ్రహం 11 కెవి వైర్లకు తగలడంతో వాహనం మొత్తం విద్యుత్ ప్రవహించింది. ప్రాణభయంతో కిందికి దిగడానికి ప్రయత్నించిన డ్రైవర్ భానుప్రసాద్ తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో వెంటనే నిర్వాహకులు సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. దాదాపు 60 శాతం కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున 01:30 గంటలకు మృతి చెందాడు. డ్రైవర్ చెప్పినా వినకుండా ఉత్సవ నిర్వహకుడు శరత్‌యాదవ్ నిర్లక్ష్యం చేసి ఈప్రమాదానికి కారణమయ్యాడని మృతుడి తమ్ముడు తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఘట్‌కేసర్ పోలీసులు తెలిపారు.

# తమిళనాడు అసెంబ్లీలో గందరగోళం.. డీఎంకె ఎమ్మెల్యేలపై స్పీకర్ ఆగ్రహం

## మార్షల్స్ సాయంతో బయటకు

**చెన్నై, సెప్టెంబరు 8:** తమిళనాడు అసెంబ్లీ మంగళవారం తీవ్ర గందరగోళంగా మారింది. ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ సోమవారం చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ డీఎంకే ఎమ్మెల్యేలు సభలో ఆందోళనకు దిగారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పత్రాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని విజయ్ చేసిన ఆరోపణలను సభా రికార్డుల నుంచి తొలగించాలని డీఎంకే డిమాండ్ చేసింది. ఆందోళన తీవ్రం కావడంతో స్పీకర్ ఆదేశాల మేరకు డీఎంకే ఎమ్మెల్యేలను మార్షల్స్ సభ నుంచి బయటకు పంపించారు. సభ ప్రారంభమైన వెంటనే డీఎంకే విప్ ఈవీ వేలు మాట్లాడుతూ ముందురోజు ముఖ్యమంత్రి విజయ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. న్యాయశాఖ మంత్రి ఆర్.నిర్మల్ కుమార్ ముఖ్యమంత్రి వ్యాఖ్యలను సమర్థించారు. సర్కారియా కమిషన్ నివేదికతో పాటు ఈడీ అధికారిక రికార్డులను ప్రస్తావిస్తూ, గత డీఎంకే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలను పునరుద్ఘాటించారు. దీనిపై డీఎంకే సభ్యులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగించాలన్న డీఎంకే డిమాండ్‌ను స్పీకర్ జేసీడీ ప్రభాకర్ తిరస్కరించారు. దీంతో డీఎంకే ఎమ్మెల్యేలు నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు. సభా నిబంధనల ప్రకారం ఆందోళన చేస్తున్న సభ్యులపై చర్యలు తీసుకోవాలని సభా నాయకుడు కేఏ సెంగొట్టయ్యన్ కోరారు. అనంతరం డీఎంకే ఎమ్మెల్యేలనసభ నుంచి బయటకు పంపాలని స్పీకర్ మార్షల్స్‌ను ఆదేశించారు.

# గని ప్రమాదంపై భగ్గుమన్న కార్మికులు

## యాజమాన్యాన్ని నిలదీసిన వైనం



**మందమర్రి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** మందమర్రి ఏరియాలోని కాసిపేట టూ ఇంక్లైన్ గని లో సోమవారం జరిగిన ప్రమాదంపై మంగళవారం రోజున కార్మికులందరూ మొదటి షిఫ్ట్‌లో ప్రమాదం జరిగిన తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ యాజమాన్యాన్ని నిలదీశారు. యాజమాన్యం కార్మికులపై ఆజమాయేసి చలయిస్తూ మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో హెచ్ఎంఎస్, ఏఐటియుసి, ఐ ఎన్ టి యు సి, టీబీజీకేఎస్ కార్మిక సంఘ నాయకులు పాల్గొనడం జరిగింది. యాజమాన్యం మొదటి షిఫ్ట్‌లో ఉదయం వేళ కార్మికులకు కనీసం తినడానికి సమయం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. వెల్ఫేర్ ఆఫీసర్ పై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఏదైనా సమస్యపై వెల్ఫేర్ ఆఫీసర్ ను సంప్రదిస్తే సరైన స్పందన ఇవ్వడం లేదని కార్మికులని చులకన భావంతో చూస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం చేసే దూకుడు ఆలోచనలతో కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని సోమవారం జరిగిన సంఘటన ఇందుకు నిదర్శనమని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. మ్యాన్ రైడింగ్ను 14 లెవెల్ నుండి 19 లెవెల్ వరకు పొడిగించాలని కార్మికులు కోరుతున్నారు. మ్యాన్ రైడింగ్ ప్రవేశం వద్ద గేటు పెట్టడంతో కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాక్షులు, గ్లౌజులు ఇవ్వడం లేదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక టెక్నీషియన్లు ఒక్కరోజు విధి నిర్వహణకు రాకున్నా వారికి సస్పెన్షన్ ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల లీవ్ పై యాజమాన్యం ఆజమైసి చలయిస్తుందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా యాజమాన్యం కార్మికుల పట్ల తీరు మార్చుకోవాలని కార్మిక సంఘ నాయకులు, కార్మికులు కోరుతున్నారు.

# ఆశావర్కర్లకు 18వేల వేతనం చెల్లించాలి

## తెలంగాణ ఆశావర్కర్ల యూనియన్ నేతల డిమాండ్, ఛలో అసెంబ్లీ చేపట్టిన ఆశా వర్కర్లు, అడ్డుకున్న పోలీసులు

**ధర్నాచౌక్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఆశావర్కర్లకు 18వేల వేతనం చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.విజయలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో దోమలగూడ నుంచి ఛలో అసెంబ్లీ చేపట్టిన ఆశా వర్కర్ యూనియన్ నేతలను పోలీసులు ఇందిరాపార్కు చౌరస్తా వద్ద అడ్డుకున్నారు. ఛలో అసెంబ్లీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవటంతో ఆశాలకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఆశా వర్కర్లు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియచేస్తూ ఉండగా పోలీసులు వారిని అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.




# వాణిజ్య పంటల వైపు రైతులు

## పామాయిల్ సాగుపై ఆసక్తి

## లక్ష్యాన్ని మించి దరఖాస్తులు

## 85 వేల ఎకరాల లక్ష్యానికి 1.10 లక్షలకు అప్లై

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** తక్కువ పెట్టుబడి, స్థిరమైన ఆదాయం అందించే పామాయిల్ సాగుపై తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి రెట్టింపు అయింది. రాష్ట్రంలో సాంప్రదాయ పంటలకు స్వస్తి పలుకుతూ రైతాంగం వాణిజ్య పంటల వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ఏడాది ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాన్ని మించి రైతులు ముందుకు రావడం వ్యవసాయ వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఉద్యాన, వ్యవసాయ శాఖలు ఆయిల్ ఫాంపై ప్రత్యేక దృష్టిసారించాయి. రైతులకు మొక్కలతో పాటు ప్రోత్సాహకాలు సైతం అందజేస్తుండటం, సాగుపై అవగాహన సైతం కల్పిస్తుండటంతో ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను 31 జిల్లాల్లో ఈ పంట ను సాగుచేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఆన్లైన్ నమోదులో అనూహ్య స్పందన లభించింది. ఏకంగా 1,10,000 ఎకరాల్లో సాగు చేస్తామంటూ రైతులు దరఖాస్తు చేసుకున్నారు. నమోదు చేసుకున్న భూముల్లో 88,000 ఎకరాలను అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి, సాగుకు యోగ్యమైనవిగా ధ్రువీకరించారు. అంతేకాదు 65,350 ఎకరాలకు పరిపాలన అనుమతులు కూడా ఇచ్చారు. నర్సరీ ట్యాగింగ్‌ను సైతం 51,852 ఎకరాలకు పూర్తి చేయగా, 26,702 ఎకరాల్లో మొక్కల నాటడం సైతం పూర్తి చేశారు. కాగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత పామాయిల్ సాగుకు అధికారులు భారీగా ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఫలితంగా సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాల పంపిణీతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత ఆయిల్ ఫాం సాకుకు ప్రోత్సాహాలను ప్రభుత్వం పెంచింది. దీంతో తెలంగాణలో ఇప్పటివరకు ఏకంగా 2.91 లక్షల ఎకరాల్లో కొత్తగా ఆయిల్ పామ్ సాగు ప్రారంభం కావడం ఒక రికార్డు. ఆయిల్ ఫాం సాగును 1992లో స్టార్ట్ చేయగా 2021 వరకు 40వేల ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు ముందుకు వచ్చారు. అయితే 2021 నుంచి ఈ నెల 3వ తేదీ వరకూ 2లక్షల ఎకరాలకు పైగా సాగైనట్లు అధికారులు తెలిపారు. ఎకరా సాగుకు 46,250 రాయితీని ప్రభుత్వం ఇస్తుంది. సాగులో అంతర్ పంటల సాగు, డ్రిప్ నకు ఆర్థికసహకారం అందజేస్తుంది.

కాగా పామాయిల్ సాగులో రాష్ట్రం లోనే కొత్తగూడెం జిల్లా ప్రథమస్థానంలో ఉంది. ఈ జిల్లాలో 92,525 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. అలాగే 49,993 ఎకరాలతో రెండో స్థానంలో ఖమ్మం మూడోస్థానంలో నల్లగొండ జిల్లాలో 16,336 ఎకరాల్లో. సిద్దిపేట జిల్లాలో 16316 ఎకరాల్లో పామాయిల్ సాగైంది సాగు చేశారు. రాష్ట్రంలో మొత్తం ఉమ్మడి రాష్ట్రంలో, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో కలిపి సాగవుతున్న 31 జిల్లాల్లో 3,17,747 ఎకరాల్లో ఆయిల్ ఫాం తోటలను రైతులు పెంచుతున్నారు. టన్నుకు 25వేలకు పైగా మద్దతు ధర వస్తుండటంతో రైతులు సాకుకు ఆసక్తి చూపుతున్నారు.

# భారత్ నుంచి పట్టుకొచ్చి బంగ్లాలో ఉరిశిక్ష అమలు

## ప్రధాని తారిక్ అన్వర్ సలహాదారు ప్రేలాపనలు

**ఢాకా, సెప్టెంబరు 8:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా విషయంలో మరోసారి ఆ దేశం కఠిన వ్యాఖ్యలు చేసింది. 2024 ఆగస్టులో హింసాత్మక విద్యార్థి ఉద్యమం తర్వాత ఆమె బంగ్లాదేశ్ నుంచి భారత్ పారిపోయి వచ్చి, ఇక్కడే నివసిస్తోంది. ఈ ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్ తిరిగి వస్తానని చెప్పింది. ఈ విద్యార్థి ఉద్యమంలో మానవత్వానికి వ్యతిరేకంగా ఆమె అధికారాన్ని ఉపయోగించిందని అక్కడి కోర్టులు హసీనాను దోషిగా తేల్చాయి. ఆమెకు మరణ శిక్షను ఖరారు చేశాయి.

ఈ నేపథ్యంలో భారత్ తమకు షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ డిమాండ్ చేస్తోంది. తాజాగా, బంగ్లా ప్రధాని తారిఖ్ రెహమాన్ సమాచార సలహా దారుడు జహీద్ ఉర్ రెహ్మాన్ మాట్లాడుతూ హసీనాను భారత్ నుంచి తీసుకువచ్చి, బంగ్లాదేశ్‌లో విధించిన మరణశిక్షను అమలు చేయా లని ప్రభుత్వం కోరుకుంటోందని అన్నారు. ఢాకాలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ హసీనా స్వచ్ఛందంగా బంగ్లాదేశ్ తిరిగి వచ్చే వరకు ఎదురు చూడకూడదని, చట్టపరమైన ప్రక్రియ ద్వారా ఆమెను భారత్ నుంచి తీసు కురావాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. హసీనాను అప్పగించాలనే డిమాండ్‌ను కేవలం భారత్‌పై ఒత్తిడి తెచ్చే వ్యూహంగా ఉపయోగించడం లేదని ఆయన స్పష్టం చేశారు.

# అతిగా తినడం వల్ల ..



జీవక్రియలు సక్రమంగా పనిచేయాలన్నా.. రోజువారీ జీవనశైలి హాయిగా గడిచి పోవాలన్నా శరీరానికి శక్తి అవసరం. అది ఆహారం ద్వారానే అందుతుంది. అయితే, విద్యార్థినులు, ఉద్యోగినులు.. జీవనశైలిలో మార్పుల ఫలితంగా వేళలతో సంబంధం లేకుండా ఆహారం తీసుకోవడం, అతిగా తినడం చేస్తున్నారు. ఫలితంగానే ఎన్నో ఆనారోగ్యాలు వారిని చుట్టు ముడుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించాలంటే.. ఈ అలవాట్లు చేసుకోవడం తప్పని సరంటున్నారు పోషకాహార నిపుణులు.

**అల్పాహారం మానొద్దు..** ఇలా ఎన్నో సార్లు అనుకుని ఉంటాం. కానీ, ఆలస్యంగా లేవడం, పనులు పూర్తవ్వకపోవడంతో దీన్ని పాటించం. కానీ, శరీరానికి శక్తినందించే కీలక పోషకాలు అల్పాహారం నుంచే అందుతాయి. ఉదయం దాన్ని దాటవేయడం వల్ల ఆ తర్వాత మధ్యాహ్నం తీసుకునే ఆహారం మితిమీరి తింటుంటారని చెబుతోంది ఓ అధ్యయనం. ఈ అలవాటు అనారోగ్యకరమైన చిరుతిళ్లకు అలవాటు పడేలా చేస్తుంది. దీంతో రక్తంలో చక్కెర పాళ్లు పెరిగిపోతాయి. ఉబకాయంతోనూ బాధపడాల్సి ఉంటుందని హెచ్చరిస్తోంది. నీటి నిల్వలు తగ్గకుండా. శరీరం డీహైడ్రేషన్‌కి గురైనప్పుడు.. నీటి వసరమో, ఆకలిలో చాలామంది గుర్తించలేక ముందు కడుపు నింపుకోవడానికి ప్రయత్నిస్తారు. మీరు అలా చేయకండి. ఈసారి అలాంటి భావన ఎదురైతే ఓ గ్లాసు మంచినీళ్లు తాగి చూడండి. ఇది ఒంట్లో నీటి నిల్వల్ని పెంచడంతో పాటు ఆకలినీ అదుపు చేస్తుంది. జీర్ణశక్తినీ మెరుగు పరుస్తుంది. చిన్న ప్లేట్లలో.. కొన్ని సార్లు కడుపు నిండినా కళ్లు నిండవు. దీంతో కనపించినవన్ని తినడానికి ప్రయత్నిస్తుంటాం. ఈ ఇబ్బందిని అధిగమించడానికి కొన్నిరోజులు చిన్న పళ్లెంలో పెట్టుకుని తిని చూడండి. ఎదుకంటే అది నిండుగా ఉండి.. మెదడు కూడా త్వరగా సంతృప్తి పడుతుందట. దీంతో అవసరమైన మేర మాత్రమే తినగలుగుతాం. ఆకలేస్తేనే తినండి... కొందరు ఖాళీగా ఉండి ఏమీ తోచడం లేదనో, ఒత్తిడిగా ఉన్నామనో తరచూ ఏదో ఒకటి నములుతూ ఉంటారు. అన్నం తిన్నాక కూడా చిరుతిళ్లు తింటుంటారు. ప్రొటీన్ ఆహారం తీసుకోవడం వల్ల ఈ ఇబ్బందిని అధిగమించొచ్చు. పూర్తిగా ఆకలేస్తేనే తినడం, జంక్‌ఫుడ్ మీదకు మనసు మళ్లినప్పుడు ఓ పండో ఎండు ఫలానో నోట్టో వేసుకోవడం వల్ల దృష్టి మరలుతుంది.

## చిట్కా

ప్రతిగింజ లను దంచి రెండు చెంచాల పొడిలో 2 గ్లాసుల చొప్పున పాలలో త్రాగితే బాలింతల కు పాలు వృద్ధి చెందును.

✦ క్యాబేజీ వండేటప్పుడు చిన్న అల్లం ముక్క వేస్తే చెడు వాసన రాదు.

చీమలు అధికంగా వున్నచోట గెమాక్సిన్ పౌడర్ చల్లండి చీమలు లేకుండా పోతాయి.

✦ అటుకులు రుచిగా వుండాలంటే కొబ్బరికోరు యాలక పొడి కొద్దిగా కలపండి.

✦ పాలలో పుదీనా ఆకులు వేస్తే విరగవు.

అన్నం ముద్ద కాకుండా వుండాలంటే బియ్యానికి నీరు చేర్చే ముందు నిమ్మకాయ రసం పిండండి.

# ఉపాధి ఊతం !

ఉన్న ఉద్యోగం ఊడిపోతే ఇంట్లో కూర్చొక ఏదో ఉపాధి మీద బతికేద్దామని దారులు వెదికే యువత ఓ వైపు, ఉన్న ఉద్యోగానికి తోడుగా మరికొన్ని ఉపాధి అవకాశాలను అన్వేషించే మరో కోణమూ నేటి యువతలో కనపడుతోంది. ఇవన్నీ యువత ఉద్యోగ విజయాలే. దేన్నీ తీసి పారేయలేం. ఏదో రికామీగా తిరిగే కన్నా ఇంట్లోనే ఉన్నా ఏదో ఒక ఉపాధితో పాలనుండి బయట పడేస్తోంది. అలాంటి ఇద్దరు యువతల విజయ గాథలను తెలుసుకుందాం..

## కోడి కూసింది



ఆమెజాన్‌లో ఉద్యోగం పోతేనేం అండగా ఆదరించే స్వయం ఉపాధి చేయూత నిస్తోందని నమ్ముకున్న టెకీ విజయ గాథ ఇది. ఏదో కొత్తదారి కనపడక పోతుందా! అని ఎదురు చూస్తున్న మాజీ టెక్కీ హర్షితకు కొన్ని కోడి పిల్లలు తారసపడ్డాయి. అప్పుడే ఆమెమదిలో 'పౌల్ట్రీ' ఆలోచన మొదలైంది. ఎందరో వ్యాపారవేత్తలు లాభార్జన కోసం పెద్దపెద్ద కోళ్లఫారాలు నిర్వహించడం మనకు తెలుసు. కానీ హర్షిత అలాకాదు. కేవలం ఆరే ఆరు కోడి పిల్లలతో ఓ కుటీర పరిశ్రమకు అంకుర్పాణ చేసారు. ఈ క్రమంలో, తన పిల్లల కోసం నాణ్యమైన, గుడ్లను అందించాలనే ఆలోచనతో వారు మొదట కొన్ని కోళ్లను పెంచడంలో ఆరితేరారు. ఆరు కోడిపిల్లలతో మొదలైన ఈ ప్రయాణం, క్రమంగా కోళ్ల సంఖ్య పెరగడంతో ఒక వ్యాపారం భారీ స్థాయికి చేరింది. తన ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ నైపుణ్యా లను ఇక్కడ కూడా ఉపయోగిస్తూ, డిమాండ్, సప్లైని ట్రాక్ చేయడానికి ఆమె 'పవర్ బీఐ' వంటి టూల్స్ వాడు తోంది. తన వ్యాపార అనుభవంపై ఆమె లింక్డ్‌ఇన్‌లో ఒక పోస్ట్ చేశారు. "తన కంటూ ఇప్పుడు ఒక స్వంత ఉత్పత్తి ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ లో తాను ఇప్పుడు నిరూపించుకుంటున్నారని చెప్పడం చూస్తే ఉపాధి ఎంతో. జీవితానికి ఎంత ఊతమిస్తుందో అర్థమౌతుంది.

## గోరింట పూసింది !



అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఓ భారతీయ యువతి ఖాళీ సమయాల్లో ఏంచేయాలో తోచక తనకెంతో ఇష్టమైన 'మెహందీ' కళతో ఎందరో 'హస్తాలం కరణ'కు గీతలు గీస్తోంది. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఓ భారతీయ యువతి ప్రియాంక జైన్ అమెరికాలో ఫుల్‌టైమ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఖాళీ సమయంలో ప్రొఫెషనల్ మెహందీ ఆర్టిస్ట్‌గా సేవలు అందిస్తోంది. తన మెహందీ పనికి గంటకు సుమారు 100 డాలర్లు (రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు) వసూలు చేస్తున్నట్లు ఆమె వెల్లడించింది. దీనికి అదనంగా కొందరు కస్టమర్లు 20 శాతం వరకు టిప్ కూడా ఇస్తున్నారంటోంది. పెళ్లి వేడుకల్లో 'మెహందీ' బుకింగ్ మరికొంత ఆదా యం కూడా ఆమె సొంతం అని చెప్పింది. దాదాపు గంటల పాటు జరిగే ఓ వెడ్డింగ్ అసైన్‌మెంట్‌తో ఒకే రోజులో 1,200 డాలర్లకు పైగా.. అంటే దాదాపు రూ.లక్ష అన్నమాట. భారత్‌లో మెహందీ ఆర్టిస్ట్‌గా పనిచేయడానికి కొందరు చిన్నచూపు చూస్తారని.. అమెరికాలో మాత్రం కళా కారుల కున్న గౌరవం చాలా ఎక్కువేనని చెబు తోంది. సంప్రదాయ పైపుణ్యా లకు భారత్ పెట్టింది పేరన్న విషయం ఇతరదేశాకు ఇప్పుడిప్పుడూ బాగాచెప్పుకో గలుగు తున్నాయి.

## గాలికి శుద్ధి 'స్నేక్ ప్లాంట్'



సీజన్ మారేటప్పటికల్లా అనారోగ్యాలు చుట్టుముడుతున్నాయి. ఎక్కువ సమయం ఇంటికే పరిమితం కావడం వల్ల వ్యాధినిరోధక శక్తీ తగ్గుతోంది. అలాకాకుండా ఇంట్లోని వాతావరణమూ ఆరోగ్యకరంగా మారాలంటే.. గది లోపల ఈ మొక్కల్ని పెంచమని సూచిస్తున్నారు నిపుణులు. స్వచ్ఛమైన గాలి కోసం ఎక్కడెక్కడికో వెళ్లక్కర్లేదు. మనం ఉన్న చోటే పచ్చని మొక్కను పెంచితే అదే మనకు ప్రాణ వాయువును ఇస్తుంది. అలా గాలిని శుభ్రం చేయడంలో స్పైడర్ ప్లాంట్ ముందుంటుంది. దీన్ని హాలులో ఓ మూలన పెడితే అందంగా కనిపించడమే కాదు.. తగినంత ఆక్సిజన్‌నీ ఇస్తుంది.

✦ రబ్బర్ ప్లాంట్ కూడా తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఆహ్లాదపరుస్తుంది. గాల్లోని టాక్సిన్లనూ శుద్ధి చేస్తుంది. ✦ ఇంటి అలంకరణ ఆకర్షణీయంగా కనిపించేలా చేయడంలనట వెదురుకి మించింది లేదు. మీకున్న స్థలాన్ని బట్టి చిన్న కుండీ నుంచి పెద్ద తొట్టె వరకూ ఎందులోనైనా వెదురుని పెంచేయొచ్చు. దీన్ని ముందుగదిలో ఉంచితే చూడ్డానికీ బాగుంటుంది. ✦ పీస్‌లిల్లీ గాలిని శుభ్రం చేయడమే కాదు..రాత్రిపూట ఆక్సిజన్‌నూ ఎక్కువగా విడుదల చేస్తుందట. అందుకే, దీన్ని హాల్లోనో, పడకగదికి దగ్గరగానో పెడితే సరి.హాయిగా నిద్రపడుతుంది.

**స్నేక్ ప్లాంట్..** సన్నగా, పొడవాటి చారల ఆకులతో కనిపిస్తుంది. ఇది గాల్లోని సూక్ష్మజీవులను నాశనం చేస్తుంది., ఇంటిలోపల వాతావరణాన్ని స్వచ్ఛంగా ఉంచుతుంది. పైగా నీళ్ల పోయాల్సిన అవసరమూ ఎక్కువగా ఉండదు. ఇంకేం ఎంచక్కా పెంచుకోవచ్చు.

## అమ్మ తోడు !

చంటి గాడు నిద్రపోవాలంటే పక్కన అమ్మ ఉండాలి. లేదంటే గోల చేస్తాడు. ఇక బుజ్జి అయితే అమ్మతోనే బజ్జుంటా అంటూ నానా అల్లరి చేస్తుంది. ఇలా తల్లితో కలిసి నిద్రపోయే చిన్నారుల్లో మానసికాభివృద్ధి ఎలా జరుగుతుందనే దానిపై ఇటీవల ఓ సర్వే జరిగింది. లండన్ మిలీనియం కోహోర్ట్ ఆధ్వర్యంలో 9 నెలల నుంచి 11 ఏళ్ల వయసు ఉన్న దాదాపు 17వేల మంది పిల్లలపై అధ్యయనం చేపట్టారు. తల్లి మానసిక స్థితి, తల్లిదండ్రుల ఆర్థికస్థితి, నమ్మ కాలు, తల్లిపాలు, శిశువు రాత్రిపూట మేల్కొనే ఫ్రీక్వెన్సీ వంటి విషయాలనినటిని అనుసంధా నించి మరీ పరిశీలించారట. దగ్గర పడుకోబెట్టడం వల్ల అధిక ప్రయోజనాలతోపాటు ఏడెనిమిదేళ్ల దాటినా కొన సాగిస్తే కొన్ని నష్టాలూ ఉన్నట్లు తేలిందట.

**ప్రయోజనాలెన్నో...** పసిపిల్లలైతే మెలకువ వచ్చినప్పుడు, ఆకలి వేసినప్పుడు తల్లిపాలు వెంటనే ఇవ్వొచ్చు. ఇలా రెండుమూడేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించే అవకాశం ఉంటుంది. వీరిలో వ్యాధినిరోధక శక్తీ మెరుగ్గా ఉంటుంది. అలాగే తల్లీబిడ్డ మధ్య భద్రతాభావంతోపాటు వారి మధ్య అనుబంధం కూడా పెరుగుతుంది. సాన్నిహిత్యంతోపాటు అమ్మ తోడుందనే భరోసా పిల్లల్లో కనిపిస్తుంది. ఇంకా ఇలా నిద్రపోవడం



వల్ల భరోసా కలిగించే ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదలనుర ఇది ప్రోత్సహిస్తుంది. దీంతో తల్లిదండ్రులు, పిల్లల మధ్య బంధం బలోపేతం చేయడమే కాకుండా భావోద్వేగ నియంత్రణ వంటి నైపుణ్యాలనూ పెంచుతోందట. అలాగే పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సామాజికపరమైన నైపుణ్యాలు వంటివీ అభివృద్ధి చెందుతాయట. ఇక నష్టాలకొస్తే ఏడెనిమిదేళ్లకూ సహనిద్ర అలవాటు దూరం చేయకపోతే, పెద్దయ్యాక స్వతంత్రంగా నిద్రపోవడాన్ని పిల్లలు సవాల్‌గా ఫీల్ అవుతారు. అలాకాకుండా ఉండాలంటే ఆరేడేళ్లవచ్చేసరికి విడిగా నిద్రపుచ్చడం మంచిది.

# అనుభూతుల మందిరం !

హంపి'లో రామాయణకాలం నాటి ఆనవాళ్లు కనిపిస్తాయి. కృష్ణదేవరాయల కాలం నాటి వైభవం కళ్ల ముందు కదలాడుతుంది. రామాయణ కాలంలో పంపానదిగా పిలవబడినదే ఇప్పుడు తుంగభద్రగా పిలవబడుతోందని చరిత్ర చెబుతోంది. రామాయణ కాలంలో సుగ్రీవుడి పాలనలో ఈ ప్రాంతం ఉండేదని చెబుతారు. అళియ రామారాయల మరణానం తరం తళ్లికోట యుద్ధం సమయంలోనే ఇక్కడి ఆలయాలు ధ్వంసం చేయబడ్డాయి. శిధిలాలయాలే అయినప్పటికీ, ఆనాటి ఘన చరిత్రను అవి ఆవిష్కరిస్తూనే వున్నాయి. అనేక ఆలయాల సమాహారంగా కనిపించే ఈ క్షేత్రంలో .. 'విరూపాక్ష స్వామి ఆలయం' .. 'కోదండ రామాలయం' .. 'కృష్ణాలయం' .. 'విఠలాలయం' .. 'రఘునాథ ఆలయం' .. 'రంగనాథ ఆలయం' .. 'అనంత శయన ఆలయం' .. 'అచ్యుతరాయ ఆలయం' .. 'అంతర్భూ ఆలయం' .. 'విష్ణుమూర్తి ఆలయం' .. 'ఆవగింజ గణపతి ఆలయం' .. 'శనగగింజ గణపతి ఆలయం' 'వరాహస్వామి ఆలయం' .. 'చంద్రశేఖర స్వామి ఆలయం' .. 'ఏకశిల రథం' .. 'దసరా దిబ్బ' .. 'సభా మంటపం' .. 'జల లింగం' .. అక్కడి శిల్పకళ ఆనందాశ్చర్యాలను కలిగిస్తాయి. 'హంపి'లో అడుగుపెడితే చాలు, అడుగడుగునా అనేక విశేషాలు మనసును అనుభూతుల మందిరం చేస్తాయి.

# తెర

## 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' కుటుంబ ప్రేక్షకుల మూవీ: వైష్ణవి చైతన్య



'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' కుటుంబ ప్రేక్షకుల మూవీ: కథానాయిక వైష్ణవి చైతన్య

**షార్ట్ ఫిలిమ్స్ నుంచి వచ్చిన మీరు, ఒక తెలుగమ్మాయిగా స్టార్‌డమ్ చూడటం ఎలా ఉంది?**

చాలా సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రుల సపోర్ట్ తో పాటు సినీ పరిశ్రమ, ప్రేక్షకుల మద్దతుతోనే ఇక్కడివరకు వచ్చాను. పలువురు తెలుగమ్మాయిలు సినీ పరిశ్రమలో వారి వారి ప్రత్యేకతను చాటుతున్నారు.

**ఎపిక్ సినిమాలో ఆనంద్, మీరు పోషించిన పాత్రలు ఎలా ఉండబోతున్నాయి?**

ఆనంద్ పోషించిన ఆదిత్య పాత్ర సాఫ్ట్ గా, కామ్ గా ఉంటుంది. జీవితంలో ఎదురైన అనుభవాల నుంచి ఆదిత్య ఏం నేర్చుకున్నాడనేది ఆసక్తికరంగా ఉంటుంది.

**'తన కోసం తాను నిలబడే అమ్మాయి' అంటున్నారు. కడలి పాత్ర మీ నిజ జీవితానికి దగ్గరగా ఉంటుందా?** ప్రతి ఒక్కరిలోనూ కడలి పాత్ర ఉంటుంది. కానీ, కుటుంబం వల్లనో, సమాజం వల్లనో మనలోని ఆ వెర్షన్ లోపలే ఉండిపోతుంది. బయటకు రాదు.

**బేబీ తర్వాత కథల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?**

కథలోనూ, నా పాత్రలోనూ కొత్తదనం ఉండాలి. ఆ పాత్రలో నన్ను నేను చూసుకోగలగాలి. ఎపిక్ ఎంచుకోవడానికి కారణమదే.

**దర్శకుడు ఆదిత్య హాసన్ గురించి?**

దర్శకుడు ఆదిత్యతో కలిసి పని చేయడం చాలా సరదాగా ఉంటుంది. ఆయన జీవితాన్ని చాలా లోతుగా గమనిస్తుంటారు. జీవితంలో ఉన్న ప్రతి చిన్న విషయాన్ని గమనిస్తూ, అందులో ఉన్న ప్రాముఖ్యత గురించి మాట్లాడుతుంటారు.

**బేబీ తర్వాత మీరు,8 ఆనంద్ కలిసి నటించిన సినిమా కాదా.. ఏమైనా ఒత్తిడి ఉందా?**

బేబీ, ఎపిక్ సినిమాలు దేనికవే ప్రత్యేకమైనవి. ఒత్తిడి లేదు కానీ, ఛాలెంజింగ్‌గా తీసుకొని ఎపిక్ సినిమా చేశాము.

**నిర్మాత నాగవంశీ గురించి?**

సితార బ్యానర్ లో సినిమా చేయడం సంతోషంగా ఉంది. నాగవంశీ గారు అందరికీ ఫ్రీడమ్ ఇస్తారు. ఖర్చు విషయంలో రాజీపడరు.

**'అల వైకుంఠపురములో' సినిమాలో చెల్లి పాత్ర చేసిన మీరు, ఇప్పుడు అదే బ్యానర్‌లో హీరోయిన్‌గా నటించడం ఎలా ఉంది?**

ప్రతి ఒక్కరూ జీవితంలో పెద్ద పెద్ద గోల్స్ పెట్టుకోవచ్చు అనే ఆశను నాకు కలిగించింది. పెద్ద గోల్స్ పెట్టుకొని, వాటిని రీచ్ అవ్వొచ్చనే నమ్మకాన్ని కలిగించింది.

**ఎపిక్ సినిమాలో ఉన్న ప్రత్యేకత ఏంటి?** మనం ఎన్నో లవ్ స్టోరీలు చూసుంటాం. కానీ, ప్రతి లవ్ స్టోరీలోనూ ఏదోక ప్రత్యేకత ఉంటుంది. ఎపిక్ లో కూడా ఆ ప్రత్యేకత ఉంది. భిన్న దారులు, భిన్న మనస్తత్వాలు ఉన్న ఇద్దరు యూకేకి చదువుకోవడానికి వెళ్లి, అక్కడ కలుస్తారు.

## 'సర్దార్2'ప్రి రిలీజ్



'సర్దార్' ప్రేక్షకులందరికీ నచ్చిన సినిమా.'సర్దార్' పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను: డైరెక్టర్ బోయపాటి శ్రీను

'సర్దార్' నా ఫేవరెట్ ఫిల్మ్. 'సర్దార్ 2 ఫస్ట్ డే ఫస్ట్ షో చూస్తాను: హీరో అడివి శేష్

హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్‌బస్టర్ హిట్ అయిన'సర్దార్ మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'సర్దార్ 2'తో థియేటర్లలోకి వస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 10న వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ కానుంది. ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో కార్తి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ వేడుకలో మీ అందరినీ చూడడం చాలా సంతోషంగా ఉంది. ఈ వేడుకకు అతిథులుగా వచ్చిన రవి గారికి, బోయపాటి గారికి, కళ్యాణ్ గారికి, అనిల్ గారికి, ప్రసాద్ గారికి, శేష్ కి అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. 'సర్దార్' సినిమాకు ఇక్కడ చాలా పెద్ద ఫ్యాన్ బేస్ ఉంది.'సర్దార్ 2 నా కెరీర్‌లో చాలా ఇంపార్టెంట్ ఫిల్మ్. ఇలాంటి స్పై క్యారెక్టర్ దొరకడం నా అదృష్టం. హీరోడివి శేష్ మాట్లా డుతూ.. ఈ వేడుకకు రావడం చాలా ఆనం దంగా ఉంది. నా ఫేవరెట్ సినిమాల్లో కార్తీ వే ఎక్కువ. ఆవారా, ఖైదీ, సత్యం సుం దర్ం ఈ సినిమాలన్నీ ఇష్టం.

ఎస్.జె. సూర్య మాట్లాడుతూ.. సర్దార్ ఆల్రెడీ చాలా పెద్ద హిట్ అయిన సినిమా. ఆ సినిమాకు అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చిన అందరికీ ధన్యవాదాలు. 'సర్దార్ 2'డబుల్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది. వివిఎస్ రవి ఈ చిత్రానికి క్లాప్ చేయగా హనుమాన్ చిత్ర నిర్మాత చైతన్య రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మొదటి షాట్ చిత్ర దర్శకుడు మణికంఠ దర్శకత్వం చేయగా స్క్రిప్టును క్రేజీ కల్యాణం చిత్ర నిర్మాత బి జగన్ మోహన్ రెడ్డి గారు, బివిఎస్ రవి అందజేశారు. ఈ ఈవెంట్ కు హాజరైన సంబరాల ఏటిగట్టు చిత్ర దర్శకుడు రోహిత్ కెపి, దర్శకుడు సముద్ర, నిర్మాతలు లగడపాటి శ్రీనివాసరావు, శ్రీకాంత్ ఈ చిత్ర యూనిట్ కు తమ బెస్ట్ విషెస్ తెలిపారు.

## 'మహేంద్రగిరి వారాహి'. ప్రేక్షకులకు నచ్చుతుంది:

హీరో సుమంత్



**ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిన్న మనవడు, పెద్ద మనవడు స్పీచ్ వైరల్ అయింది కదా?**

అఖిల్ గురించి సరదాగా అన్నాను. తనని అయ్యగారు అని పిలుస్తుంటా రట. అందరి మనవళ్లలో నేనే పెద్ద వాడిని. పెద్దవాడిని, అయ్యగారు అంటే బాగుంటుంది కదా అనే ఉద్దేశంలో సరదాగా అన్నాను.

**ఈ కథ చెప్తున్నప్పుడు మీకు ఎక్కడ బాగా కనెక్ట్ అయింది?** కథ మొత్తం నాకు నచ్చింది. ఇంటర్వెల్ లో, ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ ఎపిసోడ్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. ఆడియన్స్‌కి మంచి హై ఇస్తాయి. సంతోష్ ఈ కథని సింగిల్ సిట్టింగ్‌లో చెప్పారు. నాకు చాలా నచ్చింది. డైరెక్టర్ సంతోష్‌కి వేదాలు, పురాణాల పట్ల చాలా మంచి అవగాహన ఉంది. తనకి ఇది చాలా రైట్ సబ్జెక్టు. తను అనుకున్న కథని అంతే అద్భుతంగా తీశాడు.

**ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?** నేను యూట్యూబ్ లో మూఢ నమ్మకాలను ఎక్స్‌పోజ్ చేసే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. ఆ క్యారెక్టర్ గురించి ఇప్పుడే అంతకంటే ఎక్కువ చెప్పకూడదు. ఇది డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్. **సిద్ధు క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?** సిద్ధు ఒక సీరియస్ క్యారెక్టర్ చేశాడు. మా ఇద్దరి మధ్య ఒక సీన్ ఉంటుంది. అది సినిమాకే హైలెట్‌గా ఉంటుంది. చూసిన వాళ్లందరూ కూడాఅది చాలా అద్భుతంగా వచ్చింది అని చెప్పారు.

**మైథాలజీ ట్రెండ్ నడుస్తుంది కదా? ఆ ట్రెండ్‌లో ఈ సినిమా చేశారా?**

లేదండి. కార్తికేయ, కాంతార నుంచి ఆ మైథాలజీ ట్రెండ్ మొదలైంది. అంతకు ముందు కూడా ఉంది. కాకపోతే ఈ చిత్రాలతో మళ్లీ వరుసగా అలాంటి సినిమాలు రావడం ప్రారంభమైంది. **మీరు మీ పాత్రల ఎంపిక చాలా వైవిధ్యంగా, డిఫరెంట్‌గా ఉంటుంది కదా? మీకు ఏ పాత్రలో చేయడం ఎక్కువ ఇష్టం?** నేను అన్ని పాత్రల్లోనే ఇష్టపడే చేస్తాను. అన్ని రకాల పాత్రలు, కథలు చేయడానికి ఇష్టపడతాను.

**విలన్ పాత్రలు కూడా చేస్తారని చెప్పారు?** నేను ఎప్పటినుంచో విలన్ పాత్రలకు సిద్ధంగా ఉన్నాను. హీరో పాత్రలు చేయడంతో పాటు మంచి విలన్ క్యారెక్టర్లు, అలాగే బలమైన సపోర్టింగ్ క్యారెక్టర్ చేయడానికి కూడా నేను సిద్ధంగా ఉన్నాను.

## LUB చిత్ర పూజ కార్యక్రమం



సినీ ప్రముఖుల చేతుల మీదగా పూజ కార్యక్రమాలతో LUB చిత్ర ప్రారంభం.. జెజె ఆర్ట్ మూవీస్, పవనసుత ప్రొడక్షన్స్, గాయత్రి సినిమాస్ బ్యానర్స్ సంయుక్తంగా మహేష్ కుమార్ సంక, భగవాన్ నిర్మాతలుగా మణికంఠ పెదమల్లు తొలి దర్శకునిగా పరిచయం అవుతూ ప్రారంభమైన చిత్రం LUB. ఈ చిత్రం ద్వారా పవన్ కేసరి, ప్రాముఖ్య హీరో హీరోయిన్‌గా పరిచయం అవుతుండగా అభితేజ్, జెడివి ప్రసాద్, మల్లిక లెల్ల, సాయికిరణ్, రోమాంచకం ఫేమ్ మధు, విశ్వనాథ్ సన్స్ ఫేమ్ హారిక, భాను ప్రకాష్ కడియాల, మోత రాజేందర్ తదితరులు కీలక పాత్రలు పోషించనున్నారు. అక్షయ్ వసూరి డిఓపిగా పని చేస్తున్న ఈ చిత్రానికి కార్తికేయన్ రోహిణి ఎడిటర్‌గా, సుధ శ్రీనివాస్ సంగీత దర్శకుడిగా, లిరికల్ రైటర్ గా జైలర్ 2, ఓజి ఫేమ్ శ్రీనివాస మోళి పని చేయనున్నారు. ప్రముఖ రచయిత బివిఎస్ రవి ఈ చిత్రానికి క్లాప్ చేయగా హనుమాన్ చిత్ర నిర్మాత చైతన్య రెడ్డి గారు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మొదటి షాట్ చిత్ర దర్శకుడు మణికంఠ దర్శకత్వం చేయగా స్క్రిప్టును క్రేజీ కల్యాణం చిత్ర నిర్మాత బి జగన్ మోహన్ రెడ్డి గారు, బివిఎస్ రవి గారు అందజేశారు. ఈ ఈవెంట్ కు హాజరైన సంబరాల ఏటిగట్టు చిత్ర దర్శకుడు రోహిత్ కెపి, దర్శకుడు సముద్ర, నిర్మాతలు లగడపాటి శ్రీనివాసరావు, శ్రీకాంత్ ఈ చిత్ర యూనిట్‌కు తమ బెస్ట్ విషెస్ తెలిపారు.

## 'పిఠాపురంలో.. అలా మొదలైంది'18న విడుదల



ప్రముఖ దర్శకులు'ప్రేయసి రావే ఫేమ్ మహేష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన'పిఠాపురంలో.. అలా మొదలైంది చిత్రం సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ ఫ్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా తదితరులు నటించిన ఈ చిత్రాన్ని మహేష్ చంద్ర సినిమా టీమ్ మరియు ఎవర్ గ్రీన్ ఎపిక్ సినిమా సంయుక్త నిర్మాణంలో దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదారి కిట్టయ్య) నిర్మించారు.ప్రేమ, సునిశితమైన హాస్యం, సెంటిమెంట్, తండ్రీకూతుళ్ల అనుబంధం వంటి భావోద్వేగ అంశాలతో పాటు యువతకు ఒక మంచి సందేశాన్ని అందించేలా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు మహేష్ చంద్ర తెలిపారు.

## 'ఓం: చాప్టర్1ఉధిరం' వీడియో గ్లింప్స్ రిలీజ్



హీరో ధనుష్ లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'ఓం: చాప్టర్1ఉధిరం' ఇప్పటి వరకు విడుదలైన టైటిల్ ఫస్ట్ స్ట్రైక్ వీడియో, 'అలా కా లూవా సాంగ్ ఫ్యాన్స్, సినీ అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని, ఆసక్తిని నింపింది. ఈ క్రమంలో ఓం మూవీలో కీలక పాత్రలో నటించిన మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి పుట్టినరోజు (సెప్టెంబర్ 7) సందర్భంగా ఆయన పాత్రకు సంబంధించిన బర్త్ డే స్పెషల్ వీడియో గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు 'ఓం: చాప్టర్1ఉధిరం' చిత్రంలో మమ్ముట్టి పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నారు. ఆయన గురించి ఇంటర్‌పోల్ ఆఫీసర్స్ వెతుకుతుంటే ఆయనేమో తనకేమీ పట్టనట్లు క్రికెట్ మ్యాచ్ చూస్తుండటం వంటి సీన్స్‌ను ఈ బర్త్ డే స్పెషల్ వీడియోలో చూడొచ్చు. అసలు మమ్ముట్టి పాత్ర ఎలా ఉండబోతుందోనని ఎదురు చూసిన వారందరికీ ఈ సినిమాలో ఆయన పాత్ర చాలా స్టైలిష్‌గా ఉంటూనే క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్నఓం: చాప్టర్1 ఉదిరం: ది బ్లడ్ ఉడ్ ప్రతిష్టాత్మక కాంబినేషన్‌లో రూపొందుతోంది. ఈ చిత్రంలో ధనుష్, సాయి పల్లవి, శ్రీలీల, మమ్ముట్టి, నసీరుద్దీన్ షా, ఇంద్రన్స్ వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టెక్ స్టూడియోస్ బ్యానర్స్‌పై శ్రద్ధా అగర్వాల్, ధనుష్, అజ్మత్ జగ్మగ్ నిర్మిస్తోన్న ఈ సినిమా అక్టోబర్ 16న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ అవుతోంది.



## హాకీ ఆసియా కప్.. సెమీఫైనల్ బెర్త్‌కు దగ్గరలో భారత్

**మోఖీ:** దక్షిణ కొరియాను చిత్తుగా ఓడించిన భారత్, హాకీ జూనియర్ ఆసియా కప్ సెమీఫైనల్ బెర్త్‌కు మరింత చేరువైంది. మంగళవారం దక్షిణ కొరియాపై 7-3 తేడాతో ఘన విజయం సాధించడం ద్వారా భారత్ పూల్ ఎ లో అగ్రస్థానంలో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవడంతో సెమీఫైనల్స్‌లో స్థానానికి మార్గంన సుగమమైంది. ఇక ఆటను ప్రారంభించి 5వ నిమిషంలో అన్మోల్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో భారత్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. దోహ్యోన్ చోయ్ పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేసి కొరియా స్కోరును 1-1తో సమం చేశాడు. రెండో క్వార్టర్‌లో లవనూర్ సింగ్ (18వ నిమిషంలో) భారత్‌కు మళ్లీ ఆధిక్యాన్ని అందించాడు. కానీ హ్యోగుక్ యూ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చి స్కోరును 2-2తో సమం చేయడంతో కొరియా తిరిగి పుంజుకుంది. అజీత్ యాదవ్ (20వ) గోల్ చేయడంతో భారత్ మళ్లీ ఆధిక్యంలోకి వచ్చింది. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్లు అర్ధభాగం సమయానికి 3-2 ఆధిక్యంలో నిలిచారు. తర్వాత మూడవ క్వార్టర్‌లో యూ మళ్లీ లక్ష్యాన్ని ఛేదించి 2వ గోల్ సాధించి 3-3తో కొరియాను సమం చేశాడు. ప్రభ్‌దీప్ సింగ్ ప్రతిష్టంభనను ఛేదించి (42వ) భారత్‌ను 4-3తో ఆధిక్యంలోకి తెచ్చాడు. నాలుగో క్వార్టర్ 3 నిమిషాల్లో మూడు గోల్స్‌తో భారత్ చివరకు పూర్తి పట్టు సాధించింది. గుర్సేవక్ సింగ్ (55వ) భారత్ ఆధిక్యాన్ని పెంచగా, అన్మోల్ మరో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి స్కోరును 6-3కి చేర్చాడు. ఆర్యన్ జెస్(58వ) స్కోరింగ్‌ను పూర్తి చేయగా, భారత్ 7వ గోల్‌ను సాధించి, 7-3 తేడాతో ఘన విజయాన్ని ఖాయం చేసింది.

## వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ విజయం


**కితాక్యూషు (జపాన్):** జపాన్‌లోని కితాక్యూషులో మంగళవారం న్యూజిలాండ్‌పై 3-0 తేడాతో విజయం సాధించడం ద్వారా, 2026 ఏవీసీ పురుషుల వాలీబాల్ కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ తమ క్వార్టర్‌ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. చైనా, ఇరాన్‌ల చేతిలో వరుసగా స్ట్రెయిట్ సెట్లలో ఓడిపోయిన తర్వాత,ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ఇదే తొలి విజయం. పూల్ బిలో భారత్ ఒక విజయం, రెండు ఓటములు, మూడు పాయింట్లతో ముగించడంతో



క్వార్టర్‌ఫైనల్ అర్హత ఇతర పూల్స్‌లోని ఫలితాలపై ఆధారపడి ఉంది. కాగా భారత్, న్యూజిలాండ్‌ను 25-22, 25-18, 25-21 తేడాతో ఓడించింది. కాగా 12 జట్లు పాల్గొనే ఈ టోర్నమెంట్‌లో మొత్తం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన ఎనిమిది జట్లు క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. మూడు పాయింట్లు, మెరుగైన సెట్ నిష్పత్తితో ఉన్న చైనీస్ తైపీ వెనుక భారత్ ప్రస్తుతం 8వ స్థానంలో ఉంది, అయితే ఈ నెల 9న ఒమన్, బహ్రెయిన్ జట్లు తలపడిన తర్వాత తుది స్థానాలు ఖరారవుతాయి. ఒకవేళ ఒమన్ తమ మ్యాచ్‌ను 3-0 లేదా 3-1 తేడాతో గెలిస్తే, వారు టాప్ ఎయిట్‌లోకి ప్రవేశించి భారత్‌ను నిష్క్రమింపజేస్తారు. కానీ మిగతా ఏ సందర్భంలోనైనా భారత్ చివరి 8కి అర్హత సాధిస్తుంది. భారత్ తమ ప్రచారాన్ని చైనా చేతిలో 0-3 తేడాతో ఓటమితో ప్రారంభించగా, ఆ తర్వాత ఇరాన్ చేతిలో కూడా 0-3 తేడాతో ఓటమి చవిచూసింది.

## యుఎస్ ఓపెన్: క్వార్టర్ ఫైనల్స్‌కు కోకో గాఫ్

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్‌లో కోకో గాఫ్ వర్ధమాన యూఎస్ స్టార్ క్రీడాకారిణి ఇవా జోవిక్‌పై 80 నిముషాల్లో 6-1, 6-4 తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. అలాగే ఎలెనా రైబాకినా నవోమి ఒసాకాపై తిరుగులేని విజయంతో ముందంజ వేసింది. 2023 యూఎస్ ఓపెన్ ఛాంపియన్ ఇప్పుడు తన 12వ గ్రాండ్ స్లామ్ క్వార్టర్ ఫైనల్‌కు, న్యూయార్క్‌లో మూడవసారి చేరుకుంది. గాఫ్, జోవిక్‌తో జరిగిన తొలి సెట్‌లో మూడుసార్లు సర్వ్‌ను బ్రేక్ చేసి, చివరి 13 పాయింట్లలో 12 గెలుచుకుని ఆధిపత్యం చెలాయించింది. జోవిక్ తొలి గేమ్‌ను గెలుచుకున్నప్పటికీ, సెట్ సాగేకొద్దీ గాఫ్ యొక్క తీవ్రతను అందుకోవడానికి ఆమె



ఇబ్బంది పడింది. రెండవ సెట్‌లోని ఐదవ గేమ్‌లో గౌఫ్ మరో బ్రేక్ సాధించగా, జోవిక్ వెంటనే బ్రేక్ బ్యాక్ చేసి స్కోరును సమం చేసింది. ఆ తర్వాత మాజీ ఛాంపియన్ మరో నిర్ణయాత్మక బ్రేక్ సాధించి 5-4 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అనంతరం మ్యాచ్‌ను తన సర్వ్‌తో ముగించి క్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. గౌఫ్ తదుపరి ఐదో సీడ్, కొత్తగా రోలాండ్ గారోస్ ఛాంపియన్‌గా నిలిచిన 19 ఏళ్ల ఆంద్రీవాతో తలపడనుంది. మరో నాలుగో రౌండ్ పోరులో, ఒసాకాపై తిరుగులేని విజయంతో రైబాకినా క్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకుంది.





## అయ్యర్ టీమ్.. గిల్ టీమ్

### అక్టోబరు 3న అరుదైన చరిత్రాత్మక ఘటన

### ఒకే రోజు టీమిండియాకు రెండు మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ:** అప్‌కమింగ్ ఆసియా గేమ్స్ 2026 క్రికెట్ షెడ్యూల్ విడుదలైంది. జపాన్‌లోని ఐచి నగోయా వేదికగా జరిగే ఈ టోర్నీలో భారత జట్టు ఈ నెల 28న తొలి మ్యాచ్ ఆడనుంది. మెరుగైన ఐసీసీ ర్యాంక్ కారణంగా భారత్ నేరుగా క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. అయితే ఈ క్రికెట్ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 3న అత్యంత అరుదైన చారిత్రాత్మక ఘటన ఆవిష్కృతం కానుంది. ఆ ఒక్క రోజే భారత పురుషుల క్రికెట్ జట్టు రెండు వేర్వేరు మ్యాచ్‌లు ఆడనుంది. ఆసియా గేమ్స్ 2026లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు తలపడితే, అదే రోజు శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత వన్డే టీమ్ వెస్టిండీస్‌తో ఆడనుంది. అయితే ఆసియా గేమ్స్ 2026 ఫైనల్‌కు భారత్ చేరితేనే ఈ అరుదైన ఘనత ఆవిష్కృతం కానుంది. ఆసియా గేమ్స్ 2026 క్రికెట్ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28న భారత్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఆడనుంది. అక్టోబర్ 1న సెమీఫైనల్స్ జరగనుండగా, 3న ఫైనల్ జరుగుతుంది. అదే అక్టోబర్ 3న భారత్‌లో న్యూ చండీగఢ్ వేదికగా భారత్, వెస్టిండీస్ మధ్య మూడో వన్డే జరగనుంది. ఒకవేళ భారత జట్టు ఆసియా గేమ్స్ ఫైనల్ చేరితే, రెండు భారత జట్లు ఒకే రోజున వేర్వేరు దేశాల్లో ఆడుతాయి. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి సీనియర్ ఆటగాళ్లు ఆడనున్నారు. ఆసియా గేమ్స్‌లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టులో సంజూ శాంసన్, బుమ్రా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీ వంటి టాప్ ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. కాగా భారత క్రికెట్ చరిత్రలోనే ఇలా ఒకే రోజు రెండు మ్యాచ్‌లను వేర్వేరు టీమ్స్ ఆడటం ఇది రెండోసారి. 28 ఏళ్ల క్రితం 1998లో సెప్టెంబర్ 12న కౌలాలంపూర్‌లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో ఒక జట్టు.. టొరంటోలో జరిగిన సహారా కప్‌లో మరో జట్టు తలపడింది. 28 ఏళ్ల తర్వాత మళ్లీ అలాంటి సంఘటనే చోటు చేసుకుంటుంది. ఆసియా గేమ్స్ కోసం భారత పురుషుల క్రికెట్ టీమ్ కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ వ్యవహరించనుండగా, గిల్ సేనను శుభ్‌మన్ గిల్ నడిపించనున్నాడు.

## మహిళల టి20 ఆసియా కప్ సెమీస్‌కు పాకిస్థాన్



### 72 రన్స్ తేడాతో హాంకాంగ్ ఓటమి

**దుబాయ్:** నష్రా సంధు రికార్డు స్థాయిలో ఆరు వికెట్లు తీసి పాకిస్థాన్‌ను మహిళల ఆసియా కప్ సెమీఫైనల్స్‌కు చేర్చింది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన మహిళల టీ20 ఆసియా కప్ గ్రూప్ ఎ మ్యాచ్‌లో, ఎడమచేతి వాటం స్పిన్నర్ నష్రా సంధు ఆరు వికెట్లతో తన కెరీర్‌లోనే అత్యుత్తమ టీ20ఐ ప్రదర్శన కనబరచగా పాకిస్థాన్, హాంకాంగ్ ను 72 పరుగుల తేడాతో ఓడించింది. ఈ విజయంతో పాకిస్థాన్ సెమీఫైనల్‌లో స్థానం దక్కించుకుంది. మూడు మ్యాచ్‌లలో నాలుగు పాయింట్లతో గ్రూప్ ఎ లో రెండవ స్థానంలో నిలిచిన పాకిస్థాన్, ఈ నెల 11న జరిగే రెండవ సెమీఫైనల్‌లో శ్రీలంకతో తలపడనుంది. కాగా 8 వికెట్ల నష్టానికి 143 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో, పాకిస్థాన్ ఆరంభంలోనే వికెట్లు తీసినప్పటికీ, నష్రా హాంకాంగ్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చింది. 28 ఏళ్ల ఈ స్పిన్నర్ 4076 గణాంకాలతో ముగించగా, 19 ఓవర్లలో హాంకాంగ్ 71 పరుగులకే ఆలౌట్ అయింది. టీ20ఐలలో పాకిస్థాన్ మహిళా క్రికెటర్ చేసిన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనగా కూడా నష్రా నిలిచింది.



అంతకుముందు, బ్యాటింగ్ చేయమని కోరిన పాకిస్థాన్ తమ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. షవాల్ జుల్ఫికర్ 47 పరుగులు చేయగా, అయేషా జాఫర్ 26 పరుగులు చేయగా, కెప్టెన్ ఫాతిమా సనా 24 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. జాయ్లాన్ కౌర్ 19 పరుగులకు 4 వికెట్లు తీసి హాంకాంగ్ తరఫున అత్యంత విజయవంతమైన బౌలర్‌గా నిలవగా, ఇఖ్రా సహర్, క్యారీ చాన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

## జియోబ్లాక్‌రాక్ అడ్వాంటేజ్ ఫండ్ ప్రారంభం

**ముంబయి, సెప్టెంబరు 8:** జియోబ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ మంగళవారం జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కంపెనీ నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.22,000 కోట్లను దాటిందని, మార్చిలో ఈ ఏయూఎం దాదాపు రూ.16,000 కోట్లుగా ఉండగా ఇపుడు గణనీయంగా పెరిగిందని వివరించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏయూఎం రూ.25,000 కోట్ల మార్కును దాటుతుందని కంపెనీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ రిషి కోహ్లి ధీమా వ్యక్తం చేశారు. కంపెనీ ఏయూఎం ఇప్పటికే రూ.22,000 కోట్లకు చేరుకుంది.




పెట్టుబడిదారుల నుంచి స్పందన ఆరోగ్యకరంగా ఉంది. మరిన్ని ఉత్పత్తులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది ద్వితీయార్థంలో మరిన్ని ఫండ్లను అందుబాటులోకి తీసుకురానున్నందున మరింత ఆసక్తికరంగా ఉంటుం అన్నారు. జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ ఓపెన్‌ఎండెడ్ డైనమిక్ అసెట్ అలోకేషన్ పథకం. ఈ ఫండ్‌కు సంబంధించిన న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) ఈనెల 11న ప్రారంభమై 25న ముగుస్తుంది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈక్విటీ, డెట్ సాధనాల్లో పెట్టుబడులను డైనమిక్‌గా మార్చుకుంటూ దీర్ఘకాలిక మూలధన వృద్ధిని అందించడం ఈ ఫండ్ లక్ష్యమని కంపెనీ తెలిపింది.

## ఎన్ఎస్ఇలో 35 శాతం వాటా విక్రయానికి బీవోబీ రెడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లో తనకున్న వాటాలో సుమారు 35 శాతం లేదా గరిష్ఠంగా 76,90,375 ఈక్విటీ షేర్లను విక్రయించాలని బ్యాంక్ ఆఫ్ బరోడా నిర్ణయించింది. ఆఫర్ ఫర్ సేల్ విధానంలో, ఎన్ఎస్ఈ ప్రతిపాదిత ఐపీఓ ద్వారా ఈ వాటాను విక్రయించనున్నట్లు మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో బ్యాంక్ వెల్లడించింది.ఓఎఫ్ఎస్ ప్రక్రియలో భాగంగా ఈక్విటీ షేర్లను మంగళవారమే ఎస్క్రో ఖాతాకు బదిలీ చేసినట్లు తెలిపింది. ఈ వాటా విక్రయ ప్రక్రియ సెప్టెంబర్ 2026 చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని బ్యాంక్ పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్ఎస్ఈ నుంచి బ్యాంక్ ఆఫ్ బరోడాకు సుమారు




రూ.76.9 కోట్ల డివిడెండ్ లభించింది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఎన్ఎస్ఈ ఐపీఓకు అనుమతి ఇచ్చిన కొద్ది రోజులకే బ్యాంక్ ఆఫ్ బరోడా వాటా విక్రయానికి సంబంధించిన తాజా పరిణామం చోటుచేసుకుంది.ఎన్ఎస్ఈ ఐపీఓకు సంబంధించి సెప్టెంబర్ 11న ప్రైస్ బ్యాండ్‌ను ప్రకటించే అవకాశం ఉందని, ఈ నెల మూడో వారంలో ఎన్ఎస్ఈ షేర్లను స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాలని భావిస్తున్నట్లు గతంలో వర్గాలు తెలిపాయి.2026 ఆగస్టులోనే ఎన్ఎస్ఈ ఐపీఓకు సెబీ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ లభించింది. 2026 జూలై 30న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సెప్టెంబర్ నాటికి బీఎస్ఈలో లిస్టింగ్ కావచ్చని మార్కెట్ నిపుణులు చెపుతున్నారు.



## బేస్ ఇయర్ మార్పులవల్లనే జిడిపిపై అపోహాలు

### ఎస్బీఐ రీసెర్చి నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** భారత తాజా జీడీపీ గణాంకాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో, గత త్రైమాసికాల నామినల్ జీడీపీ అంచనాల్లో భారీ మార్పులు రావడంపై ఎస్‌బీఐ రీసెర్చ్ వివరణ ఇచ్చింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త జాతీయ ఖాతాల సిరీస్‌లో చేసిన సవరణలు ఎలాంటి వివరణ లేని సర్దుబాట్లు కాదని, జీడీపీ బేస్ ఇయర్, గణన పద్ధతిలో మార్పుల ఫలితమేనని తన తాజా నివేదికలో పేర్కొంది.2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత వాస్తవ జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైన నేపథ్యంలో ఈ చర్చ తెరపైకి వచ్చింది. గత జీడీపీ సిరీస్‌తో పోలిస్తే తాజా అంచనాల్లో భారీ వ్యత్యాసం కనిపించడంపై పలు ప్రశ్నలు తలెత్తాయి. ఎస్‌బీఐ రీసెర్చ్ ప్రకారం, 2009 నుంచి ఇప్పటివరకు 70 త్రైమాసికాల్లో జీడీపీ గణాంకాల్లో 239 సార్లు సవరణలు జరిగాయని వీటిలో 134 సార్లు అంచనాలను పైకి సవరించగా, 105 సార్లు కిందికి సవరించారు. కొత్త సిరీస్‌లో చేసిన సవరణల స్థాయి కూడా గణనీయంగా ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. 2023 తొలిత్రైమాసికం నుంచి 2026 రెండోత్రైమాసికం మధ్య నామినల్ జీడీపీని రూ.41.8 లక్షల కోట్ల మేరకు కిందికి సవరించగా, వాస్తవ జీడీపీని రూ.372 లక్షల కోట్ల మేరకు పైకి సవరించారు. ఈ రెండు మార్పులను కలిపి చూడాల్సిందే తప్ప, నామినల్ జీడీపీలో జరిగిన సవరణను మాత్రమే విడిగా పరిగణించకూడదని ఎస్‌బీఐ తెలిపింది.వాణిజ్యం, హోటళ్లు, రవాణా రంగాలపై ప్రభావంరంగాల వారీగా చూస్తే, వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్ రంగాల్లో కేంద్రీకృతమైందని నివేదిక తెలిపింది.అదే సమయంలో ఆర్థిక, బీమా, రియల్ ఎస్టేట్, వ్యాపార సేవల రంగాల్లో రూ.13.6 లక్షల కోట్ల మేర పైకి సవరణ జరిగింది. జీడీపీ డిఫ్లేటర్‌పైనా విశ్లేషసీపీఐ, డబ్ల్యూపీఐ వంటి ప్రధాన ద్రవ్యోల్బణ సూచీలతో పోలిస్తే భిన్నమైన ధోరణి కనిపిస్తున్న జీడీపీ డిఫ్లేటర్ అంశాన్ని కూడా ఎస్‌బీఐ రీసెర్చ్ పరిశీలించింది. పెట్టుబడులు కూడా బలమైన ఆర్థిక కార్యకలాపాలకు సంకేతంఅధిక ఫ్రీక్వెన్సీ ఆర్థిక సూచీలు, పెట్టుబడుల గణాంకాలు దేశ ఆర్థిక కార్యకలాపాలు బలంగా ఉన్నాయన్న విషయాన్ని సూచిస్తున్నాయని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది.2023నుంచి ప్రైవేట్ రంగంలో అదనపు పెట్టుబడులు సగటున ఏటా రూ.3.5 లక్షల కోట్లుగా నమోదయ్యాయని పేర్కొంది.2019 వరకు ఉన్న ఆరు సంవత్సరాల్లో ఈ సగటు రూ.3.3 లక్షల కోట్లుగా ఉండేదని తెలిపింది.



## మార్కెట్లకు మళ్లీ నష్టాలు..

### సెన్సెక్స్ 555 పాయింట్లు డౌన్

**ముంబయి, సెప్టెంబరు 8:** దేశీయ స్టాక్ మార్కెట్ల కీలక సూచీలు మంగళవారం వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు మరింత తీవ్రతరం అవుతాయన్న ఆందోళనల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ బలంగా ఉండటం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లపై ఆందోళనలు పెరగడంతో ప్రైవేట్ బ్యాంకులు, చమురుగ్యాస్, ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి.సెన్సెక్స్ 555 పాయింట్లు పతనంబీఎస్ఈ సెన్సెక్స్ 555.23 పాయింట్లు నష్టపోయి 75,577.58 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 144.05 పాయింట్లు క్షీణించి 23,635.10 వద్ద స్థిరపడింది. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.23 శాతం, నిఫ్టీ 1.10 శాతం చొప్పున నష్టపోయాయి.నిఫ్టీలో ఐసిఐసిఐబ్యాంకు 1.97 శాతం, రిలయన్స్ 1.11 శాతం,హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు 1.06 శాతం నష్టపోయి సూచీపై అధిక ప్రతికూల ప్రభావం చూపాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.27 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.17 శాతం లాభపడ్డాయి. బీఎస్ఈలో మొత్తం 2,096 షేర్లు లాభాల్లో ముగియగా, 2,291 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 239 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్‌లో నవంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 2.04 డాలర్లు పెరిగి 98.32 డాలర్లకు చేరింది. భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ ఈల్డ్ గత సెషన్ ముగింపు 6.957 శాతంతో పోలిస్తే 0.09 శాతం తగ్గి 6.951 శాతంగా నమోదైంది.ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి విలువ కూడా క్షీణించింది. గత సెషన్‌లో 94.5650 వద్ద ముగిసిన రూపాయి, మంగళవారం డాలర్‌తో పోలిస్తే 94.8300 వద్ద ట్రేడైంది.ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్ బంగారం ఫ్యూచర్స్ 0.12 శాతం పెరిగి రూ.1,52,994కు చేరాయి.లాభపడ్డ షేర్లుసన్సెరా ఇంజినీరింగ్ 3.30 శాతం పెరిగింది.పాలీక్యాబ్ ఇండియా 1.36 శాతం లాభపడింది.గరుడ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజినీరింగ్ 1.56 శాతం పెరిగింది.జీఈ వెర్నోవా టి డి 8.77 శాతం దూసుకెళ్లింది.ఆర్గానిక్ రీసైక్లింగ్ సిస్టమ్స్ 4.11 శాతం ఎగబాకింది. సింఫనీ 5.72 శాతం భారీగా పెరిగింది.నష్టపోయిన షేర్లుషిప్‌రాకెట్ 0.97 శాతం క్షీణించింది. శ్రీ లోటస్ డెవలపర్స్ అండ్ రియాల్టీ 1.36 శాతం పడిపోయింది.

## ఆర్థికవ్యవస్థ పురోగతిలో ఫిన్‌టెక్ భాగస్వామ్యం

### ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**ముంబయి, సెప్టెంబరు 8:** ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో ఫిన్‌టెక్ రంగాన్ని రిజర్వుబ్యాంకు విలువైన భాగస్వామిగా పరిగణిస్తోందని సెంట్రల్ బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఆర్థిక సేవలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం, కస్టమర్ల అనుభవాన్ని మెరుగుపరచడం, వేగవంతమైన, సమర్థవంతమైన రుణాల పంపిణీకి ఫిన్‌టెక్ రంగం కీలకంగా మారిందని ఆయన పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ సమక్షంలో మంగళవారం జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్ 2026లో మల్హోత్రా ప్రసంగించారు. స్టార్టప్‌లు, ఫిన్‌టెక్ కంపెనీలు, ఇతర భాగస్వాములతో నిరంతర, బహిరంగ, నిర్మాణాత్మక చర్చలు జరపడం ఆర్‌బీఐ విధానంలో కీలక భాగమని తెలిపారు. భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో ఫిన్‌టెక్‌ను ఆర్‌బీఐ ఎప్పటి నుంచో విలువైన భాగస్వామిగా చూస్తోందని మల్హోత్రా అన్నారు. ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన రెగ్యులేటరీ శాండ్‌బాక్స్, రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్‌తో పాటు ఫిన్‌టెక్ రంగంతో కొనసాగిస్తున్న చర్చలు కూడా ఇదే విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు. నిరంతర, బహిరంగ, నిర్మాణాత్మక చర్చల ద్వారానే మెరుగైన విధానాలను రూపొందించగలమనే నమ్మకంతో ఆర్‌బీఐ పనిచేస్తోందని వివరించారు.బ్యాంకింగ్ సేవలను బ్యాంకు శాఖల నుంచి ప్రతి పౌరుడి చేతిలోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు.చిన్న పట్టణంలోని దుకాణదారుడు, మారుమూల గ్రామంలోని రైతు, మెట్రో నగరంలోని యువ ఉద్యోగి.. వీరంతా ఒకే విధమైన సులభమైన డిజిటల్ వ్యవస్థ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు, పొదుపు చేస్తున్నారు, రుణాలు పొందుతున్నారన్నారు. యూపీఐ, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థలు, జనధన్ పథకం వంటి డిజిటల్ మౌలిక వసతులు దీనికి బలమైన పునాదిగా నిలిచాయని ఆయన అన్నారు.ఆర్థిక సమ్మిళితత్వం ఇక కేవలం ప్రభుత్వ విధాన లక్ష్యంగా మాత్రమే కాకుండా, కోట్లాది మంది భారతీయుల రోజువారీ జీవితంలో వాస్తవంగా మారిందని గవర్నర్ పేర్కొన్నారు.ఎంఎస్ఎంఈలకు రుణాల అందుబాటులో కీలక పాభారతదేశంలోని విభిన్న వర్గాల ప్రజలను అధికారిక ఆర్థిక




వ్యవస్థతో ఫిన్‌టెక్ రంగం వేగంగా, తక్కువ ఖర్చుతో అనుసంధానించడంలో సహాయపడిందని మల్హోత్రా తెలిపారు. అదే సమయంలో ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని కూడా గణనీయంగా పెంచిందన్నారు. ఎంఎస్ఎంఈలకు రుణాల పంపిణీలో ఫిన్‌టెక్ ప్రభావం ఎక్కువని రుణాలు, అకౌంట్ అగ్రిగేటర్లు, యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ వంటి వ్యవస్థల ద్వారా చిన్న వ్యాపారాలకు రుణాలు అందుతున్నాయని చెప్పారు.

గతంలో సంప్రదాయ రుణ అంచనా విధానాలకు దూరంగా ఉన్న చిన్న వ్యాపారాలకు తక్కువ పూచీకత్తుతో అధికారిక రుణాలను అందించడం ద్వారా దేశంలోని ఎంఎస్ఎంఈ రుణ అంతరాన్ని పూడ్చడంలో ఫిన్‌టెక్ కంపెనీలు సహాయపడుతున్నాయని తెలిపారు

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.